ESTD: 1999
www.voodayam.com

వుదయం

ఆదిలాబాద్ 24-09-2026 గురువారం | సంపుటి : 14 | సంచిక :16 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal | Follow us on

2029 నాటికి డ్రగ్స్ రహిత

తెలంగాణే లక్ష్యం

ఈగల్ ఫోర్స్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

మాదకద్రవ్యాల నిర్మూలనలో తెలంగాణ ముందంజ

జాతీయ అవార్డు సాధించిన ఈగల్ ఫోర్స్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (వుదయం) :
రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణలో విశేష సేవలు అందిస్తూ దేశంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన తెలంగాణ ఈగల్ ఫోర్స్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. మాదకద్రవ్యాల విక్రయం, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కఠిన చర్యలకు ఈ జాతీయ స్థాయి గుర్తింపు నిదర్శనమని ఆయన కొనియాడారు. రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాల యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ మూడో జాతీయ సదస్సులో ఈగల్ ఫోర్స్ సంచాలకులు సందీప్ శాండిల్య అత్యుత్తమ పురస్కారాన్ని అందుకోవడం తెలంగాణ పోలీస్ వ్యవస్థకు, రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సమర్థవంతమైన విధానాలకు ఈ పురస్కారం మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల మహమ్మారిని అరికట్టడం కేవలం పోలీసు వ్యవస్థ బాధ్యత మాత్రమే కాదని, యువతను ఈ వ్యసనం బారిన పడకుండా కాపాడుకోవడం ప్రతి కుటుంబం, విద్యాసంస్థలు మరియు పౌరులందరి సమిష్టి బాధ్యత అని స్పష్టం చేశారు. యువతే రాష్ట్రానికి, దేశానికి భవిష్యత్తు అని పేర్కొంటూ, వారిని రక్షించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. రెండు వేల ఇరవై తొమ్మిది డిసెంబర్ నాటికి పూర్తిస్థాయి డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా ఈగల్ ఫోర్స్ మరింత దృఢ నిశ్చయంతో ముందుకు సాగాలని, నషా ముక్త భారత్ సాధనలో రాష్ట్రం ముందుండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

ఆర్థిక ప్రగతికి నూతన బాటలు

2047లో 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (వుదయం) :
తెలంగాణ రాష్ట్రానికి భారీగా విదేశీ మరియు దేశీయ పెట్టుబడులను ఆకర్షించడమే పరమావధిగా రాబోయే రెండు వేల ఇరవై ఆరు డిసెంబర్ ఏడు నుంచి తొమ్మిదో తేదీ వరకు నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' ఏర్పాట్లను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రాష్ట్ర భవిష్యత్తును, ఆర్థిక ప్రగతిని నూతన శిఖరాలకు చేర్చే ఈ చారిత్రాత్మక ఘట్టంలో అధికారులంతా పూర్తి స్ఫూర్తితో భాగస్వాములై సదస్సును దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. సెక్రటేరియట్‌లో బుధవారం నిర్వహించిన ఉన్నత స్థాయి సన్నాహక సమావేశంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న రెండో అంతర్జాతీయ సదస్సు ఇదని, దీని ద్వారా రాష్ట్ర సమగ్ర వికాసానికి బలమైన పునాదులు వేయాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

రెండు వేల నలభై ఏడు నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ఈ గ్లోబల్ సమ్మిట్ ఆ బృహత్తర గమ్యానికి కీలక మైలురాయి కానుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సదస్సు పర్యవేక్షణకు పది ప్రత్యేక అధికారుల కమిటీలతో పాటు మంత్రుల నాయకత్వంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పనుల రూపకల్పన, నిధుల అంచనాలు, ఆమోదాల ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా నిరంతరం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సదస్సు ప్రచారాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు అన్ని రకాల ప్రసార మాధ్యమాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్న దేశాలు, నగరాలను గుర్తించి అంతర్జాతీయ, దేశీయ స్థాయిలలో ప్రచార కార్యక్రమాలు (రోడ్‌షోలు) నిర్వహించేందుకు స్పష్టమైన కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గతంలో కుదిరిన ఒప్పందాల అమలు పురోగతిని కూడా సమీక్షించాలని కోరారు. అధికారులు వెంటనే ప్రత్యేకాధికారుల బృందాలతో సమావేశమై నిరంతర పర్యవేక్షణ కేంద్రం (వార్ రూమ్) ద్వారా పనులను ప్రతిరోజూ పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రతినిధుల స్పందనకు అనుగుణంగా సభా ప్రాంగణాల సంఖ్యను పెంచేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతిని మార్చే ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహణలో ఎక్కడా రాజీ పడకుండా విజయవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ

పథకం ఆయుష్మాన్ భారత్

పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ధ్యేయం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 (ఎఎంఎస్) :
దేశంలో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణాన్ని లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం విజయవంతంగా ఎనిమిదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు సందేశాన్ని అందించారు. ఈ పథకం ద్వారా సుమారు అరవై కోట్ల మంది లబ్ధిదారులు ప్రతి ఏటా ఐదు లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య బీమా సౌకర్యాన్ని పొందుతున్నారని ఆయన తెలిపారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఉచిత ఆరోగ్య సంరక్షణ పథకంగా నిలిచిందని మోదీ కొనియాడారు. ఆరోగ్య సంరక్షణ సేవలు ప్రతి ఇంటా అందుబాటులోకి రావడం వల్ల క్షేత్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ మరింత బలోపేతమవుతోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం సాధించిన పురోగతిపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా మాట్లాడుతూ.. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా నలభై ఎనిమిది కోట్లకు పైగా ఆయుష్మాన్ గుర్తింపు కార్డులను ప్రజలకు అందజేసినట్లు వివరించారు. దేశంలోని ముప్పై తొమ్మిది వేలకు పైగా నమోదిత ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల ద్వారా ఇప్పటివరకు రెండు లక్షల కోట్ల రూపాయలకు పైగా విలువైన ఉచిత వైద్య సేవలను పేదలకు అందించినట్లు ఆయన వెల్లడించారు. నిరంతరం పెరుగుతున్న వైద్య ఖర్చుల భారం సామాన్యులపై పడకుండా, సరైన సమయానికి నాణ్యమైన చికిత్స అందాలనే సుదూర ఆలోచనతో ప్రధాని మోదీ ఈ విప్లవాత్మక పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. కాగా, రెండు వేల పద్దెనిమిదిలో ఝార్ఖండ్ రాష్ట్రం నుంచి ఈ పథకం ప్రారంభమైన విషయం విదితమే.

డిసెంబర్‌లో ప్రధాని మోదీ విదేశీ పర్యటన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 (ఎఎంఎస్) : వ్యాపార, వ్యూహాత్మక భాగస్వామ్యాలను విస్తరించే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ రాబోయే డిసెంబర్‌లో అమెరికా, కెనడా, జర్మనీ, బెల్జియం దేశాల్లో విస్తృతంగా పర్యటించనున్నారు. జర్మనీలో ద్వైపాక్షిక చర్చలతో ప్రారంభమయ్యే ఈ పర్యటనలో భాగంగా, అమెరికాలోని మియామీలో డిసెంబర్ 14 15 తేదీల్లో జరిగే జీ20 సదస్సులో ఆయన పాల్గొంటారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో మోదీ భేటీ అయి పలు కీలక అంశాలపై చర్చించనున్నారు.

'కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది'

రైతులకు ఇచ్చిన మాట ప్రకారం 24 గంటల కరెంట్ ఇవ్వాల్సిందే: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (వుదయం) :
కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తాము గతంలోనే హెచ్చరించామని, ప్రస్తుతం రాష్ట్రంలో అదే పరిస్థితి పునరావృతమవుతోందని భారత్ రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలన మొదలవ్వగానే విద్యుత్ కోతలు ప్రారంభమయ్యాయంటూ మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థ అత్యంత సమర్థవంతంగా నడిచిందని, కానీ ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక అన్ని ప్రాంతాల్లో కరెంట్ కష్టాలు మొదలయ్యాయని పత్రికల్లో సైతం కథనాలు వస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఏ సబ్‌స్టేషన్‌ను పరిశీలించినా రోజుకు ఆరు గంటలకు మించి సరఫరా జరగడం లేదని ఆయన ఆరోపించారు. కరెంట్ కోతలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ప్రకృతి వైపరీత్యమైన ఎల్‌నినోను కారణాలుగా చూపుతున్నారని, కానీ ఇది ఎల్ నినో సమస్య కాదని, రాష్ట్రంలో నడుస్తున్న 'కాంగ్ నినో' పాలన వల్లే ఈ దుస్థితి దాపురించిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో జెన్‌కో వద్ద తగినన్ని బొగ్గు నిల్వలు లేకపోవడంతో పాటు సింగరేణి నుంచి ఏకంగా నలభై లక్షల టన్నుల బొగ్గు మాయమైందని తీవ్ర ఆరోపణలు చేశారు. నిల్వలు సమృద్ధిగా ఉంటే థర్మల్ విద్యుత్ కేంద్రాలను ఎందుకు మూసివేస్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. మరోవైపు నీటి లభ్యత లేక జల విద్యుత్ కేంద్రాలు కూడా మూతపడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలోని వ్యవసాయ రంగానికి ఖచ్చితంగా ఇరవై నాలుగు గంటల ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ట్రంప్‌కు ఎదురుదెబ్బగా మారిన జిన్‌పింగ్

ఎలాంటి పారిశ్రామిక బృందం లేకుండానే అమెరికాకు జిన్‌పింగ్



వాషింగ్టన్: చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ రెండు రోజుల అమెరికా పర్యటన ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు అనుకున్న స్థాయిలో కలిసివచ్చేలా కనిపించడం లేదు. చైనా అగ్రనేతకు స్వాగతం పలికేందుకు స్వయంగా ట్రంప్ విమానాశ్రయానికి వెళ్తున్నప్పటికీ, చైనా వ్యాపార సంస్థలతో భారీ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలనే ఆయన ఆశలు నెరవేరేలా లేవు. ఈ పర్యటనకు జిన్‌పింగ్ ఒక్కరే హాజరవుతున్నారని, ఆయన వెంట చైనాకు చెందిన ఏ ఒక్క వ్యాపారవేత్త లేదా పారిశ్రామిక దిగ్గజం రావడం లేదని అమెరికా ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. రెండు దేశాల మధ్య జరగనున్న కీలక భేటీకి అమెరికా వైపు నుంచి ప్రముఖ సాంకేతిక, ఆర్థిక సంస్థల అధిపతులు హాజరవుతుండగా, చైనా వైపు నుంచి పారిశ్రామికవేత్తలు ఎవరూ రావడం లేదని అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. గతంలో పెద్ద ఎత్తున వ్యాపారవేత్తలతో వచ్చిన జిన్‌పింగ్, ఈసారి రాజకీయ, కృత్రిమ మేధ, తైవాన్ వివాదాల నేపథ్యంలో ఒంటరిగానే రావడం గమనార్హం. మరోవైపు అమెరికాలో మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ భేటీ ట్రంప్ యంత్రాంగానికి ఎంతో కీలకంగా మారింది. ఈ సమావేశంలో సాధించే ఫలితాలను తమ విజయంగా చెప్పుకుని ఎన్నికల బరిలోకి దిగాలని పాలకవర్గం భావిస్తోంది. ఒకవేళ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వస్తే చట్టసభల్లో అధికార పార్టీ ఆధిపత్యానికి గండిపడే ప్రమాదం ఉంది. ఇదిలా ఉండగా, చైనా అధ్యక్షుడికి అట్టహాసంగా స్వాగతం పలకాలన్న ట్రంప్ నిర్ణయంపై సొంత రిపబ్లికన్ పార్టీలోనే తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. చైనా కమ్యూనిస్ట్ పార్టీతో ఉన్న తీవ్రమైన విభేదాల దృష్ట్యా జిన్‌పింగ్‌ను వాషింగ్టన్‌కు ఆహ్వానించడం సరికాదని సెనెట్ ఆయుధ సేవల కమిటీ ఛైర్మన్ రోజర్ వికర్ ఆక్షేపించారు. చైనా సైనిక చర్యలు, ఇతర దేశాలకు అందిస్తున్న సహకారాన్ని విందు సమావేశం వేళ ట్రంప్ నిలదీయాలని, మన ముందుకు వస్తున్న అతిథి ఒక నియంత అని అధ్యక్షుడు గుర్తుంచుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు.

ఉస్మానియా ప్రాంగణంలో

ఉద్యోగ అవకాశాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (వుదయం) :
ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఉద్యోగ సమాచార సహాయ కేంద్రం (ఎంప్లాయిమెంట్ బ్యూరో) మరియు అపోలో ఫార్మసీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల ముప్పైవ తేదీన ప్రాంగణ ఉద్యోగాల ఎంపిక (జాబ్ మేళా) నిర్వహించనున్నారు. విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఉదయం పదకొండు గంటలకు ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అపోలో ఫార్మసీలో ఖాళీగా ఉన్న యాభై ఫార్మసిస్ట్ మరియు సహాయ ఫార్మసిస్ట్ ఉద్యోగాలను ఈ ప్రక్రియ ద్వారా భర్తీ చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. పద్దెనిమిది నుంచి ముప్పై ఐదు సంవత్సరాల వయస్సు కలిగి, డిఫార్మసీ, బిఫార్మసీ, ఎంఫార్మసీ లేదా ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఒక ప్రకటనలో తెలిపింది.

ఇంతే కదా...!



చోరీ రాజ్యాంగంపై దాడే...

సీఈసీపై చర్యలు తీసుకోవాల్సిందే

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 (ఎఎంఎస్) :
భారత ఎన్నికల సంఘంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నిర్ణయాలను ఏకపక్షంగా తీసుకుంటున్నారంటూ జాతీయ ప్రసార మాధ్యమాల్లో వెలువడిన కథనాలు దేశ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపాయి. ఈ నివేదికలపై స్పందించిన ప్రతిపక్ష నేతలు కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘం తీరుపై విమర్శలతో విరుచుకుపడ్డారు. దేశంలో ప్రజాస్వామ్య పునాదులను, ఎన్నికల వ్యవస్థను పూర్తిగా బలహీనపరిచిన సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని విపక్షాలు ఏకగ్రీవంగా డిమాండ్ చేశాయి. అధికార భారతీయ జనతా పార్టీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మరియు ఎన్నికల సంఘం పరస్పరం కుమ్మక్కై రాజ్యాంగ విరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్నాయని, ఎన్నికల ప్రక్రియను అడ్డుపెట్టుకుని ఓట్ల చోరీకి పూనుకుంటున్నాయని తీవ్రస్థాయిలో ఆరోపించారు.

ఈ అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఓట్ల తొలగింపు మరియు అక్రమాలు రాజ్యాంగంపై జరుగుతున్న ప్రత్యక్ష దాడి అని మండిపడ్డారు. ఈ కుట్రకు సీఈసీ ప్రధాన సూత్రధారిగా వ్యవహరిస్తున్నారని, దీని వెనుక ప్రధాని మోదీ మరియు ఇతర ముఖ్య నేతల ప్రమేయం ఉందని ప్రజలు గ్రహించారని వ్యాఖ్యానించారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ స్పందిస్తూ.. సీఈసీ అక్రమాల వల్లే మోదీ వరుసగా ఎన్నికల్లో విజయం సాధిస్తున్నారని ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్ట్ చేయడంతో పాటు ఆయన హయాంలో ఢిల్లీ, మహారాష్ట్ర, బీహార్, పశ్చిమ బెంగాల్, హర్యానా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలను తక్షణమే రద్దు చేసి, తిరిగి పారదర్శకంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

మరొకవైపు కాంగ్రెస్ నాయకుడు కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాసిన జ్ఞానేశ్ కుమార్‌కు సీఈసీ పదవిలో కొనసాగే అర్హత లేదని స్పష్టం చేశారు. అక్రమంగా ఓట్లను తొలగించినందుకు సీఈసీని తక్షణమే చేయాలని, ఈ కుట్ర వెనుక ఉన్న అసలు సూత్రధారులను తేల్చడానికి ముందస్తు ప్రథమ సమాచార నివేదిక నమోదు చేసి సమగ్ర విచారణ జరిపించాలని సీనియర్ న్యాయవాది, రాజకీయ నాయకుడు కపిల్ సిబల్ కోరారు. భారత ఎన్నికల సంఘాన్ని సంపూర్ణంగా నిర్వీర్యం చేయడానికే జ్ఞానేశ్ కుమార్‌ను అక్కడ నియమించారని, కోట్ల మంది భారతీయుల ఓటు హక్కును హరించినందుకు ఆయనకు కఠిన శిక్ష పడక తప్పదని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య

నాగర్ కర్నూల్, సెప్టెంబరు 23 (వుదయం ప్రతినిధి):

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని, నోటీసులు అందుకున్న ఓటర్లు హియరింగ్ కు హాజరయ్యేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య సూచించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 96,911 మంది ఓటర్లకు హియరింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఇంకా నోటీసులు అందుకొని హియరింగ్ కు హాజరు కావాల్సిన వారు 18,700 మంది ఉన్నారని వెల్లడించారు. నోటీసులు అందుకున్న వారంతా సంబంధిత బూత్ లెవల్ అధికారుల (బీఎల్వో) సమక్షంలో హియరింగ్ కు హాజరై అవసరమైన పత్రాలను సమర్పించేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. అదేవిధంగా మహబూబ్ నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ను వివరించారు. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబరు 28న ఓటర్ల నమోదుకు ప్రజా ప్రకటన జారీ, అక్టోబరు 15న మొదటి, అక్టోబరు 25న రెండో పునఃప్రచురణ, నవంబరు 6న ఫారం–18 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ, నవంబరు 25న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, నవంబరు 25 నుండి డిసెంబరు 10 వరకు అభ్యంతరాల స్వీకరణ, డిసెంబరు 30న తుది జాబితా ప్రచురణ ఉంటుందని తెలిపారు. అర్హులైన పట్టభద్రులు నిర్ణీత గడువులో ఫారం–18 ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, అర్హులెవరూ జాబితాలో తప్పిపోకుండా అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డికి కాళపూర్ గ్రామస్తులు ఘన సన్మానం

పూడూర్ సెప్టెంబర్ 24, (వూదయం)

వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం లోని కాలాపూర్ గ్రామ రైతుల భూ సమస్యపై చేపట్టిన పోరాటానికి మద్దతుగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీ నాయకులకు కాలాపూర్ గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ని, బీఆర్ఎస్ నాయకులను కాలాపూర్ గ్రామ సర్పంచ్ పులేందర్ , మాజీ సర్పంచ్ జంగయ్య ,జంగయ్య, తో పాటు గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు. రైతుల భూ సమస్య పరిష్కారం కోసం గ్రామస్తులు చేస్తున్న పోరాటానికి అండగా నిలిచినందుకు మహేష్ రెడ్డి కి గ్రామస్తులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కొప్పుల మహేష్ రెడ్డి మాట్లాడుతూ.. కాలాపూర్ గ్రామస్తులకు, రైతులకు ఎటువంటి సమస్య వచ్చినా ఇకముందు కూడా తన వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. రైతుల హక్కుల కోసం జరిగే పోరాటాలకు తమ పార్టీ తరపున అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ పి.మధుసూదన్ నాయక్

మహబూబ్‌నగర్, 23.09.2026

వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ గురువారం మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జన ప్రాంతాల్లో చేపడుతున్న భద్రత, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ దీపాల ఏర్పాటు, ప్రజల రద్దీ నియంత్రణ తదితర ఏర్పాట్లను అదనపు కలెక్టర్ సమీక్షించారు. నిమజ్జన కార్యక్రమానికి వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట్ల బ్యారికేడ్లు, లైటింగ్, భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, మున్సిపల్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

14 కొత్త రేషన్ దుకాణాలు.. డీలర్ల నియామకం

అలంపూర్ నియోజకవర్గ ప్రజలకు మరింత సౌకర్యవంతమైన రేషన్ సేవలు

శాంతినగర్ సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి)

అలంపూర్ నియోజకవర్గ ప్రజలకు రేషన్ సరుకుల పంపిణీలో ఇబ్బందులు లేకుండా మరింత సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు 14 కొత్త రేషన్ దుకాణాలను ఏర్పాటు చేసి డీలర్లను నియమించినట్లు అలంపూర్ మాజీ శాసనసభ్యులు, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ తెలిపారు. కొత్త రేషన్ దుకాణాల ఏర్పాటుకు సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సంపత్ కుమార్ ప్రత్యేకంగా మాట్లాడి చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా చేపట్టిన ఈ ప్రక్రియలో అర్హులైన వారిని డీలర్లుగా నియమించినట్లు తెలిపారు. రేషన్ దుకాణాల డీలర్ల నియామక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించినట్లు వెల్లడించారు. నియమితులైన డీలర్లకు సంబంధించిన నియామక ఉత్తర్వుల ప్రతులను బుధవారం శాంతినగర్‌లోని కాంగ్రెస్ పార్టీ శిబిర కార్యాలయంలో డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ అందజేశారు. 14 కొత్త రేషన్ దుకాణాలు అందుబాటులోకి రావడంతో అలంపూర్ నియోజకవర్గంలోని రేషన్ కార్డుదారులకు సరుకుల పంపిణీ మరింత సులభతరం కానుందని ఆయన తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ రేషన్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

ముబారస్‌పూర్‌లో పెన్షన్ దరఖాస్తుల పరిశీలన

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు

దౌల్తాబాద్ సెప్టెంబర్ 23(వుదయం):

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ముబారస్ పూర్ గ్రామంలో పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లను దౌల్తాబాద్ మండల వ్యవసాయ అధికారి ముబారస్‌పూర్ ప్రత్యేక అధికారి సాయికిరణ్ సందర్శించి దరఖాస్తులను పరిశీలించారు. లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో ధ్రువీకరించి, అర్హతకు సంబంధించిన సమాచారాన్ని నమోదు చేశారు. ముబారస్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'మా కే నామ్ పే ఏక్ పెడ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ సాయికిరణ్‌తో కలిసి అధికారులు మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను చేపట్టాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కానుగుల విజయస్వామి, పంచాయతీ కార్యదర్శి కిషోర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సీనియర్ నాయకుడు ఉజ్వల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిన డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి

వుదయం మనూరు సెప్టెంబర్ :23

సంగారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ), నూతన అధ్యక్షుడిగా పట్లోళ్ల,చంద్రశేఖర్ రెడ్డి నియమితులైన,సందర్భంగా వారి,స్వగృహం హైదరాబాదులో శాలువా,కప్పి బొకే, ఇస్తూ డిసిసి ఎన్నికకు, సహకరించినందుకు ధన్యవాదాలు,తెలిపిన డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల, చంద్రశేఖర్ రెడ్డి ఈ సందర్భంగా,డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు, స్వీకరించిన పట్లోళ్ల చంద్రశేఖర్,రెడ్డికి ఉజ్వల్ రెడ్డి శుభాకాంక్షలు,తెలిపారు. పార్టీ బలోపేతానికి,నిరంతరం కృషి చేయాలని,ఆకాంక్షించారు. జిల్లాలో,కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత,పటిష్టం చేయడంతో పాటు,ప్రజా సమస్యల,పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు,ప్రజాప్రతినిధులను సమన్వయం,చేసుకుంటూ ముందుకు,సాగుతామని ఈ సందర్భంగా,నాయకులు పేర్కొన్నారు.

దుంపలపల్లిలో రూ.23 వేలకు గణేశ్ లడ్డూ వేలం

దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 23, వుదయం:

సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని దుంపలపల్లి గ్రామంలో వినాయక లడ్డూ వేలం పాట ఉత్సాహభరితంగా సాగింది. గ్రామంలోని హనుమాన్ భజన మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా స్వామివారి లడ్డూకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో స్థానిక భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. చివరకు ధర్మారెడ్డి అన్విత రెడ్డి అత్యధికంగా రూ. 23,000 (ఇరవై మూడు వేల రూపాయలు) వేలం వేసి లడ్డూను దక్కించుకున్నారు. తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాథుడి ప్రసాదం తమకు లభించడం భగవంతుడి కృప అని, ఎంతో సంతోషంగా ఉందని అన్విత రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం వేలంలో దక్కించుకున్న పవిత్ర లడ్డూను ఆమె తన తాత ధర్మారెడ్డి వెంకట్ రెడ్డి, నానమ్మలకు అందజేసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా ఎంపికలకు ఉద్యోగులు సిద్ధం

- **అక్టోబర్ 7, 8 తేదీల్లో హైదరాబాద్‌లో సెలక్షన్ ట్రయల్స్**
- **జిల్లా స్థాయి ఎంపికల్లో అర్హత సాధించిన వారికి అవకాశం**

గద్వాల, సెప్టెంబర్ 23 (వుదయం కరస్పాండెంట్)

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అఖిల భారత సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలు 2026–27లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసేందుకు రాష్ట్ర స్థాయి సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించనున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల అధికారి టి. రామలింగేశ్వర్ గౌడ్ తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక ట్రయల్స్‌లో ప్రతిభ కనబరిచి అర్హత సాధించిన ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర స్థాయి సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనే అవకాశం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. తొలుత సెప్టెంబర్ 24, 25 తేదీల్లో నిర్వహించాల్సిన రాష్ట్ర స్థాయి ఎంపిక ట్రయల్స్‌ను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో వాయిదా వేసినట్లు తెలిపారు. ఉద్యోగులకు రవాణా, ఇతర ఏర్పాట్లలో ఇబ్బందులు తలెత్తకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ తాజాగా విడుదల చేసిన సవరించిన షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7, 8 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియం, జింఖానా మైదానాల్లో రాష్ట్ర స్థాయి సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి ఎంపికల్లో అర్హత సాధించిన క్రీడాకారులు, ప్రభుత్వ ఉద్యోగులు సవరించిన షెడ్యూల్‌ను గమనించి, తమకు కేటాయించిన క్రీడా విభాగం, తేదీ, వేదిక ప్రకారం రాష్ట్ర స్థాయి సెలక్షన్ ట్రయల్స్‌కు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. రాష్ట్ర స్థాయి సెలక్షన్ ట్రయల్స్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికై, అనంతరం నిర్వహించనున్న అఖిల భారత సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి తెలిపారు. జిల్లా స్థాయి ఎంపికల్లో అర్హత సాధించిన ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్ర స్థాయి ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆయన ఆకాంక్షించారు.

ఖాజీపూర్ మత్స్య సంఘం చైర్మన్‌గా పెండల గణేష్ ఏకగ్రీవం

అక్బర్‌పేట భూంపల్లి సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి)

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తాను అని ఖాజీపూర్ గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన చైర్మన్ పెండల గణేష్ అన్నారు.సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట భూంపల్లి మండలం పరిధిలోని ఖాజీపూర్ గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం జరిగిన ఎన్నికల ప్రక్రియలో సభ్యులందరి ఏకాభిప్రాయంతో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ప్రకటించారు.సంఘం నూతన చైర్మన్‌గా పెండల గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షుడిగా పిట్ల యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా దొప్ప స్వామి, క్యాషియర్‌గా పెండేల వేణు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.వీరితో పాటు సంఘం డైరెక్టర్లుగా దొప్ప బాల నర్సు, దొప్ప బాలరాజు, పిట్ల రాములు, పిట్ల నర్సింలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి గ్రామస్తులు, తోటి మత్స్యకారులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, మత్స్యకారుల సంక్షేమానికి, సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

శాకాంబరేశ్వరుడిగా సిద్ధి గణపతి దివ్య వైభవం!

రుద్రారంలో ఆధ్యాత్మిక విస్ఫోటనం..

సదాశివపేట సెప్టెంబర్ 23 (వు దయం):

రుద్రారం పుణ్యక్షేత్రం దివ్య ఆధ్యాత్మిక తేజస్సుతో మార్మోగిపోతోంది. శ్రీ గణేష్ గడ్డ సిద్ధి గణపతి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రధాన ఘట్టమైన 10వ రోజున ఆలయ ప్రాంగణం భక్తజన ప్రవాహంతో జనసంద్రంగా మారింది. సూర్యోదయానికి ముందే తరలివచ్చిన వేలాది భక్తులు స్వామివారి దివ్య పరిక్రమణలో భాగంగా 108 ప్రదక్షిణలు నిర్వర్తించి తమ ప్రణామాలను సమర్పించారు. 11 రోజుల సంకల్ప ప్రదక్షిణలతో సకల విఘ్నాలు పటాపంచలై, అభీష్టాలు నెరవేరుతాయన్న దృఢ సంకల్పంతో శ్రద్ధాభక్తులతో బారులు తీరారు. మహోత్సవాలలో భాగంగా సిద్ధి గణపతి స్వామివారు నేడు 'శ్రీ శాకాంబరేశ్వరుడి' అవతారంలో భక్తులకు సాక్షాత్కరించి పరవశింపజేశారు. వివిధ రకాల తాజా కూరగాయల శోభతో స్వామివారి మూలవిరాట్టును అత్యద్భుతంగా అలంకరించిన తీరు భక్తులను మంత్రముగ్ధులను చేసింది. సకల శుభదాయకుడైన స్వామివారి మంగళకర రూపాన్ని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగితేలారు. తీవ్రమైన రద్దీ ఉన్నప్పటికీ, ఎక్కడా చిన్నపాటి అవరోధం కూడా తలెత్తకుండా ఆలయ కార్యనిర్వహణాధికారిణి (ఈవో) లావణ్య గారు చేపట్టిన అధునాతన నిర్వహణ పద్ధతులు అందరినీ విస్మయపరిచాయి. ఏసీ ఛాంబర్లకే పరిమితం కాకుండా స్వయంగా క్షేత్రస్థాయిలోనే ఉంటూ, ఎండ తీవ్రత తగలకుండా భారీ షామియానాలు, స్వచ్ఛమైన చల్లని తాగునీటి వ్యవస్థలను క్షణక్షణం పర్యవేక్షించారు. దివ్య పూజా మహోత్సవంలో ఈవో లావణ్య గారితో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రముఖులు పట్లోళ్ల లక్ష్మారెడ్డి, కె. సాయి గణేష్, ఎస్. సతీష్ కుమార్, ఎ. మురళి గౌడ్, ఎ. సంతోష్, ఎ. ప్రభు, టి. శివ రాములు, ఎ. రాజేష్ గౌడ్, ఎ. ముకుంద రెడ్డి, సి. నారాయణ రెడ్డి, డి. మహేష్, ఎ. కృష్ణ, ఆర్. శ్రీనివాస్, ఎం. భరత్ తదితరులు పాల్గొన్నారు. వేలాది భక్తుల 'గణపతి బప్పా మోరియా' జయజయధ్వానాలతో గణేష్ గడ్డ పుణ్యక్షేత్రం ప్రతిధ్వనించింది.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటిల్లో సత్తాచాటిన ..

మహాత్మాజ్యోతి బాపూలే గురుకులపాఠశాల బాలికలు"

ఝరాసంగం సెప్టెంబర్-23 (వుదయం ప్రతినిధి)

ఝరాసంగం లో ఉన్న "'కోహిర్'–మహాత్మాజ్యోతిబా పూలే విద్యార్థులు, జిల్లా స్థాయి,క్రీడల్లో సత్తా చాటారు. ఈ నెల 21వ తేదీన సంగారెడ్డి జిల్లాలో, ని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ పోటీలలో మహాత్మాజ్యోతిబా పూలే "కోహిర్" బాలికలు పాల్గొన్న అన్ని విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి, తమప్రతిభను చాటుకున్నారు.ఎంపికైన విద్యార్థులు ఈ నెల 26వ తేదీన హన్మకొండ,లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎన్నికయ్యారు. క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థుల కృషి,పట్టుదలను చూసి వారి విజయానికి ప్రోత్సహించిన ప్రిన్సిపాల్:ప్రిచిల్లా.మేడం గారు. మాట్లాడుతూ చాలా సంతోషంగా ఉంది.అలాగే గర్వాంగా కూడ ఉంది.చదువుతో పాటు ఆటలు మానసిక ఉతేజాన్ని,ఉల్లాసాని స్తాయి. క్రీడాకారులను ప్రోత్సాహిస్తూ,వారికి నిరంతరం శిక్షణ అందించిన పీడీ.స్వాతి.గారికి, మరియు విద్యార్థులకు హృదయ పూర్వక అభినందనలు,శుభాకాంక్షలు తెలపడం జరిగింది, రాష్ట్ర స్థాయిక్రీడాపోటిల్లో కూడ విజయం సాధించి కోహిర్(ఝరాసంగం) మహాత్మాజ్యోతిపూలే పాఠశాలకు మరింత పేరు,కీర్తి,ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షిస్తూన్నాము అని ప్రిన్సిపాల్ గారు కోరడం జరిగిందిఈ. ఈ విషయం తెలిసిన విద్యార్థుల తల్లి దండ్రులు, హర్షంవ్యక్తం చేస్తూ,ప్రిన్సిపాల్ & ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కూడళ్లు, సర్కిళ్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

మహబూబ్‌నగర్ , 23.09.2026,

మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కూడళ్లు, సర్కిళ్ల లో ఏర్పాటు చేసిన కళాకృతులు, ఫౌంటెన్లు, ఆకర్షణీయ బొమ్మల నిర్వహణ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్కిళ్లలో నెలకొన్న సమస్యలు, నిర్వహణ పరిస్థితులను పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ తక్షణమే చర్యలు చేపట్టి 24 గంటల్లో అవసరమైన మరమ్మతులను పూర్తి చేయాలని ఆదేశించారు. సర్కిళ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా, సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ పరిధిలోని అన్ని సర్కిళ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు.

రెజింతల్‌లో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కు గ్రామస్థుల వినతి

సదాశివపేట వుదయం

సదాశివపేట మండలం రేజింతల్ గ్రామంలో స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ గ్రామస్థులు సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ను సదాశివపేటలో కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో స్మశాన వాటికకు సరైన స్థలం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్థుల సమస్యను ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సానుకూలంగా విని, రేజింతల్ గ్రామంలో స్మశాన వాటిక ఏర్పాటుకు అవసరమైన స్థలం కేటాయించేలా సంబంధిత అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధీర్ రెడ్డి, రేజింతల్ గ్రామస్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

మాచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో రక్త గ్రూపింగ్, రక్తహీనత పరీక్షలు

గట్టు సెప్టెంబర్ 23 (వుదయం కరస్పాండెంట్)

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఎస్బీఐ ఫౌండేషన్, భవిష్యభారత్ ఆధ్వర్యంలో మాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రక్త గ్రూపింగ్, రక్తహీనత (హిమోగ్లోబిన్) పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ప్రాథమిక అవగాహన కల్పించడంతో పాటు రక్తహీనతను ప్రారంభ దశలోనే గుర్తించే అవకాశం కల్పించారు.ఈ సందర్భంగా ప్రాజెక్ట్ సమన్వయకర్త పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యభారత్ సంస్థ చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను విద్యార్థులకు వివరించారు. ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, అవసరమైన సమయంలో వైద్య సేవలు, తగిన మార్గదర్శకత్వం అందించడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. వైద్యురాలు ఇందు మైత్రి మాట్లాడుతూ విద్యార్థులకు రక్త గ్రూపింగ్, హిమోగ్లోబిన్ పరీక్షల ప్రాధాన్యతను వివరించారు. ముఖ్యంగా రక్తహీనతను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా సకాలంలో వైద్య సలహాలు, అవసరమైన చికిత్స పొందవచ్చని తెలిపారు. పోషకాహారం, సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని సూచించారు. ఎంఈఓ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం వారి విద్యాభ్యాసం, భవిష్యత్తుపై ఎంతో ప్రభావం చూపుతుందని అన్నారు. పాఠశాల స్థాయిలోనే ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ద్వారా సమస్యలను ముందుగానే గుర్తించి తగిన వైద్య సలహాలు అందించవచ్చని తెలిపారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులకు రక్త గ్రూప్ నిర్ధారణతో పాటు హిమోగ్లోబిన్ స్థాయిని పరీక్షించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కార్యక్రమానికి సహకరించారు.

ఎస్సీ/ఎస్టీ విజిలెన్స్ & మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా మూడవత్ శ్రీను నాయక్ ఎంపిక

అచ్చంపేట, సెప్టెంబరు 23 (వుదయం ప్రతినిధి):

అచ్చంపేట మండలం బుడ్డ తండా గ్రామానికి చెందిన యువ నాయకుడు మూడవత్ శ్రీను నాయక్ ఎస్సీ/ఎస్టీ విజిలెన్స్ & మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, యువకులు, గ్రామ పెద్దలు ఆయనకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన సమాజం నుండి ఎదిగిన శ్రీను నాయక్ కు ఈ పదవి రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఈ బాధ్యతలో ప్రజలకు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కుల పరిరక్షణకు మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు ల్యాప్ టాప్ లు పంపిణీ

నారాయణపేట సెప్టెంబర్ 23(వుదయం ప్రతినిధి)

సేవా భారతి ఆధ్వర్యంలో సీఎస్ఆర్ ఇనిషియేటివ్ డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ కు 10 ల్యాప్ టాప్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భారతి మాట్లాడుతూ ఇంటర్నెట్ ద్వారా ఏ పాఠమైనా యూట్యూబ్ లో వీడియోలు,గూగుల్ లో సందేహాలు, వరల్డ్ లో ప్రాజెక్ట్ వర్క్, వ్యాసాలు,టైపింగ్ ,పవర్ పాయింట్లో ప్రెజెంటేషన్ తయారు చేయడం,కోడింగ్, డ్రాయింగ్ నేర్చుకోవడం ఆన్ లైన్ లో స్లిప్ టెస్ట్ ,ఫార్మేటివ్ అసెస్మెంట్, సమ్మేటివ్ అసెస్మెంట్ ప్రశ్నాపత్రాలు ప్రాక్టీస్ చేయవచ్చు– పాత ప్రశ్నాపత్రాలు,నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ నవోదయ, గురుకుల వంటి పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి, ఆన్ లైన్ క్లాసులు వినవచ్చని ని గేమ్స్ కు కాకుండా, చదువుకు మాత్రమే ల్యాప్ టాప్ ను వాడాలని రోజుకు 1–2 గంటలు మాత్రమే వాడాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విజయ, ప్రతాప్, మధుసూదన్, భాను ప్రకాష్ ,మంగళ ,నిర్మల, శిరీష, లక్ష్మణ్, నరసింహ, నర్సింలు ,శశిరేఖ, శ్రీదేవి, రఘురాం రెడ్డి, సాయి కృష్ణ ,సంగీత ,వెంకటేష్ విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రేటర్ హైదరాబాద్



మోడల్ స్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటిన 14వ వార్డు కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్

- **మొక్కలు నాటి సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతపచ్చదనం పెంపొందించేందుకు ప్రజలు, విద్యార్థులు ముందుకు రావాలి: కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్**

చేవెళ్ల,సెప్టెంబర్ 23 (వుదయం)
పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేవెళ్ల మున్సిపాలిటీ 14వ వార్డులోని మోడల్ స్కూల్ ప్రాంగణంలో కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్ మొక్కలు నాటారు. పాఠశాల ఆవరణలో పలు రకాల మొక్కలను నాటి, వాటి సంరక్షణపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్ మాట్లాడుతూ...మొక్కలు నాటడం మాత్రమే కాకుండా,నాటిన ప్రతి మొక్కను సంరక్షించి పెంచడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని,పచ్చదనం పెంపొందించేందుకు ప్రజలు, విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రాంగణంలో పెద్ద సంఖ్యలో మొక్కలు పెంచడం వల్ల విద్యార్థులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందిస్తూ, వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సత్యం నవీన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర స్పోర్ట్స్ సెల్ కన్వీనర్‌గా వడ్డేటి రవీందర్

ముషీరాబాద్, సెప్టెంబర్ 23(వుదయం)
హైదరాబాద్: భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర స్పోర్ట్స్ సెల్ కన్వీనర్‌గా వడ్డేటి రవీందర్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్ బుధవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో రవీందర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.నూతన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రవీందర్ రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్‌ను సత్కరించారు. అనంతరం పలువురు పార్టీ నాయకులు రవీందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో క్రీడా రంగానికి మరింత ప్రాధాన్యం కల్పిస్తూ యువతను ప్రోత్సహించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. తనకు అప్ప

గించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పార్టీకి, ఎస్సీ మోర్చాకు మరింత సేవలందిస్తానని రవీందర్ తెలిపారు.కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసి నాగరాజు, సీనియర్ నాయకురాలు కాంచన కృష్ణ, రాష్ట్ర అధికార ప్రతినిధి అరవింద్, సతీష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

లక్షల్లో పలికిన లడ్డూ పాట

పటాన్‌చెరు మార్కెట్‌లో వేడుకగా నిమజ్జనోత్సవం

పటాన్‌చెరు (వుదయం):
పటాన్‌చెరువు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ప్రాంగణంలోని వెజిటేబుల్ మార్కెట్ అసోసియేషన్ (రిజిస్ట్రేషన్ నెం. 35/2021) ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలు ఆద్యంతం భక్తిశ్రద్ధలతో సాగి, నేడు వినాయక నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ, కలశం వేలం పాటలు భక్తుల మధ్య పోటాపోటీగా సాగి విశేష ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా మొదటి లడ్డూను కేఆర్‌సీఆర్ సాయినాథ్ రెడ్డి రూ. 1,96,116లకు దక్కించుకోగా, రెండవ లడ్డూను వి. జగదీష్ రూ. 1,11,000లకు సొంతం చేసుకున్నారు. అలాగే పవిత్ర కలశాన్ని శశికాంత్ రెడ్డి రూ. 71,000లకు దక్కించుకున్నారు. భక్తులు ఉత్సాహంగా పాల్గొనడంతో వేలం పాటలు ఉత్కంఠభరితంగా సాగాయి. వేలంలో విజేతలుగా నిలిచిన వారిని వెజిటేబుల్ మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. మల్లికార్జున్ ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం వినాయక స్వామివారికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ మార్కెట్ వ్యాపారులు, కూలీలు, ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తున్నామని తెలిపారు. వినాయకుని ఆశీస్సులతో వ్యాపారాభివృద్ధి, సుఖశాంతులు, సమృద్ధి కలగాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం వెజిటేబుల్ మార్కెట్ అసోసియేషన్ సభ్యులు, వ్యాపారులు, మార్కెట్ కార్మికులు, భక్తులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వినాయక నిమజ్జనోత్సవాన్ని విజయవంతం చేశారు. వినాయక నామస్మరణలు, మంగళ వాయిద్యాలు, భక్తి గీతాల మధ్య స్వామివారిని ఘనంగా నిమజ్జనానికి తీసుకొని వెళ్లారు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

వెంటనే విడుదల చేయాలి

- **విద్యార్థులతో భారీ ప్రదర్శన.. పాత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్**

ముషీరాబాద్, సెప్టెంబర్ 23(వుదయం)
రాష్ట్రంలోని 14 లక్షల మంది కాలేజీ విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది విద్యార్థులు బుధవారం హైదరాబాద్ విద్యానగర్ నుంచి భారీ ప్రదర్శన నిర్వహించారు. సుమారు రూ.8,500 కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రద్దు చేసే ఆలోచనలను విరమించుకుని పాత విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు పగిళ్ల సతీష్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరిగింది.ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అవసరమైన నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం పేద, బడుగు వర్గాల విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని విమర్శించారు. మూడు సంవత్సరాలుగా ఫీజుల బకాయిల కోసం విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.6 లక్షల మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు నిలిపివేతఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కోర్సులు పూర్తి చేసిన దాదాపు 6 లక్షల మంది విద్యార్థులకు పలు కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని కృష్ణయ్య తెలిపారు. ఫలితంగా ఉద్యోగాలు వచ్చినా చేరలేక, ఉన్నత విద్యకు వెళ్లలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఫీజులు చెల్లించే వరకు కొందరు కాలేజీల్లో తదుపరి సంవత్సరం అడ్మిషన్లకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కొత్త ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం అమలు విషయంలో ఏర్పడిన గందరగోళం కారణంగా పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆయన ఆరోపించారు. ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు సుమారు 30 వేల మంది విద్యార్థులు హాజరు కాలేదని, పీజీ కోర్సుల్లో అనేక సీట్లు భర్తీ కాలేదని తెలిపారు. డిగ్రీ కాలేజీల్లో కూడా వేలాది సీట్లు మిగిలిపోయాయని పేర్కొన్నారు.కాలేజీల మూసివేతపై ఆందోళన
ఫీజుల సమస్యతో ఇప్పటికే వందలాది కాలేజీలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని, ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు, బాలికలు చదువుకు దూరమవుతున్నారని కృష్ణయ్య అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పాత విధానంలోనే కొనసాగించి, బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కొన్ని ఇంజనీరింగ్ కాలేజీల్లో అవకతవకలపై విచారణ జరుగుతోందని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో, ఎలాంటి ఆరోపణలు లేని ప్రభుత్వ, యూనివర్సిటీ కాలేజీలకు సంబంధించిన ఫీజు బకాయిలను ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. నిజాం కాలేజీ, కోఠి ఉమెన్స్ కాలేజీ, సికింద్రాబాద్ పీజీ కాలేజీ, ఉస్మానియా యూనివర్సిటీ కాలేజీల విద్యార్థులు కూడా ఫీజుల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.బీసీ సంక్షేమ శాఖను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని కృష్ణయ్య ఆరోపించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందడం లేదని, బీసీ సంక్షేమ పథకాలకు తగిన నిధులు కేటాయించడం లేదని విమర్శించారు.

బకాయిలు చెల్లించే వరకు ఉద్యమం
ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం గత మూడేళ్లుగా విద్యార్థులు అనేక దఫాలుగా ఆందోళనలు చేస్తున్నారని, విద్యార్థి సంఘాలతో పాటు ప్రజాసంఘాలు, ప్రతిపక్ష పార్టీలు కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయని కృష్ణయ్య తెలిపారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడం విచారకరమన్నారు.
పేద విద్యార్థులు కూడా ఉన్నత విద్యను అభ్యసించేలా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పాత విధానంలోనే కొనసాగించాలని, రూ.8,500 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యను మరింత జటిలం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని కోరారు. బకాయిలు పూర్తిగా విడుదల చేసే వరకు విద్యార్థుల ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ భారీ ప్రదర్శనలో రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు పగిళ్ల సతీష్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి. రాజేందర్, నరేష్‌గౌడ్, నిఖిల్ పటేల్, కాదరి శివకుమార్ యాదవ్, రమేష్, రాహుల్, సురేష్, రమణ, కె. వంశీ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరగాలి

నిమజ్జనం కార్యక్రమం ప్రశాంతంగా, సజావుగా జరిగేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- **మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో బందోబస్తు రోల్‌కాల్ నిర్వహించిన సి ఐ డి. జలేందర్ రెడ్డి**
- **ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచన**

మేడిపల్లి వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 23.
గణేష్ నిమజ్జనం సందర్భంగా మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో సి ఐ డి. జలేందర్ రెడ్డి ,డి ఐ శ్రీనివాస్ బందోబస్తు కి హాజరైన పోలీస్ సిబ్బందికి బుధవారం బందోబస్తు రోల్‌కాల్ నిర్వహించారు,
ఈ సందర్భంగా సి ఐ జలేందర్ రెడ్డి బందోబస్తుకు హాజరైన పోలీసు సిబ్బందికి

వారి వారి డ్యూటీ పాయింట్లు, విధులు, గణేష్ ఊరేగింపు మార్గాలు, నిమజ్జన ప్రదేశాలు, ట్రాఫిక్ నియంత్రణ, జనసందోహం నియంత్రణ మరియు శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించి అవసరమైన సూచనలు ఇచ్చారు. నిమజ్జనం కార్యక్రమం ప్రశాంతంగా మరియు సజావుగా జరిగేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే డీజేలు/అధిక శబ్దం నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, భక్తుల భద్రత, సిబ్బంది మధ్య సమన్వయం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

పురుగుల మందు సేవించి వ్యక్తి మృతి

- **ఆరోగ్య సమస్యలు, అప్పుల బాధతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యుల వెల్లడి**

చేవెళ్ల,సెప్టెంబర్23 (వుదయం)
చేవెళ్ల మండల పరిధిలోని తంగడపల్లి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది.పురుగుల మందు సేవించిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు.తంగడపల్లి గ్రామానికి చెందిన పెద్ద భానోళ్ల పరమేష్ (31) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.వివరాల్లోకి వెళితే.. ఈ నెల 21వ తేదీన పరమేష్‌కు కాలు సరిగా నడవకపోవడంతో కుటుంబ సభ్యులు అదే గ్రామానికి చెందిన దండు రమేష్‌ను పిలిపించి, అతని బైక్‌పై పరమేష్‌ను పొలానికి పంపించారు.కొంతసేపటి తర్వాత తనకు ఆకలిగా ఉందని చెప్పడంతో రమేష్‌ను పండ్లు తీసుకురావాలని పరమేష్ కోరాడు.రమేష్ పండ్లు తీసుకుని సుమారు సాయంత్రం 4 గంటల సమయంలో పొలానికి తిరిగి వచ్చేసరికి పరమేష్ కనిపించలేదు.బావి వైపు వెళ్లి చూడగా, బావిలో నుంచి పరమేష్ పిలుస్తున్న శబ్దం వినిపించింది.దీంతో రమేష్ బావిలోకి దిగి పరమేష్‌ను బయటకు తీసుకువచ్చాడు.అప్పటికే పరమేష్ నోటిలో నుంచి నురుగు వస్తుండటంతో ఏమైందని ప్రశ్నించగా, తాను పురుగుల మందు సేవించినట్లు తెలిపాడు.వెంటనే రమేష్ పరమేష్ భార్యకు సమాచారం అందించడంతో ఆమెను పొలం వద్దకు తీసుకువచ్చారు.అనంతరం పరమేష్‌ను

చికిత్స కోసం వికారాబాద్‌లోని మిషన్ ఆసుపత్రికి తరలించగా,పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.దీంతో వెంటనే వికారాబాద్‌లోని ఈషా ఆసుపత్రికి తరలించి చికిత్స నిమిత్తం చేర్పించారు.అక్కడ చికిత్స పొందుతున్న పరమేష్‌ను సెప్టెంబర్ 23 ఉదయం సుమారు 7:20 గంటలకు మృతి చెందినట్లు డ్యూటీ వైద్యులు నిర్ధారించారు. ఆరోగ్య సమస్యలు,అప్పుల బాధే కారణముమృతుడు కొంతకాలంగా లివర్ సంబంధిత సమస్యతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడని, చికిత్స కోసం అప్పులు కూడా చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆరోగ్య సమస్యలు, అప్పుల బాధతోనే పరమేష్ పురుగుల మందు సేవించి ఉండవచ్చని వారు పేర్కొన్నారు .ఈ ఘటనపై తమకు ఎవరిపైనా అనుమానం లేదని మృతుడి భార్య పోలీసులకు తెలిపినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహ పంచనామా,పోస్టుమార్టం తదితర చట్టపరమైన చర్యలు చేపట్టారు.

క్యాబ్ డ్రైవర్ హత్య కేసులో ముగ్గురు అరెస్టు...

- **కారు అపహరించి ముంబయి వైపు పరార్....**
- **రుద్రారం సమీపంలో ఘటన.. దోపిడీకి పథకం పన్నిన ముఠా...**

రామచంద్రపురం,సెప్టెంబర్ 23(వుదయం)
క్యాబ్ డ్రైవర్‌ను హత్య చేసి, అతడి కారును అపహరించిన కేసును పటాన్‌చెరు పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేయగా.. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. సంఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు విలేకరుల సమావేశంలో వెల్లడించారు పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ ఎస్పీ రోడ్డులోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయం సమీపంలోని స్విమ్మింగ్ పూల్ బస్‌స్టాప్ వద్ద ఈ నెల 10వ తేదీ అర్ధరాత్రి నిందితులు క్యాబ్ డ్రైవర్ నెలమర్రి రాజశేఖర్ (కారు నంబర్ టి జి 09 టీ 4759)ను సంప్రదించారు. ముంబయికి వెళ్లాలని చెప్పి క్యాబ్‌ను అద్దెకు తీసుకున్నారు. అనంతరం పటాన్‌చెరు వైపు తీసుకెళ్లి.. జాతీయ రహదారి65పై రుద్రారం గ్రామ శివారులోని నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ డ్రైవర్‌పై దాడి చేసి, టవల్‌తో గొంతు బిగించి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. తరువాత మృతదేహాన్ని అక్కడే పడేసి.. కారుతో ముంబయి

వైపు పరారయ్యారు.

కోహిర్ వద్ద కారు వదిలి..
ముంబయి వైపు వెళ్తుండగా కోహిర్ సమీపంలో కారు మొరాయించడంతో గోల్డెన్ ధాబా వద్ద వాహనాన్ని వదిలేశారు. అనంతరం జహీరాబాద్ వైపు వెళ్లినట్లు దర్యాప్తులో తేలింది. ఇదిలా ఉండగా రాజశేఖర్ అదృశ్యమైనట్లు బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో క్రైం నంబర్ 629/2026 కింద మిస్సింగ్ కేసు నమోదైంది.
రుద్రారం సమీపంలో మృతదేహం లభ్యమవడంతో పటాన్‌చెరు పోలీసులు తొలుత క్రైం నంబర్ 1238/2026 కింద బీఎన్ఎస్ 103(1) సెక్షన్ ప్రకారం హత్య కేసు నమోదు చేశారు. దర్యాప్తులో దోపిడీ, నేరపూరిత కుట్ర తదితర అంశాలు వెలుగులోకి రావడంతో 310, 103(1), 61(2), 3(5) బీఎన్ఎస్ సెక్షన్లను చేర్చారు.

బంగారు దుకాణాల్లో చోరీలే లక్ష్యం..
ఐదుగురు నిందితులు సికింద్రాబాద్‌లో పరిచయమై.. క్యాబ్‌ను అద్దెకు తీసుకుని డ్రైవర్‌ను హత్య చేసి, కారును అపహరించి ముంబయికి వెళ్లాలని పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ బంగారు దుకాణాల్లో చోరీలు చేయడంతో పాటు.. అనంతరం కారును విక్రయించాలని భావించినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

ముగ్గురి అరెస్టు....
దర్యాప్తులో భాగంగా నిందితుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టి.. ఆధారాలను సేకరించారు. ఈ క్రమంలో మహారాష్ట్రకు చెందిన ఘోడకే రాహుల్ (28), సూరజ్ శశికాంత్ తవాడే (29), బాంబ్లే రాజు రామచంద్ర (33) లను అరెస్టు చేశారు. వీరిని న్యాయస్థానంలో హాజరుపరిచారు. మరో ఇద్దరు నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

అధికారుల పర్యవేక్షణలో..
ఈ కేసు దర్యాప్తును సైబరాబాద్ ఎస్‌వోటీ డీసీపీ పి. శోభన్‌కుమార్, ఆర్సీ పురం ఏసీపీ సీహెచ్. వై. శ్రీనివాస్ పర్యవేక్షించారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. రవీందర్, ఎస్‌వోటీ సెరిలింగంపల్లి జోన్ ఇన్‌స్పెక్టర్ పి. సతీశ్, పటాన్‌చెరు పోలీసు సిబ్బంది దర్యాప్తులో కీలకంగా వ్యవహరించారు. పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు, లక్ష రూపాయల జరిమానా.

పూడూర్ సెప్టెంబర్ 24, (వుదయం)
వికారాబాద్ జిల్లా
పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు మరియు లక్ష రూపాయల జరిమానా విధిస్తూ గఅడిషనల్ . జిల్లా & సెషన్స్ జడ్జి , వికారాబాద్ ప్రదీప్ నాయక్ ఈరోజు, 23.09.2026న తీర్పు వెలువరించినట్లు వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, తెలిపారు.పరిగి మండలం చిట్యాల్ గ్రామానికి చెందిన బ్యాగరి కమల (35), ఆశా వర్కర్, భర్త మృతి చెందడంతో తన కుమార్తెతో కలిసి నివాసం ఉంటోంది. అదే గ్రామానికి చెందిన రావులగల్ల దేవదాసు అలియాస్ దాసు (36) అనే వ్యక్తితో ఆమెకు పరిచయం ఏర్పడింది. అయితే కొన్ని కారణాల వల్ల గత మూడేళ్లుగా తన ఇంటికి రావద్దని కమల అతడిని వారించింది. అయినప్పటికీ నిందితుడు తరచూ మద్యం సేవించి ఆమె ఇంటికి వచ్చి గొడవపడేవాడు. ఈ క్రమంలో 12.09.2016 రాత్రి నిందితుడు మద్యం మత్తులో కమల ఇంటికి వెళ్లి ఆమెతో మళ్లీ గొడవ పడ్డాడు. అనంతరం కక్ష పెంచుకున్న దేవదాసు, కమల శరీరంపై కిరోసిన్ పోసి అగ్గిపుల్ల వెలిగించి నిప్పంటించాడు. మంటలు అంటుకున్న కమల గట్టిగా కేకలు వేస్తూ నిందితుడి వైపు పరిగెత్తడంతో అతడికి కూడా మంటలు అంటుకున్నాయి. తీవ్రంగా గాయపడిన కమలను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా ఉస్మానియా జనరల్ ఆసుపత్రి, హైదరాబాద్కు తరలించగా, చికిత్స పొందుతూ 14.09.2016న మృతి చెందింది. కేసు రికార్డుల్లో కూడా కమలకు నిప్పంటించిన ఘటన, ఆమెను చికిత్స నిమిత్తం తరలించడం, అనంతరం చికిత్స పొందుతూ మృతి చెందిన విషయాలు నమోదు చేయబడ్డాయి .ఈ ఘటనపై పరిగి పోలీస్ స్టేషన్‌లో సీఆర్ నెం.216/2016, యూ /ఎస్ 302 ఐపీసీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సాక్షుల వాంగ్మూలాలు, వైద్యపరమైన ఆధారాలు, సంఘటనకు సంబంధించిన వస్తువులు మరియు ఇతర సాక్ష్యాలను సేకరించి న్యాయ స్థానంలో సమర్పించారు. కేసు ఛార్జ్‌షీట్‌లో నిందితుడిగా రావులగల్ల దేవదాసు, తండ్రి మొగులయ్య, వయస్సు 36 సంవత్సరాలు, వృత్తి వ్యవసాయం, చిట్యాల గ్రామం, పరిగి మండలంగా నమోదు చేశారు .ఈ కేసులో వై . నాగేష్, ఎస్ ఐ, పరిగి పోలీస్ స్టేషన్ మరియు పి . ప్రసాద్, సి ఐ పి దర్యాప్తు అధికారులుగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం పరిగి సర్కిల్ సి ఐ పి శ్రీ కొండల్ రెడ్డి మరియు పరిగి ఎస్ హెచ్ ఓ బి . మోహన్ కృష్ణ, ఎస్ ఐ పి కేసుకు సంబంధించిన న్యాయ ప్రక్రియలో సహకరించారు. కేసు ప్రాసిక్యూషన్ మరియు ట్రయల్ ప్రక్రియలో మెరాజ్ ఫిర్దౌస్, అడిషనల్ . పీపీ , పీసీ పి . జగన్మోహన్ రెడ్డి, 10038, సీడి ఓ , పరిగి పోలీస్ స్టేషన్, పీసీ ఏ . రాజేష్, 99104 మరియు పీసీ ఎస్ . నిరంజన్ గౌడ్, 5598, బ్రీఫింగ్ & లియసన్ ఆఫీసర్ , మొదటి ఏ డి జె కోర్ట్ సమన్వయంతో సహకరించారు.కేసులో సమర్పించిన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు మరియు ఇతర సాక్ష్యాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిపై నేరం రుజువైనట్లు నిర్ధారించి, రావులగల్ల దేవదాసుకు జీవిత ఖైదు శిక్ష మరియు 1,00,000 రూపాయల జరిమానా విధించడం జరిగింది ..ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, మాట్లాడుతూ, నేరాలకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, కేసుల్లో సమర్థవంతమైన దర్యాప్తు, నాణ్యమైన సాక్ష్యాల సేకరణ మరియు ప్రాసిక్యూషన్‌తో సమన్వయం ద్వారా నిందితులకు చట్టపరమైన శిక్ష పడేలా వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఇట్టి కేసులో పని చేసిన అధికారులకు జిల్లా ఎస్పీ అభినందించడం జరిగింది.

IN THE COURT OF THE IX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD
O.S. No. 2817 of 2026
Between:
1] **Smt. Kulpaguri Puspanjali**, W/o Late Kulpaguri Eshwar Age: 66 years, Occ. Household R/o H.No. 12-2-897/16, Zebabagh, Asif Nagar, Hyderabad - 500028
2] **Smt. Aelupula Indrani,** Wife of Aelupula Vinod Kumar, Daughter of Late Kulpaguri EshwarAge: 53 years, Occ: Homemaker H.No. 10-5-338, Tukaram Gate, North Lalaguda, Secunderabad 500017
3] **Smt. Kulpaguri Archana**, Wife of Meesala Vikram Kumar, Daughter of Late Kulpaguri EshwarAge: 46 years, Occ: Homemaker H.No. 29-391/108A, Vajpayee Nagar, Naredmet, Malkajgiri, Hyderabad 500056
4] **Smt. Aelupula Gayatri**, Wife of A. Pramod Kumar, Daughter of Late Kulpaguri Eshwar Age: 46 years, Occ: Homemaker H.No. 10-5-388, Tukaram Gate, North Lalaguda, Secunderabad 500017
5]**Sri Kulpaguri Rameshwar** S/o Late Kulpaguri EshwarAge: 52 years, Occ: Business R/o H.No. 12-2-897/16, Zebabagh, Asif Nagar, Hyderabad - 500028
6] **Sri Kulpaguri Parameshwar** S/o Late Kulpaguri Eshwar Age: 49 years, Occ: Business R/o H.No. 12-2-897/16, Zebabagh, Asif Nagar, Hyderabad - 500028
....Plaintiffs
And
1] **Mandal Revenue Officer,** Asif Nagar Mandal, Vijay Nagar Colony Hyderabad-500 057.
2] **All concerned** **...Defendants**
NOTICE
To,
All concerned
Whereas the above named Plaintiffs are filed suit for Declaration to declare the plaintiffs as legal heirs of Late Kulpaguri Eshwar for legal status. The said case is posted on **5-10-2026** for appearance. If anybody is interested in the above said suit are hereby required to appear personally or duly authorized agent or counsel on the said date ie., on **5-10-2026 at 10-30 A.M.** before the IX Junior Civil Judge, City Civil Court, Hyderabad, otherwise the matter will be decided as per law.
[BY ORDER OF THE COURT]
Sd/- A.V. SRINIVASA RAO
Advocate
H.No. 10-3-174 & 175, Humayunnagar, Hyderabad-500 028 Mobile No. 9885245626.
Date15-09-2026, Place:Hyderabad

IN THE COURT OF THE HON'BLE Vth SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS, HYDERABAD, AT: HYDERABAD
O.S.NO. 722 OF 2026
Between :
Sri Billa Prabhakar, S/o Late Billa Narayana, Aged about 66 Years, Occ: Business, R/o H. No. 1-3-183/4, Talla Basti, Kavadi Guda, Hyderabad, State: Telangana, PIN Code: 500080 ...Plaintiffs
AND
1. The Tahsildar / Mandal Revenue Officer, Musheerabad Mandal, Lower Tank Bund, Kavadiguda, Hyderabad, Telangana-80
2. All concerned / Whomsoever it may concern ...Defendants

TO
ALL CONCERNED ...Defendants
NOTICE
Please take a notice that the above-named Petitioners/ Plaintiffs had filed the above Suit to declare the plaintiff as legal heirs of the Late Billa Narayana in respect of the suit Schedule property. The Hon'ble court directed us to issue notice to you by the way of publication. That the above suit stands posted on 07.10.2026 at 10.30a.m. before this Hon'ble Court for your appearance and counter if any. Therefore, you are hereby directed to appear before the Hon'ble Vth Senior Civil Judge, City Civil Courts, Hyderabad on the above-said dates in person or through your counsel, otherwise the matter will be decided according to law.
SCHEDULE OF PROPERTY
All that the portion of House bearing MCH No. 1-3-183/4, admeasuring 46 sq.yds., out of 183 sq.yds., situated Tallabasthi, Kavadiguda, Hyderabad, which is morefully described in the plan annexed hereto and marked in red colour.
Boundaries of the said portion:
NORTH:: Portion of H.No. 1-3-183/4 of B.Veeraiah,
SOUTH:: Portion H.No. 1-3-183/4 OF of B.Ramulu
EAST:: Portion of H.No. 1-3-183/4 of B. Veeraiah,
WEST:: 30-0" wide Road
// By Order of the Hon'ble Court //
Sd/-
(B SHANKAR GOUD)
Advocate
 # H. No. 8-1/18, Prashanth nagar colony, Medipally (V) (M), M M-District, T.S., -98
Cell: 9000602088

"ఆరోగ్యవంతమైన సమాజం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన పథకం ఆయుష్మాన్ భారత్. ఈ పథకం ప్రారంభమై ఎనిమిదేళ్లు పూర్తయింది. ఆయుష్మాన్ భారత్ కింద 60 కోట్ల మంది లబ్ధిదారులు ఏడాదికి రూ. 5 లక్షల ఆరోగ్య బీమా రక్షణను పొందారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య సంరక్షణ పథకంగా నిలిచింది. ప్రతి గడపకూ ఆరోగ్య సంరక్షణ చేరుతుండడంతో క్షేత్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ బలోపేతం అవుతోంది. పెరుగుతున్న వైద్య ఖర్చుల భారం సామాన్య ప్రజలపై పడకుండా ఉండేందుకు, సకాలంలో చికిత్స పొందేందుకు వీలుగా ఈ కార్యక్రమం అమలు చేస్తున్నాం."

- నరేంద్ర మోడీ, ప్రధాని

వేమన పద్యం

గాజుకుప్పెలోన కదలక దీపంబు
దెట్టులుండు జ్ఞాన మట్టులుండు
దెలిసినట్టివారి దేహంబులందున
విశ్వదాభిరామ వినురవేమ



సంపాదకీయం

అమెరికా ఆధిపత్యానికి బ్రిక్స్ వ్యూహం

ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యం దాదాపుగా డాలర్ల రూపంలోనే సాగుతోంది. ముఖ్యంగా చమురు విషయంలో డాలర్ ప్రాతిపదిక కొనసాగుతోంది. అందుచేత సంపదను డాలర్ల రూపంలో నిల్వ చేసుకోవడం కూడా కొనసాగుతోంది. ప్రపంచ స్థాయిలో సరుకుల విలువలు డాలర్ల లెక్కలో స్థిరంగా ఉంటాయన్న అంచనాల విద ఈ పరిస్థితి కొనసాగుతోంది. సహజంగానే ఈ వాతావరణం అమెరికాకు ఒక ప్రత్యేక సానుకూలతను కల్పించింది. ఇప్పుడు అమెరికా తక్కిన ప్రపంచం నుంచి ఎంతైనా డాలర్ల రూపంలో రుణాలు తీసుకోవచ్చు, ఎంతైనా ఖర్చు చేసుకోవచ్చు. అమెరికా అనుభవిస్తున్న ప్రత్యేక సానుకూలతను సహించడానికి తక్కిన ప్రపంచ దేశాలు ఎంతకాలం సిద్ధంగా ఉంటాయో అంతకాలమఅమెరికా ఆ సానుకూలత వలన ప్రయోజనాలు పొందుతూనే వుండవచ్చు. కాలక్రమేణా, డాలర్ పోషిస్తున్న పాత్ర స్వభావం మారిపోతోంది. డాలర్ల రూపంలో తమ సంపదను నిల్వ చేసుకుంటున్న తక్కిన దేశాల విద అమెరికా పెత్తనాన్ని చెలాయించడం ప్రారంభించింది. దాంతో ఒక రిజర్వు కరెన్సీ గా వ్యవహరించే పాత్ర నుంచి వివిధ దేశాల మెడలు వంచగలిగే ప్రమాదకరమైన పాత్ర లోకి డాలర్ మారిపోయింది. ఇరాన్‌లో 1979లో ఏర్పడ్డ దౌత్య సంక్షోభం సందర్భంగా అమెరికా అధ్యక్షుడిగా ఉన్న జిమీ కార్టర్ ఇరాన్ ఆస్తులను 12 బిలియన్ల డాలర్ల మేరకు స్తంభింపజేశాడు ? అయితే, అంతర్జాతీయంగా కొనసాగే డాలర్ల రూపంలోని లావాదేవీలన్నీ అమెరికన్ బ్యాంక్‌లతో ముడిపడి వుంటాయి గనుక వాటిని స్తంభింపజేసే అధికారాన్ని అమెరికన్ ప్రభుత్వం తనకు తానే కల్పించుకుంది.

తద్వారా తన మాట వినని దేశాల మెడలు వంచడానికి పూనుకుంటోంది. క్లుప్తంగా చెప్పాలంటే డాలర్ ఇప్పుడు అమెరికన్ సామ్రాజ్యవాదం చేతుల్లో ఒక ఆయుధం. ఏ దేశంతోనైనా అమెరికాకు వివాదం తలెత్తితే అప్పుడు ఆ దేశం విద ఏకపక్షంగా ఆంక్షలు విధిస్తుంది. అందుకు ఐక్యరాజ్య సమితి ఆమోదం ఏవి ఉండదు. డాలర్ల ఖాతాలను నియంత్రించే సంబంధిత బ్యాంకింగ్ వ్యవస్థను అడ్డం పెట్టుకుని ఆ దేశపు డాలర్ల ఖాతాను స్తంభింపజేస్తుంది. ఈ మధ్య కాలంలో ఇటువంటి ఇబ్బందిని అనుభవించిన దేశం రష్యా. న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సమావేశంలో రష్యా, చైనా బ్రిక్స్ సభ్య దేశాలు తమలో తాము జరుపుకునే వాణిజ్య లావాదేవీలలో ఆ యా దేశాల నగదును ఉపయోగించాలని భావించాయి. ఆ తరహా వాణిజ్య లావాదేవీలను గణనీయంగా విస్తరించాలని గుర్తించాయి. బ్రిక్స్ దేశాలు తమలో తాము జరుపుకునే వ్యాపారంలో స్థానిక కరెన్సీలను ఉపయోగించడంలో ఉన్న ఇబ్బందులను మనం తక్కువ అంచనా వేయడానికి లేదు. దానివలన ఆ పేద దేశాల దేశీయ డిమాండ్ కుంచించుకుపోయి ఆర్థిక వ్యవస్థ మరింత మాంద్యంలోకి కూరుకుపోతోంది. ఈ విధానానికి బదులు విదేశీ చెల్లింపు ఖాతాలో మిగులు ఉన్న దేశాలు తమ దిగుమతులను మరింత పెంచుకుంటే, తమ దేశీయ డిమాండ్ మరింత పెరిగితే అప్పుడు వాటి మిగులు కొంత తగ్గుతుంది. పేద దేశాలకు ఊరట కలుగుతుంది. ఇప్పుడు బ్రిక్స్ దేశాల నడుమ విస్తరించవలసిన వాణిజ్యం లో అనుసరించవలసిన నిబంధనలు ప్రస్తుతం అంతర్జాతీయంగా ఉనికిలో ఉన్న నిబం ధనలకన్నా భిన్నంగా ఉంటేనే ఆ విస్తరణ వలన అన్ని దేశాలకూ ప్రయోజనం లభిస్తుంది. అలా కాకుండా ఇప్పుడు ఉన్న నిబంధనల మేరకే బ్రిక్స్ దేశాలు తమ నడుమ వాణిజ్యాన్ని స్థానిక కరెన్సీల ద్వారా విస్తరించినా, ఇప్పుడు అంతర్జాతీయ వాణిజ్యంలో ఎదురౌతున్న చిక్కుల వంటివే అప్పుడు కూడా కొనసాగుతాయే తప్ప ఉపశమనం కలగదు. బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సమావేశం స్థానిక కరెన్సీల ద్వారా తమ మధ్య జరగవలసిన వాణిజ్యం గురించి ఎక్కువగా చర్చించింది. కాని అటువంటి వాణిజ్యంలో ఆచరణలో ఎదురయ్యే ఇబ్బందుల గురించి అంతగా చర్చించలేదు. అంటే రాబోయే రోజుల్లో బ్రిక్స్ దేశాల నడుమ జరిగే వాణిజ్యం అంతర్జాతీయంగా గణనీయమైన ప్రభావాన్ని కలిగించగల గాలంటే అందుకు ఇంకా చాలా సమయం పట్టవచ్చు. వాస్తవానికి బ్రిక్స్ సభ్య దేశాలలో కొన్ని సామ్రాజ్యవాద అనుకూల వైఖరిని పాటించేవి కూడా ఉన్నాయి. అందుచేత డాలర్ ఆధిపత్యానికి చెక్ పెట్టగల ఒక ప్రత్యామ్నాయ వ్యాపారం బ్రిక్స్ దేశాల నడుమ పెంపొందుతుందా అన్నది వేచి చూడాల్సిందే.

రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

నవభారత నిర్మాణంలో యువశక్తి

ఒక ఆలోచనను తీసుకోండి. ఆ ఆలోచననే మీ జీవితంగా చేసుకోండి. దాని గురించే ఆలోచించండి. దాని గురించే కలలు కనండి. ఆ ఆలోచనతోనే బతకండి .మీ మెదడు కండరాలు నరాలు మీ శరీరంలో ప్రతి భాగం ఆ ఆలోచనతో నిండిపోనివ్వండి. ఇదే విజయానికి మార్గం.

స్వామి వివేకానంద

నేను కాదు నువ్వు

అనే అమూల్యమైన నినాదంతో నిరంతరం సమాజ సేవలో తరిస్తూ దేశ నిర్మాణంలో భాగస్వాములు అవుతున్న విద్యార్థిలోకానికి ప్రతీక *జాతీయ సేవా పథకం*. మహాత్మా గాంధీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా సెప్టెంబర్ 24న ఎన్ ఎస్ ఎస్ ప్రారంభమైంది. దేశములోని 771 యూనివర్సిటీల్లో 42 000 పైగా ఎన్ ఎస్ ఎస్ యూనిట్లు క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి.

యువత నాయకత్వం

ఎన్ ఎస్ ఎస్ యువతలో సామాజిక బాధ్యతను నాయకత్వ లక్షణాలు పెంపొందించే అద్భుత వేదికగా నిలవడం గమనార్హం. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 24న తేదీ దేశవ్యాప్తంగాఎన్ ఎస్ ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుతారు.

2026 సంవత్సరం ప్రత్యేక ప్రాధాన్యత థీమ్

ఈ ఏడాది 2026 లోఎన్ ఎస్ ఎస్ తన సేవా కార్యక్రమాలను సరికొత్త లక్ష్యంతో ముందుకు తీసుకువెళ్తుంది. ప్రస్తుత సమాజాన్ని పీడిస్తున్న అతి పెద్ద సమస్యపై యువతను చైతన్యపరచడానికి *వికసిత భారత్ కోసం వ్యసన ముక్త యువత*(Nasha Muktha yuva viksit Barath) అనే జాతీయ సంకల్పంతో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. దేశాన్ని ప్రగతి పథంలో నడిపించ వలసిన యువశక్తి మత్తు పదార్థాల డిజిటల్ వ్యసనాల బారిన పడకుండా కాపాడుకోవడమే ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం .

నా ఆరోగ్యం నా గర్వం ఫిట్

యువత వ్యసన రహిత

యువత వారోత్సవాలు నిర్వహిస్తారు.

ఇందులో భాగంగా నా ఆరోగ్యం నా గర్వం ఫిట్ యువత మిషనరీ అయితే యువత కొరకు 12 వారాల ప్రత్యేక కార్యచరణను దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఎస్ఎస్ యూనిట్లలో వాలంటీర్లు ఊరేగింపుల ద్వారా సదస్సుల ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్తారు.

పర్యావరణ పరిరక్షణలో యువత

గ్లోబల్ వార్మింగ్ పర్యావరణ కాలుష్యం ప్రపంచాన్ని అతలాకుతం చేస్తున్నాయి. ఇటువంటి తరుణంలో పర్యావరణాన్ని కాపాడడంలో యువత పాత్ర చాలా కీలకం. పర్యావరణాన్ని కాపాడడంలో యువత పాత్ర చాలా కీలకం. కేవలం మొక్కలు నాటడం కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతలు కూడా తీసుకుంటున్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రచారం చేయడంసదస్సులు సమావేశాలను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్య పరిచే శక్తి ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు. జల వనరుల సంరక్షణ సహజవనరుల సంరక్షణ వర్షపు నీటి గుంతలు ఏర్పాటుమరియు పునరుత్పాదక ఇంధన వనరులపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించడం. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న మూఢవిశ్వాసాల పట్ల ప్రజా చైతన్యం అవగాహన కలిగించడంలో యువత అగ్రభాగాన నిలుస్తుంది.

ప్రాణదాతలుగా యువత రక్తదానం

రక్తదానం ప్రాణదానంతో సమానం. ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర వైద్య పరిస్థితిలోనూ రక్తం దొరక్కపోతే ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా ఎన్ ఎస్ ఎస్ నిరంతరం రక్తదాన శిబిరాలను నిర్వహిస్తుంది. రక్త దానం పై అపోహలు వీడండి ప్రాణదాతలుగా నిలవండి అంటూ తోటి విద్యార్థులను ప్రజలను చైతన్య పరుస్తూ తాము స్వయంగా రక్తదానం చేస్తూ లక్షలాదిమంది కి పునర్జన్మను ప్రసాదిస్తున్నారు.

ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆపద్బాంధవులు

వరదలు భూకంపాలు తుఫాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ప్రభుత్వం యంత్రాంగంతో పాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు (యువశక్తి) రంగంలోకి దిగుతుంది. ప్రాణాలకు తెగించి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. పునరావాస శిబిరాల్లో ఆహారము మందులు పంపిణీ చేయడం ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమం చేపట్టడం .అంటు వ్యాధులు తగలకుండా చూడటం వాలంటీర్లు చూపించే చొరవ ప్రశంసనీయం. విపత్కర పరిస్థితుల్లో వారు అందించే సేవలు బాధితులకు కొండంత ధైర్యాన్ని ఇస్తాయి.

ఎన్ ఎస్ ఎస్ చిహ్నం

ఒడిస్సా లోని సూర్య దేవాలయ రథ చక్రం ఆధారంగా ఎన్ఎస్ఎస్ లోగో ని రూపొందించారు. ఈ చక్రం నిరంతరం చలనానికి ప్రగతికి సంకేతం. చక్రంలోని 24 ఆకులు రోజులు 24 గంటలు సూచిస్తూ దేశ సేవ కోసం వాలంటీర్లు ఎప్పుడు సిద్ధంగా ఉంటారని చాటి చెబుతుంది. ఇందులో నీలిరంగు విశ్వవ్యాప్తమైన సేవను ఎరుపు రంగు యువతలోని రక్తం ఉత్సాహంమరియు త్యాగ నిరతిని తెలియజేస్తాయి.యువత కేవలం రేపటి పౌరులు మాత్రమే కాదు .నేటి సమాజానికి నైతిక దీపాలు .పట్టుదల ఆత్మవిశ్వాసం సేవాభావం ఉన్న యువతతోనే సగర్వ వికసిత భారత్ సాధ్యమవుతుంది.

అంతర్జాతీయ యువజన మార్పిడి కార్యక్రమాలు

జాతీయ సేవా పథకం అంతర్జాతీయ స్థాయిలో కూడా శాంతి సాంస్కృతిక మార్పిడి మరియు ప్రపంచ ప్రగతి కోసం విశేషమైన సేవలు అందిస్తుంది. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్టను చాటుతున్నారు. స్నేహపూర్వక దేశాలైన) చైనా రష్యా దక్షిణ కొరియా వియత్నాం ఆఫ్రికా దేశాల్లో) భారతదేశం జరిపే ద్వైపాక్షిక సంబంధాల్లో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆయాదేశాలు పర్యటిస్తున్నారు. భారతీయ సంప్రదాయాలను సామాజిక సేవ పద్ధతులను ప్రపంచ దేశాలకు పరిచయం చేస్తారు.

ప్రపంచ శాంతి

అవగాహన వివిధ దేశాల యువతతో కలిసి అంతర్జాతీయ సమస్యలపై (వాతావరణ మార్పు పేదరికం) మొదలగు సమస్యలపై చర్చలు జరిపి పరస్పర అవగాహన మరియు ప్రపంచ శాంతిని పెంపొందించడంలో భాగస్వాములు అవుతున్నారు. ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలైన యునైటెడ్ నేషన్స్ వాలంటీర్స్ తో కలిసి భారత ప్రభుత్వం ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ఎన్ఎస్ఎస్ ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద యువజన విభాగంగా గుర్తింపు పొందింది.

ఆరోగ్యం పరిశుభ్రత

అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వంటి సమయాల్లో ప్రపంచవ్యాప్త అవగాహన ఉద్యమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు భాగస్వాములు అవుతున్నారు.దేశమంటే మట్టి కాదు దేశమంటే మనుషులోయ్. వెనుకబడిన వారు వెనుకబడిన వారు వెనుకనే ఉంటే దేశమే గతి బాగుపడునోయ్ పొరుగు వారికి తోడ్పడవోయ్ వట్టి మాటలు కట్టిపెట్టి గట్టి మేలు తలపెట్టవోయ్. గురజాడ అప్పారావు

యువత విదార్థి లోకం స్వామి వివేకానంద మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా స్వార్థాన్ని వీడి సమాజ శ్రేయస్సు కు సమాజ వికాసానికి పాటుపడతామని ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు ఎన్ ఎస్ ఎస్ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయాలి.

సేవయే మార్గంగా దేశ ప్రగతియే లక్ష్యంగా మత్తును వీడుదాం. ప్రగతి బాట నడుద్దాం. వ్యసన ముక్త భారతాన్ని నిర్మిద్దామని

నేదునూరి కనకయ్య
9440245771

ఖనిజాల్లో స్వావలంబన

రేపటి ఎలక్ట్రిక్ కారు నడవాలన్నా.. గాలి విద్యుత్‌గా మారాలన్నా.. నేటి అరుదైన ఖనిజాలే ఆధారం. కానీ ఆ ఖనిజాలు ఉన్న దేశంగా భారత్ ఉన్నప్పటికీ, వాటితో తయారయ్యే కీలక అయస్కాంతాల కోసం విదేశాలపై ఆధారపడాల్సి రావడం ఆత్మపరిశీలనకు దారితీస్తోంది. భూగర్భంలో వనరులు ఉండటం మాత్రమే స్వావలంబనకు సరిపోదు; వాటిని విలువైన సాంకేతిక ఉత్పత్తులుగా మార్చే సామర్థ్యమే అసలైన బలం. ఎలక్ట్రిక్ వాహనాల నుంచి విండ్ టర్బైన్ల వరకు ఆధునిక సాంకేతిక రంగాలన్నింటికీ అరుదైన భూ మూలకాలు అత్యంత కీలకంగా మారాయి. ముఖ్యంగా నియోడిమియం, ప్రాసియోడిమియం వంటి మూలకాలతో తయారయ్యే NdFeB శాశ్వత అయస్కాంతాలు ఎలక్ట్రిక్ మోటార్లు, విండ్ టర్బైన్లు, రోబోటిక్స్, ఎలక్ట్రానిక్స్, రక్షణ రంగాల్లో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు.ఈ రంగంలో చైనాపై ప్రపంచానికి గణనీయమైన ఆధారపడటం ఉంది. ప్రపంచ అరుదైన భూ మూలకాల గనుల ఉత్పత్తిలో చైనా వాటా సుమారు 70 శాతం కాగా, శుద్ధి సామర్థ్యంలో 85 శాతానికి పైగా వాటా ఉన్నట్లు అంతర్జాతీయ అంచనాలు సూచిస్తున్నాయి. దీంతో సరఫరా గొలుసులో చైనా ఆధిపత్యం ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనం, అధునాతన తయారీ రంగాలకు కీలకంగా మారింది.భారత్ పరిస్థితి కూడా సవాలుతో కూడుకున్నదే. దేశంలో అరుదైన భూ మూలకాల వనరులు ఉన్నప్పటికీ, వాటిని తవ్వడం నుంచి శుద్ధి చేయడం, చివరకు అధిక నాణ్యత కలిగిన శాశ్వత అయస్కాంతాలుగా మార్చడం వరకు పూర్తి పారిశ్రామిక వ్యవస్థ ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉంది. 2024-25లో లోహంతో తయారైన శాశ్వత అయస్కాంతాల దిగుమతుల్లో చైనా వాటా విలువ పరంగా 81.3 శాతంగా నమోదైంది.అయితే భారత్ వద్ద వనరుల కొరత లేదు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అంచనాల ప్రకారం దేశంలో అరుదైన భూ మూలకాల ఖనిజ వనరులు సుమారు 767 మిలియన్ టన్నులు ఉన్నాయి. అసలు సమస్య వనరులు లేకపోవడం కాదు; వాటిని ఆర్థికంగా, పర్యావరణహితంగా వెలికితీసి, శుద్ధి చేసి, ప్రపంచస్థాయి ఉత్పత్తులుగా మార్చే సాంకేతిక సామర్థ్యాన్ని పెంచుకోవడమే.ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రూ.7,280 కోట్ల వ్యయంతో సింటర్డ్ అరుదైన భూ శాశ్వత అయస్కాంతాల తయారీకి ప్రోత్సాహక పథకాన్ని చేపట్టింది. దీని ద్వారా సంవత్సరానికి 6,000 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2030 నాటికి భారత్‌లో ఇటువంటి అయస్కాంతాల అవసరం 8,220 మెట్రిక్ టన్నులకు చేరుతుందని అంచనా. ఇందులో ఎలక్ట్రిక్ వాహనాలకు 3,250 టన్నులు, విండ్ టర్బైన్లకు 1,800 టన్నులు అవసరమవుతాయని అంచనాలు చెబుతున్నాయి.అందువల్ల భారత్ ముందున్న లక్ష్యం కేవలం అరుదైన ఖనిజాలను తవ్వడం కాదు. గనుల నుంచి శుద్ధి, మిశ్రమ లోహాల తయారీ, అయస్కాంతాల ఉత్పత్తి వరకు పూర్తి సరఫరా గొలుసును దేశంలో నిర్మించడమే అసలు సవాలు. ఇది సాధించినప్పుడే దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనం, రక్షణ, అధునాతన తయారీ రంగాల్లో దేశీయ సామర్థ్యాన్ని బలోపేతం చేయడం సాధ్యమవుతుంది.

సి. హెచ్.ప్రతాప్
77938 00743

సమిష్టి కృషితోనే పిల్లల ఆరోగ్యం

> ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా సుమారు 1.5 బిలియన్ మంది నులి పురుగుల బారిన పడ్డారు. ఇందులో పెద్ద భాగం 5 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలే. భారతదేశంలో 2022 నాటికి సుమారు 22 కోట్ల పిల్లలు నులి పురుగుల ప్రభావానికి లోనవుతుండగా, వీరిలో 70 శాతం గ్రామీణ ప్రాంతాల వారే. ఈ సమస్యను నిర్మూలించేందుకు కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ 2015లో జాతీయ స్థాయిలో నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభించింది. అప్పటి నుండి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 10, ఆగస్టు 10 తేదీల్లో రెండు విడతలుగా ఈ కార్యక్రమం అమలవుతోంది. ఆల్బెండజోల్ అనే సురక్షితమైన మందును పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 1 నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలకు ఉచితంగా అందిస్తున్నారు.

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 10న దేశ వ్యాప్తంగా పాటించబడే ఒక సమగ్ర ఆరోగ్య యజ్ఞం. ఇది కేవలం ఒక ప్రభుత్వ ప్రణాళిక మాత్రమే కాదు, భవిష్యత్ తరాల ఆరోగ్య భద్రతకు పునాది వేసే జాతీయ సంకల్పం. పేగుల్లో నివసించే నులి పురుగులు లేదా పరాన్న జీవులు పిల్లల ఆరోగ్యానికి ముప్పు కలిగించే ప్రధాన కారణాలలో ఒకటి. కలుషితమైన నీరు, పరిశుభ్రత లేని ఆహారం, మట్టి ద్వారా ఇవి పిల్లల శరీరంలోకి ప్రవేశించి, ఎదుగుదలకు కావలసిన పోషకాలను తినేసి బలహీనత, పోషకాహార లోపం, రక్తహీనత వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తాయి. గుండ్రటి పురుగులు, కొక్కెం పురుగులు, చాబుకపు పురుగులు భారతదేశంలో ఎక్కువగా కనిపించే రకాలుగా గుర్తించ బడ్డాయి.ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా సుమారు 1.5 బిలియన్ మంది నులి పురుగుల బారిన పడ్డారు. ఇందులో పెద్ద భాగం 5 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలే. భారతదేశంలో 2022 నాటికి సుమారు 22 కోట్ల పిల్లలు నులి పురుగుల ప్రభావానికి లోనవుతుండగా, వీరిలో 70 శాతం గ్రామీణ ప్రాంతాల వారే. ఈ సమస్యను నిర్మూలించేందుకు కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ 2015లో జాతీయ స్థాయిలో నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభించింది. అప్పటి నుండి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 10, ఆగస్టు 10 తేదీల్లో రెండు విడతలుగా ఈ కార్యక్రమం అమలవుతోంది.

ఆల్బెండజోల్ అనే సురక్షితమైన మందును పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 1 నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలకు ఉచితంగా అందిస్తున్నారు. 2023లో మాత్రమే సుమారు 26.3 కోట్ల పిల్లలకు ఈ మాత్రలు పంపిణీ చేయ బడ్డాయి, ఇది లక్ష్య జనాభాలో 94 శాతం కవరేజీగా గుర్తించ బడింది.

నులి పురుగుల వల్ల పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, ఎదుగుదల లోపం, బరువు తగ్గడం, మానసిక అలసట, పాఠశాల హాజరు తగ్గడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఒక అధ్యయనం ప్రకారం, నులి పురుగుల బారినపడ్డ పిల్లల్లో విద్యా సంబంధ పనితీరు సగటున 20 శాతం వరకు పడిపోతుంది. కాబట్టి ఈ సమస్యను నిర్మూలించడం విద్యా అభివృద్ధి, శారీరక-మానసిక శ్రేయస్సు, దేశ ఆర్థికాభివృద్ధి కోసం కీలకం.

నులి పురుగుల నిర్మూలనతో పాటు, నులి పురుగుల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, ఫైలేరియా వంటి వ్యాధుల నియంత్రణకూ ఇది పరోక్షంగా తోడ్పడుతుంది. 1953లో ప్రారంభమైన జాతీయ మలేరియా నియంత్రణ కార్యక్రమం, తరువాతి దశల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన సమగ్ర దోమ నియంత్రణ చర్యలు ఈ దిశగా పెద్ద మార్పు తీసుకు వచ్చాయి. గత పది సంవత్సరాలలో దేశ వ్యాప్తంగా మలేరియా కేసులు 85 శాతం తగ్గాయి. అయినప్పటికీ డెంగ్యూ, చికున్ గున్యా వంటి వైరల్ వ్యాధులు పట్టణాల్లో ఇంకా విస్తృతంగా ఉన్నాయి. కాబట్టి నీటి నిల్వలను తొలగించడం, మురుగు నీటి కాలువలు, గుంతలను శుభ్ర పరచడం, నిల్వ నీటిలో లార్వా తినే చేపలను వదలడం, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదించిన రసాయనాలతో పిచికారీ చేయడం, దోమ తెరలు, దోమల నివారణ క్రీములు ఉపయోగించడం వంటి చర్యలు నిరంతరంగా అమలవ్వాలి.

పిల్లల ఆరోగ్యాన్ని కాపాడటానికి ప్రతి కుటుంబం పరిశుభ్రతను జీవన విధానంగా అలవర్చు కోవాలి. తాగే నీరు మరిగించి తాగడం, ఆహారం తినే ముందు చేతులు సబ్బుతో కడుక్కోవడం, పండ్లు-కూర గాయలను శుభ్రంగా కడిగి తినడం, కాలుష్యం ఉన్న ప్రదేశాల్లో చెప్పులు లేకుండా నడవక పోవడం వంటి అలవాట్లు నులి పురుగుల వ్యాప్తిని గణనీయంగా తగ్గిస్తాయి. అదేవిధంగా ప్రతి వారం ఒకరోజు "డ్రై డే" పాటించి నిల్వ నీటిని తొలగించడం, పాఠశాలలు-కాలనీల్లో అవగాహన సమావేశాలు నిర్వహించడం, ఆరోగ్య సిబ్బందికి సహకరించడం ప్రజల బాధ్యత.

జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం ఒక రోజు జరిపే కార్యక్రమం మాత్రమే కాదు; ఇది నిరంతర ఆరోగ్య పోరాటం. పిల్లల ఆరోగ్యం మెరుగు పడితేనే దేశం భవిష్యత్తు బలపడుతుంది. చిన్న పరిశుభ్రత అలవాట్లు, సకాలంలో ఔషధం వాడకం, సామూహిక సహకారం కలిసివస్తే నులి పురుగులను నిర్మూలించడం సాధ్యమే. ఆరోగ్యవంతమైన పిల్లలు, శక్తివంతమైన యువత తోనే దేశం నిజమైన అభివృద్ధి మార్గంలో పయనిస్తుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

బతుకు బడి

తెల్లని ఉప్పు వలె జీవించు..
ఎవరూ ఎక్కువగా వాడుకోలేరు
పూర్తిగా దూరం కూడా పెట్టలేరు
ఆచితూచి వాడుకుంటారు!
బడిలో నేర్పిన పాఠాలకు సెలబస్
ఉంది
బతుకు నేర్పిన పాఠాలను పరిమితి
లేదు
పాఠం చెప్పి పరీక్ష పెడతంది పాఠశాల
పరీక్ష పెట్టి పాఠం నేర్పుతుంది బతుకు
బడి!
భవిష్యవాణి కోసం పంజరంలో..
బంధించబడుతుంది రామచిలుక
నల్లని కాకిని ఎవరూ పట్టించుకోరు
స్వేచ్ఛగా, సరదాగా ఎగురుతుంది
శ్మశానంలో కాకికి మరీ దండం
పెట్టి...
పంచభక్ష పరమాన్నాలు వడ్డిస్తారు..
అందమైన చిలుకకే కదా బాధలు
కాకి అదృష్టం రామచిలుకకు ఎక్కడ!
ఒంటరిగా కూర్చుని ఓ ప్రశ్న వేసుకో..
నీవు పోయిన పిమ్మట ఎవరు..
నిన్ను గుర్తించుకొని కన్నీళ్లు కారుస్తారు
పెద్ద కర్మతో నీవు చేసిన కర్మల్ని
మరిచి..
నీ ఆస్తిని ముక్కలు ముక్కలుగా చేసి..
కాలు మీద కాలు వేసుకుని
అనుభవిస్తారు
ఇదే కదా మనం కూడా చేసింది,
చేస్తున్నది!

మధుసూదన్ రెడ్డి
9949700037

జాతీయం-అంతర్జాతీయం

సర్ పేరుతో రాజ్యాంగపై దాడి

- ఈసీపై రాహుల్, మమత, తేజస్వీ ఆగ్రహం
- ప్రజా తీర్పులను అపహరిస్తున్నారంటూ ఆవేదన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23 (ఎ.ఎం.ఎస్):
కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ)పై ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, ఆర్జేడీ అధినేత తేజస్వీ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్ ప్రక్రియ పేరుతో ఈసీ రాజ్యాంగంపై ప్రత్యక్ష దాడి చేస్తోందని, బీజేపీ, ఆర్ఎస్ఎస్ , ఈసీ దేశద్రోహానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఈసీపై విమర్శలు గుప్పించారు.“నేను ఎన్నికల కమిషన్‌కు, ఎన్నికల అధికారులకు స్పష్టంగా చెబుతున్నాను. మీరు చేస్తున్నది తప్పు. ఇది దేశద్రోహం, ఇది దేశానికి వ్యతిరేకం. ఇది మర్చిపోవద్దు. సమయం వస్తుంది! మేము మిమ్మల్ని పట్టుకుంటాము! మిమ్మల్ని వదిలిపెట్టం.” అని ఆయన రాసుకొచ్చారు. బీజేపీకి అనుకూలంగా వ్యవహరించే అధికారులను నియమించడం ద్వారా ఎన్నికల నిర్వహణ యంత్రాంగం పక్షపాతపూరితంగా మారిందని మమతా బెనర్జీ అన్నారు. దేశ ఎన్నికల చరిత్రలోనే ఇది అపూర్వమైన కుంభకోణమని, ఇది అత్యంత వివాదాస్పదమైన వ్యవహారం. తమ జీవితంలో ఇలాంటిది ఎప్పుడూ చూడలేదు. ఈ ఎన్నికల కమిషనర్‌ను తప్పక అరెస్టు చేయాలి. పదవిలో కొనసాగే నైతిక అర్హత ఆయనకు లేదు అని ఆమె డిమాండ్ చేశారు. సర్ పేరుతో ఆయా రాష్ట్రాల్లోని ప్రజా తీర్పును అపహరించారని, బీహార్, పశ్చిమ బెంగాల్‌లలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని బీహార్ శాసనసభ నేత తేజస్వి యాదవ్ డిమాండ్ చేశారు. గత 10 నెలల్లో మేము ఎన్నికల కమిషన్‌కు అనేక ఫిర్యాదులు చేశామని. కమిషన్‌లోని ఇతర ఎన్నికల కమిషనర్లు దీనిపై ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ మాత్రం మౌనంగానే ఉన్నారని ఆయన విమర్శలు గుప్పించారు.

ఫ్రాన్స్‌లో వేలాది మంది నిరసన

- పోలీసు కాల్పుల చట్టానికి వ్యతిరేకంగా కదిలిన జనం
- జవాబుదారీతనంపై హక్కుల సంఘాల ఆందోళన
- పారిస్ సహా పలు నగరాల్లో ప్రదర్శనలు

ప్యారిస్, సెప్టెంబరు 23:
ఫ్రాన్స్‌లో పోలీసుల ఆయుధ వినియోగానికి సంబంధించిన నిబంధనలను మార్చేందుకు ఉద్దేశించిన ప్రతిపాదిత చట్టానికి వ్యతిరేకంగా ఆదివారం ప్యారిస్‌తో పాటు పలు నగరాల్లో వేలాది మంది ప్రజలు నిరసన చేపట్టారు. పోలీసులకు కాల్పుల విషయంలో అదనపు చట్టపరమైన రక్షణ కల్పించే ఈ బిల్లును పార్లమెంటు దిగువ సభ జులైలో ఆమోదించగా.. ప్రస్తుతం సెనేట్ పరిశీలనకు ఎదురుచూస్తోంది. ఫ్రాన్స్ జాతీయ అసెంబ్లీలోని డిప్యూటీలు జులైలో ఆమోదించిన ఈ ప్రతిపాదిత చట్టం ప్రకారం.. పోలీసులు, జెండార్మరీ సిబ్బంది తమ ఆయుధాలను ఉపయోగించినప్పుడు వారు చట్టబద్ధంగానే వ్యవహరించారనే ముందస్తు భావనకు అవకాశం కల్పించనున్నారు. ఈ బిల్లు ప్రస్తుతం సెనేట్ పరిశీలనలో ఉంది. అయితే, ఈ నిబంధన పోలీసులపై ఉన్న జవాబుదారీతనాన్ని తగ్గించే ప్రమాదం ఉందని హక్కుల సంఘాలు, ప్రతిపక్ష రాజకీయ నాయకులు, కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పోలీసు కాల్పుల కేసుల్లో నిందితులుగా ఉన్న అధికారులకు అనుకూలంగా రుజువు బాధ్యతను మార్చే ప్రయత్నం జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు. నిరసనల్లో పాల్గొన్న అమల్ బెంటూసీ తన సోదరుడు అమిన్ ఘటనను ప్రస్తావించారు. 2012లో ప్యారిస్‌కు ఉత్తరంగా ఉన్న సీన్‌సెయింట్‌డెనిస్ ప్రాంతంలో దోపిడీదారుడిగా భావించిన అమిన్‌ను పోలీసులు వెనుకవైపు కాల్చి చంపారని ఆమె తెలిపారు. ప్రతిపాదిత చట్టాన్ని ఆమె ‘ఉరితీసే లైసెన్స్’గా అభివర్ణించారు. పోలీసుల బలప్రయోగానికి సంబంధించిన కేసుల్లో రుజువు బాధ్యతను మార్చేలా ఈ చట్టం రూపొందించారని ఆరోపించారు. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, ఫ్రాన్స్ మేజిస్ట్రేట్ల సంఘం, దేశంలోని లీగ్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు కూడా నిరసనల్లో పాల్గొన్నారు.నిరసనల నేపథ్యంలో ఫ్రాన్స్ అంతర్గత వ్యవహారాల మంత్రి లారెంట్ నూనెజ్ పోలీసులను అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆందోళనల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ర్యాన్స్ నగరంలో నిరసనకారులు పోలీసులపై వస్తువులు విసిరిన ఘటనలో ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ముగ్గురు పోలీసు అధికారులు గాయపడ్డారు.

ప్రతిపాదిత చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఫ్రాన్స్ జాతీయ అసెంబ్లీ వెబ్‌సైట్‌లో ప్రారంభించిన పిటిషన్‌కు సుమారు 7.3 లక్షల సంతకాలు వచ్చాయి. అయితే, పార్లమెంటరీ న్యాయ కమిటీ జులైలో ఆ పిటిషన్‌ను తిరస్కరించింది. ప్రస్తుతం బిల్లు సెనేట్ పరిశీలనకు వెళ్లిన నేపథ్యంలో.. పోలీసుల బలప్రయోగం, పౌరుల హక్కులు, అధికారుల జవాబుదారీతనం వంటి అంశాలపై ఫ్రాన్స్‌లో చర్చ మరింత తీవ్రతరమైంది. ఫ్రాన్స్‌లోని మరికొన్ని నగరాల్లోనూ చట్టానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిగాయి. లియాన్‌లో 4,500 మంది, టులూజ్‌లో మరో 3,700 మంది ఆందోళనలో పాల్గొన్నారు. పోలీసు హింస మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రతినిధి సెడ్రిక్ పికార్డ్ ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసు దుర్వినియోగం ఇప్పటికే తీవ్రమైన సమస్యగా ఉన్న దేశంలో ఈ చట్టం పరిస్థితిని మరింత దిగజార్చే ప్రమాదం ఉందని నిరసనకారులు అంటున్నారు. మార్సెయిలో నిరసనలో పాల్గొన్న హ్యూగో అనే హైస్కూల్ విద్యార్థి మాట్లాడుతూ.. పోలీసు హింస పెరుగుతుందనే భయం తమలో ఉందని తెలిపారు. అయితే ప్రతిపాదిత చట్టానికి మద్దతుదారులు మాత్రం పోలీసులకు అనుకూలంగా తమ వాదనను వినిపిస్తున్నారు.

ప్యారిస్‌లో జరిగిన నిరసనలో వామపక్ష ఫ్రాన్స్ అన్‌బౌడ్ (ఎల్ఎఫ్ఐ)) పార్టీ నాయకురాలు మాథిల్డ్ పనోట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె పోలీసులపై తీవ్ర విమర్శలు చేశారు. “పోలీసులు ఇప్పటికే చంపుతున్నారు. ఈ చట్టాన్ని సెనేటర్లు తిరస్కరించాలి” అని తెలిపారు. రిపబ్లిక్‌లో పోలీసులకు శిక్షారహిత అధికారాన్ని కల్పించరాదని ఆమె అన్నారు. ఇతర పౌరుల ప్రాణాలపై నిర్ణయం తీసుకునే హక్కు ఏ ఒక్క వర్గానికీ ఉండకూడదని స్పష్టం చేశారు.

మా గొంతు గట్టిగా వినిపిస్తాం

- ఐరాసలో మా సత్తా చాటుతాం
- ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్

న్యూయార్క్, సెప్టెంబరు 23 :
తమ దేశ వైఖరిని ఐరాస సర్వసభ్య సమావేశంలో గట్టిగా సమర్థిం చుకుంటామని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ చెప్పారు. న్యూయార్క్ బయలుదేరి వెళ్లడానికి ముందు ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ‘మేము గర్వంగా తలెత్తుకొని బయటపడ్డాం. ఇది మా అందరి గౌరవానికి, గర్వానికి చిహ్నం. కాబట్టి అంతర్జాతీయ వేదికలపైమా వైఖరిని దృఢంగా సమర్థించుకుంటాం’ అని తెలిపారు. ఇరాన్ దుస్థితిని అంతర్జాతీయ సమాజానికి తెలియజేయడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటామని, ఎన్ని అన్యాయాలు, అక్రమాలు జరిగినా ఇరాన్ ప్రజలు తమ పట్టును వీడకుండా నిలబడ్డారని శత్రువులకు గట్టిగా చెబుతామని అన్నారు. కాగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఇప్పటికే న్యూయార్క్ చేరుకున్నారు. అమెరికాతో యుద్ధం మొదలైన తర్వాత పెజెష్కియాన్, అరాగ్చీ ఆ దేశంలో అడుగు పెట్టడం ఇదే మొదటి సారి. ఇరాన్ నేతల ప్రయాణానికి అవసరమైన వీసా లను అమెరికా ఆమోదించింది. అయితే న్యూ యార్క్ లో వారి కదలికలపై ఆంక్షలు విధించింది. పెజెష్కి యాన్ మీడియా బృందం సభ్యులు సహా అనేక మంది ప్రతినిధులకు వీసాలను నిరాకరించింది. న్యూయార్క్ చేరుకున్న తర్వాత అరాగ్చీ ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్‌తో టెలిఫోన్‌లో మాట్లాడారు. సర్వసభ్య సమావేశపు అజెండా గురించి, అంతర్జాతీయ శాంతి, భద్రత గురించి వారు చర్చించారు.

ఎన్నికల సంఘానికి సుప్రీం నోటీసులు

- లాజికల్ డిస్క్రెపెన్సీ’ అంటే ఏమిటో స్పష్టంగా చెప్పాలంటూ ఆదేశాలు
- 33 లక్షల మందికి నోటీసులపై ఆందోళన
- ఒక్క ఓటు కూడా విచారణ లేకుండా తొలగించం: ఈసీ న్యాయవాది

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23 (ఎ.ఎం.ఎస్):
ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసుల తీరుపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ‘లాజికల్ డిస్క్రెపెన్సీ’ పేరుతో కొందరు ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నప్పటికీ, అందులో ఏ అంశంపై వివరణ ఇవ్వాలో స్పష్టంగా పేర్కొనకపోవడాన్ని ధర్మాసనం ప్రశ్నించిం... కొన్ని నోటీసులు యాంత్రికంగా, బహుశా కంప్యూటర్‌తో రూపొందించి జారీ చేస్తున్నట్లుగా కనిపిస్తున్నాయని పేర్కొంది. సర్ నోటీసులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్‌లను మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఓటర్లను ‘డౌట్‌ఫుల్’ జాబితాలో చేర్చి, వారి గత రికార్డుల్లో తేడాలు ఉన్నాయంటూ ఈసీ నోటీసులు ఇస్తున్న తీరుపై పిటిషన్‌లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసిన ధర్మాసనం, వివరణ ఇవ్వాలని పేర్కొంది.

‘లాజికల్ డిస్క్రెపెన్సీ’ అంటే ఏమిటో ఓటర్లకు స్పష్టంగా తెలియజేయాలని సీజేఐ సూచించారు. ఒక వ్యక్తి గతంలో మరో రాష్ట్రంలో ఓటు వేసి, అనంతరం ఢిల్లీకి వచ్చి ఉంటే.. ఆయన ఓటింగ్ వివరాల్లో ఏ అంశంపై వివరణ కోరుతున్నారో నోటీసులో స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు. ‘ఢిల్లీ లేదా మరెక్కడైనా ఓటు వేశారా? స్పష్టం చేయండి’ అని అడగడం మాత్రమే కాకుండా, ఏ విషయాన్ని స్పష్టం చేయాలో ఓటరుకు అర్థమయ్యే విధంగా తెలియజేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) మరింత సహకరించాలని సుప్రీంకోర్టు సూచించింది. పాత ఓటర్ల జాబితాల్లో పేర్లు ఉన్నాయా, ఏ ధ్రువపత్రాలు అందుబాటులో ఉన్నాయి వంటి అంశాలపై బిఎల్ఒలు ప్రజలకు వివరించగలిగితే ప్రక్రియ సులభమవుతుందని ధర్మాసనం పేర్కొంది. సర్‌కు సంబంధించి ఓటర్లకు ఎదురయ్యే సాధారణ సందేహాలపై ఎన్నికల సంఘం తరచూ అడిగే ప్రశ్నలుసమాధానాల జాబితాను రూపొందించాలని కూడా సుప్రీంకోర్టు సూచించింది. దాన్ని పత్రికలు, వెబ్‌సైట్లు, స్థానిక సంస్థలు, బీఎల్ఒతో ప్రజలకు అందుబాటులో ఉంచాలని సీజేఐ సూచించారు. ఇది ప్రజ[illegible]ంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ ఢిల్లీలో సుమారు 33 లక్షల మందికి నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. రోజువారీ కూలీలు, సామాన్య ప్రజలు ఇలాంటి నోటీసులకు ఎలా స్పందించగలరని ప్రశ్నించారు. నోటీసుల్లో తగిన కారణాలు, తదుపరి తీసుకోవాల్సిన చర్యలు స్పష్టంగా ఉండటం లేదని వాదించారు. తల్లిదండ్రులుపిల్లల వయస్సు మధ్య తేడా తక్కువగా ఉందని ‘లాజికల్ డిస్క్రెపెన్సీ’గా చూపితే, దాన్ని నిరూపించడానికి ఓటర్లు ఎలాంటి పత్రాలు సమర్పించాలో స్పష్టత లేదని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల సంఘం సూచిస్తున్న 12 రకాల పత్రాల్లో ఇలాంటి విషయాలను నిరూపించే సమాచారం లేదని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం తరపున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదిస్తూ ప్రతి సర్ నోటీసులో కారణం పేర్కొంటున్నామని తెలిపారు. అవసరమైన వివరణలను ఓటర్లు సమర్పించవచ్చని, పత్రాల జాబితా పరిమితమైనది కాదని చెప్పారు. ‘ఒక్క ఓటరును కూడా విచారణ లేకుండా తొలగించం’ అని అన్నారు. నోటీసుల్లో బిఎల్ఒలను సంప్రదించేందుకు వారి పేరు, మొబైల్ నంబర్ వంటి వివరాలు ఇస్తున్నామని తెలిపారు. సర్ ప్రక్రియలో పెండింగ్‌ను తగ్గించేందుకు సిబ్బందిని పెంచుతున్నామని చెప్పారు.అయితే, ప్రభావిత ఓటర్లకు అధికారుల నుంచి స్పష్టమైన సమాచారం, ప్రత్యక్ష సహాయం అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు సూచించింది. ఢిల్లీలో సమీప భవిష్యత్తులో ఎన్నికలు లేనందున ప్రక్రియలో తలెత్తిన లోపాలను సరిదిద్దేందుకు సమయం ఉందని ధర్మాసనం పేర్కొంది. ఈసీ నుంచి తక్షణం తీసుకున్న చర్యల వివరాలను కూడా తమ ముందుంచాలని ఆదేశించింది. అనంతరం కేసు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

బెర్లిన్ ఎన్నికల్లో ఎర్రజెండా విజయం

- తొలిసారిగా మేయర్ పీఠంపై కమ్యూనిస్టు ఎలిఫ్ ఎరాల్ప్

బెర్లిన్, సెప్టెంబరు 23 :
జర్మనీలోని బెర్లిన్ రాష్ట్ర ఎన్నికల్లో వామపక్ష పార్టీ డై లింకె (ది లెఫ్ట్) అతిపెద్ద పార్టీగా అవతరించింది. టర్కీ వలసదారుల కుమార్తెన ఎలిఫ్ ఎరాల్ప్ (45), జర్మనీ రాజధాని నగరానికి తదుపరి మేయర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. పేదరికం, అసమానతలను తగ్గించడమే లక్ష్యంగా ప్రచారం చేసిన ఆమె పార్టీ, నగరంలోని గృహ సమస్యలు, అద్దెల భారాన్ని తగ్గించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చింది. పెద్ద కార్పొరేట్ ఇళ్ల యజమానుల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలన్న ప్రతిపాదన కూడా ఇందులో భాగంకావడం గమనార్హం. సామాజిక అసమానతలను, పెద్ద వ్యాపార సంస్థల ఆధిపత్యాన్ని తగ్గించాలని కోరుకునే ఎరాల్ప్‌ను, న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన డెమోక్రటిక్ సోషలిస్ట్ నేత జొహ్రాన్ మామ్దానీతో పోలుస్తున్నారు. 1990 జర్మనీ పునరేకీకరణ తర్వాత మొదటిసారిగా బెర్లిన్ మేయర్ కార్యాలయాన్ని చేజిక్కించుకోవాలంటే ఆమెకు మిత్రపక్షాల మద్దతు అవసరం.

సోషల్ డెమోక్రటిక్ పార్టీ (ఎస్‌పిడి), గ్రీన్స్‌తో కలిసి “రెడ్‌రెడ్‌గ్రీన్” కూటమి ఏర్పాటు చేయాలని ఆమె భావిస్తున్నారు. కానీ ఇది సవాలుతో కూడుకున్న పని. ఆస్తుల స్వాధీన ప్రతిపాదనను ఎస్‌పిడి వ్యతిరేకిస్తోంది. ఉక్రెయిన్‌కు సైనిక సాయం, నాటోపై డై లింకె వైఖరిని కూడా వారు అంగీకరించడం లేదు.

దేన్నయినా ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉండాలి

- ఎల్‌నినోపై పర్యావరణ శాస్త్రవేత్తల సూచన
- పరిశోధన-పర్యవేక్షణలను ముమ్మరం చేయాలంటూ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23 (ఎ.ఎం.ఎస్) :
సూపర్ ఎల్‌నినో కారణంగా వన్యప్రాణులపై, పర్యావరణ వ్యవస్థలపై పడే తీవ్ర ప్రభావాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని సుమారు 200 మంది పర్యావరణ శాస్త్రవేత్తలు తమ తోటి పరిశోధకులు, క్షేత్ర స్థాయి నిపుణులను కోరారు. ఎల్‌నినో ప్రభావాన్ని బాగా అర్థం చేసుకోవడానికి, దానిని అంచనా వేయడానికి పరిశోధనపర్యవేక్షణ యత్నాలను ముమ్మరం చేయాలని సూచించారు. భారత్ సహా ప్రపంచంలోని పలు దేశాలపై ఎల్‌నినో ప్రభావం ఇప్పటికే ప్రారంభమైంది. ఇది చాలా తీవ్రంగా ఉంటుందని శాస్త్రవేత్తలు, అంతర్జాతీయ సంస్థలు హెచ్చరించాయి. మానవ చరిత్రలోనే ఇది అత్యంత వేడిగా ఉండే సంవత్సరాలలో ఒకటిగా నిలుస్తుందని వాతావరణ శాస్త్రవేత్త రాక్సీ మాథ్యూ కోల్ చెప్పారు. ఓ బలమైన ఎల్‌నినో ఏర్పడుతుందని, అది ఆగస్ట్అక్టోబర్ మధ్య మరింత బలపడుతుందని ఐరాసకు చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) జూలైలోనే తెలియజేసింది. ఈ నెల 3న అది స్థిరంగా ఏర్పడిందని తాజాగా ప్రకటించింది. రాబోయే కాలంలో ఇది మరింత బలమైన స్థాయికి చేరుకొని వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ కొనసాగుతుందని తెలిపింది. దీనివల్ల వర్షపాతం, ఉష్ణోగ్రతలపై తీవ్ర ప్రభావం పడుతుందని, అలాగే కొన్ని ప్రాంతాలలో వరదలు, కొన్ని ప్రాంతాలలో కరువు కాటకాలు సంభవిస్తాయని చెప్పింది. ఎల్‌నినో మన కళ్ల ముందే విశ్వరూపం చూపిస్తోందని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే నెలలలో సూపర్ ఎల్‌నినో మన దేశంపై అనేక రకాల వినాశకరమైన ప్రభావాలను చూపిస్తుందని 188 మంది భారతీయ పర్యావరణవేత్తలు ఈ నెల 16న ‘కాల్ టు యాక్షన్’ పేరిట ఓ ప్రకటనలో హెచ్చరించారు. వన్యప్రాణుల రక్షణకు, పర్యావరణ వ్యవస్థల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వారు సూచించారు.

మరో యువ జంటపై బీజేపీ దాడి

- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- పోలీసుల అదుపులో నిందితులు

భువనేశ్వర్, సెప్టెంబరు 23 (ఎ.ఎం.ఎస్):
బీహార్‌లో బాలిక, ఆమె స్నేహితుడిపై వేధింపులను మర్చిపోకముందే.. తాజాగా అలాంటి మరో ఘటన మరో బీజేపీ పాలిత రాష్ట్రంలో చోటు చేసుకోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఒడిషాలోని ధెంకనాల్ జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కపిలాష్‌కు సమీపంలో ఒక యువ జంటపై కొంత మంది దుండగులు వేధింపులకు పాల్పడి, దాడి చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

వీడియోలోని దృశ్యాల ప్రకారం... ఒక యువ జంట మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తుండగా, కొందరు దుండగులు వారిని అడ్డగించారు. జంటను చుట్టుముట్టి వారిపై వేధింపులకు దిగారు. కొంతమంది యువకుడిపై దాడి చేయగా, మరికొంత మంది యువతితో అనుచితంగా ప్రవర్తించడం వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. తమను వదలి పెట్టాలని మహిళ తన చుట్టూ ఉన్నవారిని పదేపదే వేడుకోవడం కూడా ఇందులో వినిపిస్తోంది. ఆమె ఎంతగా ప్రాధేయపడినా వారి వినకుండా దాడి, వేధింపులు కొనసాగించారు. ఈ నెల 18న ఈ ఘటన జరిగినట్లుగా భావిస్తున్నారు. బాధితుల్ని కటక్ జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. ఈ ఘటనతో రాష్ట్రంలో మహిళల భద్రతతో పాటు పర్యాటక ప్రాంతాల వద్ద యాత్రికుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. వీడియో వెలుగులోకి రావడంతో పోలీసులు స్పందించారు. ధెంకనాల్ ఎస్‌పి అభినవ్ సోంకర్ మీడియాతో మాట్లాడుతూ నిందితులు సరోజ్ నాయక్, సమీర్ నాయక్, సంగ్రామ్ రథ్ లను అరెస్టు చేశామని, మిగిలిన వారిని కూడా త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని

ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తున్నారు
ఉద్ధవ్ థాకరే అసహనం

ముంబయి, సెప్టెంబరు 23 (ఎ.ఎం.ఎస్) :
ఎన్నికల కమిషన్ నిర్ణయాలు ప్రజాస్వామ్యాన్నిదెబ్బతీస్తున్నాయని ఉద్ధవ్‌థాకరే ఆరోపించారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో వచ్చిన కథనంపై శివసేన అధినేత ఉద్ధవ్ థాకరే బుధవారం స్పందించారు. విలేకరుల సమావేశంలో థాకరే మాట్లాడుతూ.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఎన్నికల సంఘం తమ పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించిందని ఆరోపిస్తూ ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. “గత కొన్ని రోజులుగా, ఎన్నికల కమిషన్‌కు చెందిన జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలనే డిమాండ్ వస్తోంది. జ్ఞానేష్ కుమార్ అసలు స్వరూపం దేశం ముందు బయటపడింది,” అని థాకరే అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ, ఓటర్ల జాబితా విధానాలకు సంబంధించిన నిర్ణయాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్ల తీరు భిన్నంగా ఉందని ఆయన ఆరోపించారు.

“శివసేన పేరు, గుర్తును ఎన్నికల సంఘం ఆ ద్రోహులకు కట్టబెట్టింది. ఎన్నికలకు ముందు సుమారు 40 లక్షల మంది ఓటర్ల పేర్లను జాబితాలో చేర్చి, ఎన్నికల తర్వాత వాటిని తొలగించారు,” అని ఆయన ఆరోపించారు. కేవలం “అధికార దాహం” వల్లే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని థాకరే ధ్వజమెత్తారు. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ , కర్ణాటక రాష్ట్రాల్లో ఎన్నికలను తిరిగి బ్యాలెట్ పేపర్ల ద్వారా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

అమెరికాలో జిన్‌పింగ్

- చర్చల అజెండాపై పలు సన్నాహక సమావేశాలు

బీజింగ్, సెప్టెంబరు 23 :
కిర్గిజ్‌స్థాన్, ఈజిప్ట్, భారత్‌లో సుడిగాలి పర్యటనలు జరిపిన చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ బుధవారం నుంచి మూడు రోజుల పాటు అమెరికాలో పర్యటిస్తారు. జిన్‌పింగ్ అమెరికా పర్యటనకు ముందు అనేక సన్నాహక సమావేశాలు జరిగాయి. ట్రంప్, జిన్‌పింగ్ మధ్య జరిగే శిఖరాగ్ర సమావేశపు అజెండాను ఖరారు చేయడానికి అమెరికా వాణిజ్య మంత్రి స్కాట్ బెస్సెంట్, చైనా ఉపాధ్యక్షుడు హే లెఫెంగ్‌తో న్యూయార్క్‌లో ఆదివారం సమావేశమయ్యారు. అంతకుముందే పర్యటనపై చర్చించడానికి అమెరికా, చైనా విదేశాంగ మంత్రులు మార్కో రుబియో, వాంగ్ యీ మధ్య ఫోన్ సంభాషణ జరిగింది. శిఖరాగ్ర సమావేశం యొక్క వివరాలను ఖరారు చేయడానికి జూలైలో చైనా సహాయ మంత్రి మా జావోక్సూ వాషింగ్టన్ వెళ్లారు. గత సంవత్సరం మేలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బీజింగ్‌ను సందర్శించారు. గత సంవత్సరం అక్టోబరులో దక్షిణ కొరియాలోని బుసాన్‌లో ఇరువురు నేతల మధ్య కీలక చర్చలు జరిగాయి. కాగా జిన్‌పింగ్, ట్రంప్ మధ్య అనేక కీలక అంశాలపై చర్చ జరుగుతుందని తెలుస్తోంది.

శ్వేతసౌధంలో సొంత వేదిక

- ట్రంప్ పేరిట కొత్త టీవీ ఛానెల్ ప్రారంభం
- మూడు వార్తా సంస్థలపై అధ్యక్షభవనం నిషేధం
- వైదొలిగిన ప్రముఖ మీడియా సంస్థలు

వాషింగ్టన్, సెప్టెంబరు 23 :
అధ్యక్షభవనంలోకి ప్రముఖ మీడియా సంస్థల ప్రవేశాన్ని నిషేధించిన దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా తన పేరిట ఓ కొత్త టీవీ ఛానెల్‌ను ప్రారంభించారు. శ్వేతసౌధం సోమవారం ‘ట్రంప్ టీవీ’ పేరిట ఓ వేదికను ఏర్పాటు చేసింది. దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన ప్రసంగాలను, పరిపాలనా సంబంధమైన ప్రకటనలను, తాజా సమాచారాన్ని అందించేందుకు ఈ 24/7 ప్రత్యక్ష వేదిక ఉపయోగపడుతుంది. అంటే ఇది అధ్యక్షుడికి సంబంధించిన సమస్త సమాచారాన్ని వీక్షకులకు అందజేస్తుందన్న మాట. ట్రంప్ టీవీ ప్రారంభోత్సవంపై అధ్యక్షభవనం తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ పోస్ట్ పెడుతూ ‘ఇది ప్రత్యక్ష ప్రసారం. ట్రంప్ టీవీ ఇప్పుడు ప్రసారం అవుతోంది. ఇది ప్రతి రోజూ 24 గంటలు పనిచేస్తుంది. ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందజేస్తుంది. గతంలో జరిగిన ఘటనలు, అధ్యక్షుడు చేసిన ప్రసంగాలు, పాలనా సంబంధమైన ప్రకటనలు...ఇలా అనేక గొప్ప విషయాలు ఒకే చోట అందుబాటులో ఉంటాయి. ఇవన్నీ మీ టీవీలో ప్రసారం కాలేదు. కానీ ఇప్పుడు అవుతాయి’ అని తెలిపింది. ఈ సందర్భంగా గతంలో ట్రంప్ చేసిన ప్రసంగాలను, ఆయన హాజరైన కార్యక్రమాల ఫుటేజీలను అధ్యక్షభవనం ప్రసారం చేసింది. అమెరికా 47వ అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణస్వీకారం చేసిన కార్యక్రమాన్ని కూడా ఇందులో చూపించారు.

ట్రంప్, నెతన్యాహుల యుద్ధోన్మాదాన్ని ఆపాలి

- న్యూయార్క్ లో భారీ ప్రదర్శన

న్యూయార్క్, సెప్టెంబరు 23 :
ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం కోసం ప్రపంచ నాయకులు సమావేశమవుతున్న తరుణంలో మంగళవారం న్యూయార్క్ లో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇరాన్ జాతీయ ప్రతిఘటన మండలి మద్దతుదారులు ప్లకార్డులు, నినాదాలతో హోరెత్తించారు. ఐక్యరాజ్యసమితి సమీపంలో జరిగిన ఈ ప్రదర్శనలో ఇరాన్‌లో జరుగుతున్న హత్యలు, రాజకీయ అణచివేతపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ట్రంప్, నెతన్యాహులు చేస్తున్న మారణహోమాన్ని ఆపేలా ఐరాస జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు సమావేశం జరిగే ప్రాంతంలో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. నిరసనకారులు ప్రదర్శనగా వస్తుండగా భద్రతాబలగాలు అడ్డుకున్నాయి.

వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

కంప్యూటర్ విద్య, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

– జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ, సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి) : పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుతో పాటు కంప్యూటర్ విద్య, పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేట ఎంపీపీఎస్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన కలెక్టర్, విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా అందించాలన్నారు. వివిధ తరగతి గదులను సందర్శించి విద్యార్థుల అభ్యసన స్థాయిని, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. బయట నిర్వహిస్తున్న తరగతులను వెంటనే భవనంలోకి మార్చాలని ప్రధానోపాధ్యాయురాలు అమృతకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించి, కట్టెల పొయ్యిపై వంట చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గ్యాస్‌పైనే వంట చేయాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శికి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్, ప్రధానోపాధ్యాయురాలు అమృత, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

గణపతి నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

– జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ, సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి) : వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్, జిడబ్ల్యూఎంసి ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి తెలిపారు. బుధవారం హనుమకొండలోని బంధం చెరువు, సిద్ధేశ్వర గుండం వద్ద జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్లను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బంధం చెరువు, చిన్న వడ్డేపల్లి చెరువు, ఉర్సు చెరువు, న్యూ శాయంపేట కోట చెరువుల వద్ద విగ్రహాల ఎత్తు, నీటి లభ్యతకు అనుగుణంగా క్రేన్లు, లైటింగ్, బ్యారికేడింగ్, పారిశుద్ధ్య వసతులను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. జిడబ్ల్యూఎంసి, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్, ఫిషరీస్ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. నిమజ్జన ప్రదేశాల వద్ద రద్దీ, నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు మండపాల నిర్వాహకులు, భక్తులు వీలైనంత త్వరగా నిమజ్జన ప్రక్రియను ప్రారంభించి అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే తరహాలో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుడి నిమజ్జనం

తొమ్మిది రోజుల పూజలకు ఘన ముగింపు
వీధుల్లో మార్మోగిన గణపతి నామస్మరణ

వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 23 : వినాయక చవితి సందర్భంగా తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథుడికి బుధవారం భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భారీ ఊరేగింపులతో గణపతి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఉదయం నుంచే గణేష్ మండపాల వద్ద భక్తుల సందడి నెలకొంది. ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి స్వామివారికి వీడ్కోలు పలికారు. అనంతరం డప్పులు, బ్యాండ్ మేళాలు, భక్తి గీతాల మధ్య గణనాథుడి శోభాయాత్ర నిర్వహించారు. యువత, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతి నామస్మరణతో పరిసరాలను మార్మోగించారు. 'గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా' అంటూ భక్తులు నినాదాలు చేస్తూ విగ్రహాలను నిమజ్జన ప్రదేశాలకు తరలించారు. పలుచోట్ల యువత ఆధ్వర్యంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, డీజేలు, భక్తి సంగీతంతో శోభాయాత్రలు ఉత్సాహంగా సాగాయి. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో వాహనాల మళ్లింపు చర్యలు చేపట్టారు. నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్, తాగునీరు, వైద్య సదుపాయాలు, క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టి గణపతి విగ్రహాలను వినియోగించాలని, నిమజ్జనం అనంతరం చెరువులు, జలాశయాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు అవగాహన కల్పించారు. తొమ్మిది రోజుల పాటు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచిన గణనాథుడి నిమజ్జనంతో వినాయక నవ రాత్రి ఉత్సవాలకు ఘనంగా ముగింపు పలికారు. భక్తుల హృదయాల్లో భక్తి భావాన్ని నింపిన గణపయ్యకు కన్నీటి వీడ్కోలు పలుకుతూ వచ్చే ఏడాది మరింత వైభవంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

10 వేల మెట్రిక్ టన్నుల గోదాముకు సీతక్క శంకుస్థాపన

ములుగు/తాడ్వాయి, సెప్టెంబరు 23 (వుదయం ప్రతినిధి) : రైతులు పండించిన పంటలకు సురక్షిత నిల్వ సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం గోదాముల నిర్మాణాన్ని ప్రాధాన్యతగా చేపడుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. బుధవారం తాడ్వాయి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో ₹7 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్య గోదాము నిర్మాణానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పోతో కలసి మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలతో ఆరు నెలల్లో గోదాము నిర్మాణాన్ని పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. వ్యవసాయం, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో తాడ్వాయిలో మరో గోదాము నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు.

ప్రజాసంక్షేమంపై మంత్రి సీతక్క మాట్లాడుతూ.. సీసీ రోడ్లకు నిధులు గిరిజన ఆవాసాల్లో సిమెంట్ కాంక్రీట్ (సీసీ) రహదారుల నిర్మాణం కోసం ఇటీవల ₹50 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. సౌర విద్యుత్ వ్యవస్థలు, విద్యుత్ సౌకర్యం లేని మారుమూల గూడాల్లో ఇంటింటికీ వెలుగులు, తాగునీరు అందించేందుకు పది రోజుల్లో సోలార్ వ్యవస్థల టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. మహిళా సంఘాలకు ఆదాయం 5 నుండి 10 ఎకరాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసే మహిళా సంఘాలకు సహకారం అందించి, నెలకు ₹5 లక్షల వరకు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి హామీ నిధులు: ప్రతి గ్రామ పంచాయతీకి ₹50 లక్షల విలువైన ఉపాధి హామీ పనులు చేపట్టే అవకాశం కల్పిస్తున్నామని, రైతులకు ఉపయోగపడే పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ సోమయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భద్రాచలం ఆలయ పనులు పూర్తి చేయాలి

ప్రతి మూడు రోజులకు ఒక లిఫ్ట్ పనిని పూర్తి చేయాలి
రాతి పనులకు ప్రత్యేక ప్రాధాన్యం.. రోజువారీ లక్ష్యాలు నిర్దేశించాలి
నాణ్యత, శాస్త్రోక్తతలో రాజీకి తావులేదు: మంత్రి పొంగులేటి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి): శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా వేగం పెంచాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. శ్రీరామనవమి, గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బుధవారం భద్రాచలం చేరుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముందుగా శ్రీ సీతారామచంద్రస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రికి ఘన స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం మంత్రి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజులతో కలిసి ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉత్తర ద్వారం వద్ద దమ్మక్క విగ్రహం ప్రాంతం నుంచి పరిశీలన ప్రారంభించి వివిధ నిర్మాణ పనుల పురోగతి, ప్రస్తుత పరిస్థితి, పనులు పూర్తయ్యేందుకు అవసరమైన సమయం, మానవ వనరులు, నిర్మాణ సామగ్రి తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

భూపాలపల్లి: సెప్టెంబర్ 22(వుదయం విలేకరి) : పుష్కరాల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని ప్రతిపాదించిన నూతన తీర్థాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనకు అవసరమైన రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అధికారులను ఆదేశించారు.మంగళవారం సిరోంచ-కాటారం ప్రాంతంలో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు.సిరోంచ బ్రిడ్జి నుంచి ప్రధాన ఘాట్ వరకు సుమారు 2 కిలోమీటర్లు, సరస్వతీ ఘాట్ నుంచి పక్షి తీర్థం వరకు 0.8 కిలోమీటర్ల పరిధిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఐదు తీర్థాల ప్రతిపాదిత స్థలాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు.ఆయా ప్రాంతాల్లో భక్తులకు అవసరమైన మౌలిక వసతులు, రహదారి సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. అనంతరం ఆది ముక్తేశ్వర దేవాలయం నుంచి సరస్వతీ ఘాట్ వరకు భూసేకరణ పూర్తయిన శాశ్వత రహదారి నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.నిమజ్జన ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లు సిరోంచ బ్రిడ్జి సమీపంలో వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం కేటాయించిన ప్రాంతాన్ని కూడా అదనపు కలెక్టర్ పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన భద్రతా చర్యలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. రీసర్వే పనులపై పరిశీలన అనంతరం కన్నెపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పనులను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సర్వే సిబ్బందికి స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ పర్యటనలో తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, మండల సర్వేయర్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఇన్ఛార్జి కలెక్టర్ భాస్కర్ రావు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి) రాబోయే వినాయక నిమజ్జనోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో, సామరస్య పూర్వకంగా జరుపుకోవాలని జిల్లా ఇన్ఛార్జి కలెక్టర్ భాస్కర్ రావు సూచించారు. బుధవారం ఆయన యాదగిరిగుట్ట పురపాలక సంఘం పరిధిలోని రాయగిరి చెరువుతో పాటు ఆలేరు పురపాలక పరిధిలోని చెరువులను క్షేత్రస్థాయిలో సందర్శించి, నిమజ్జనం కోసం చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల అనంతరం జరిగే విగ్రహాల నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్శనలో భాగంగా నిమజ్జన ప్రాంతాలలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, రాత్రి వేళల్లో వెలుగుల కోసం ప్రత్యేక దీపాలు, భద్రతా ఏర్పాట్లు మరియు రక్షణ కంచెల (బారికేడ్ల) ఏర్పాటును ఆయన స్వయంగా తనిఖీ చేసి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఉత్సవాలు సజావుగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నల్లగొండ పట్టణంలో తిరువన్ నగర్ గణేష్ ని ఉత్సవా వేడుకలు

నల్లగొండ పట్టణంలో తిరువన్ నగర్ గణేష్ ని ఉత్సవా వేడుకలు
అన్నదాతలు గంజి ప్రసాద్ యూఎస్ఏ

నల్గొండ , సెప్టెంబర్ 23 (వుదయం) : నల్గొండ పట్టణ లో తిరుమల్ నగర్ లో గత 15 సంవత్సరాలుగా అదే ప్రాంతంలో గణేష్ ఉత్సవా వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇదే ప్రాంతంలో గణేష్ ని ఉత్సవాలు ఘనంగా నిర్వహించి ఉదయం సాయంత్రం భక్తిశ్రద్ధలతో ఆటపాటలతో ప్రతి ఒక్క కాలనీలో ఉన్న ప్రతి ఒక్కవారు ఇక్కడికి వచ్చి సంతోషంగా ఆనందంగా గడుపుతారని కమిటీ నిర్వాహకులు తెలిపారు అన్నదాన కార్యక్రమం కూడా చేపట్టి దాదాపు 500 మంది పైగా భక్తులు ఇక్కడికి వచ్చి గణేష్ ని ప్రసాదం స్వీకరించి ఆశీర్వాదాలు తీసుకున్నారని వారు తెలిపారు కార్యక్రమంలో పాల్గొన్న వదక్కించుకున్నారు కమిటీ అధ్యక్షులు జేలా కృష్ణమూర్తి,కార్యదర్శి ప్రేమనాథ్ కమిటీ సభ్యులు అంజయ్య వెంకటేశ్వర రావు శ్రీనివాస్ విగ్నేశ్వర రావు కాలనీ వాసులు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

ఎండీ రజాక్‌కు మంత్రి పొంగులేటి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి) ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్ జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముందస్తు హార్థిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విస్తృతంగా పర్యటించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. ఎండీ రజాక్ జన్మదిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కొత్తగూడెం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి ఎండీ రజాక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి, కోనేరు చిన్ని, కనుకుంట్ల శీను, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, వాసు, జల్లి కిరణ్, సత్తార్ పాషా, అజయ్, మహేష్, ఉపేందర్, వినోద్ భూన్, సంపత్, రాము, బోలె, రవికాంత్, ఎస్. ప్రభాకర్ తదితర నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

అనంతగిరి అయ్యప్ప సన్నిధిలో ఘనంగా ఉచిత అన్నప్రసాద వితరణ

అనంతగిరి సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి)

తెలంగాణ శబరిమలగా పేరొందిన అనంతగిరి శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం ఉచిత అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. రెండు వేల ఇరవై ఆరు సంక్రాంతి పండుగ పర్వదినం నుంచి ప్రతీ బుధవారం క్రమం తప్పకుండా కొనసాగుతున్న ఈ బృహత్తర అన్నదాన కార్యక్రమం, ఈ వారం నాటికి ముప్పై ఏడో వారానికి చేరుకుంది. ఈ వారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని కిష్టాపురం గ్రామ సర్పంచ్ కత్రం జ్ఞానేందర్ రెడ్డి మరియు ఉమ దంపతుల ఉదారమైన ఆర్థిక సహకారంతో నిర్వాహకులు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా అయ్యప్ప స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు మహా అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ విశేష కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు, అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు పందిరి వీరయ్య, మాజీ సర్పంచ్ ముత్తినేని కోటేశ్వరరావులతో పాటు ఆశీర్వాదం, రామినేని శ్రీనివాస్, ఖాశిం, బానోతు శివాజీ, బానోతు సైదులు, కనకయ్య, పొడిశెట్టి నరసింహారావు, ఆలయ ట్రస్ట్ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో స్వామివారి భక్తులు పాల్గొన్నారు. భక్తులంతా స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

అనుమతులు లేని కలప కొనుగోలు చట్టవిరుద్ధం

కమాండ్ కంట్రోల్ సెంటర్ సమాచారంతో అక్రమ టేకు కలపపై టాస్క్‌ఫోర్స్ కొరడా
అంకంపాలెం బీట్‌లో రూ.7.05 లక్షల విలువైన 5.235 క్యూబిక్ మీటర్ల టేకు కలప స్వాధీనం
అంకంపాలెం బీట్‌లో భారీగా అక్రమ టేకు కలప స్వాధీనం

దమ్మపేట, సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి): అనుమతులు లేకుండా విలువైన టేకు చెట్లను నరికివేయడం, చట్టబద్ధమైన పత్రాలు లేకుండా కలపను కొనుగోలు చేయడం, నిల్వ చేయడం మరియు రవాణా చేయడం లాంటి అక్రమాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని జిల్లా అటవీ టాస్క్‌ఫోర్స్ అధికారులు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. అటవీ సంపద పరిరక్షణలో భాగంగా జిల్లాలో కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చిన ఇరవై నాలుగు గంటల నిరంతర నిఘా కమాండ్ కంట్రోల్ సెంటర్ ఇచ్చిన విశ్వసనీయ సమాచారంతో దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అంకంపాలెం బీట్‌లో అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. కమాండ్ కంట్రోల్ కేంద్రానికి సమాచారం అందిన ఇరవై నాలుగు గంటల వ్యవధిలోనే టాస్క్‌ఫోర్స్ ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక అటవీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి అక్రమంగా నిల్వ ఉంచిన భారీ టేకు కలపను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఎటువంటి అనుమతి పత్రాలు లేని యాభై ఏడు టేకు రౌండ్ దుంగలతో పాటు నలభై నాలుగు సైజుల టేకు కలపను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇది మొత్తం ఐదు పాయింట్ రెండు మూడు ఐదు క్యూబిక్ మీటర్ల పరిమాణంలో ఉండి, దాని విలువ సుమారు ఏడు లక్షల ఐదు వేల రూపాయలు ఉంటుందని నిర్ధారించారు. కలపను నిల్వ ఉంచిన వ్యక్తిని విచారించగా, తాను ఒక రైతు వద్ద నుంచి దీనిని కొనుగోలు చేశానని తెలిపినప్పటికీ, చెట్లను నరికేందుకు తగిన అనుమతులు లేకపోవడంతో అది చట్టబద్ధం కాదని అధికారులు స్పష్టం చేశారు. అనుమతులు లేని కలపను కొనుగోలు చేసినా లేదా నిల్వ ఉంచినా అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని, కలప కొనుగోలుదారులు దాని మూలం, అనుమతి పత్రాలను కచ్చితంగా పరిశీలించాలని సూచించారు. చెట్లను అక్రమంగా నరికివేయడం వల్ల జీవవైవిధ్యం, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటాయని, అటవీ సంపదను కాపాడడం సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న కలపను అంకంపాలెం బీట్ అధికారి ఏ. పార్వతి కస్టడీకి అప్పగించి చట్టపరమైన చర్యలు వేగవంతం చేశారు. ఈ దాడుల్లో అటవీ టాస్క్‌ఫోర్స్ అధికారులు, విభాగధికారులు లోకనాథం, ప్రసాద లింగం, బీట్ అధికారులు రాములు, కాంతారావు, రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో అటవీ నేరాల నియంత్రణకు నిరంతర నిఘా కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు.

కరీంనగర్ |ఆదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

రిమ్స్ ఆస్పత్రిని సందర్శించిన బీఆర్ఎస్ బృందం

- **బాధితులను పరామర్శించి.. వైద్య సేవలపై ఆరా**

ఆదిలాబాద్, సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి): రిమ్స్ ఆస్పత్రిలోని పిల్లల వార్డులో జరిగిన అగ్నిప్రమాద ఘటన నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ, పార్టీ రాష్ట్ర మహిళా నాయకురాలు తుల ఉమ బుధవారం రిమ్స్‌ను సందర్శించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి బాధితులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న చిన్నారులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులను ఆరా తీశారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు.

తీసుకోవాలని కోరారు.బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ రిమ్స్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటన తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని తెలిపారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని అన్నారు. ఆస్పత్రుల్లో భద్రతా ప్రమాణాల విషయంలో నిర్లక్ష్యానికి తావివ్వకుండా, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గణనాథులకు ఘన వీడ్కోలు

- **కరీంనగర్ జిల్లాలో అంగరంగ వైభవంగా వినాయక నిమజ్జనం**
- **పకడ్బందీ ఏర్పాట్లతో ప్రశాంతంగా ముగిసిన ఉత్సవాలు**

కరీంనగర్, సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి): తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథులకు కరీంనగర్ జిల్లా ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా, ప్రశాంత వాతావరణంలో జరిగాయి. కరీంనగర్ నగరంతో పాటు హుజురాబాద్, జమ్మికుంట, చొప్పదండి తదితర పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో గణేష్ విగ్రహాలను శోభాయాత్రలుగా తరలించి నిమజ్జనం చేశారు. భక్తుల జైజై నినాదాలు, డప్పు చప్పుళ్లు, భక్తిగీతాలతో నిమజ్జన కేంద్రాలు సందడిగా మారాయి.

కరీంనగర్ పట్టణంలో నాలుగు వేల విగ్రహాలు

కరీంనగర్ పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన నాలుగు వేల వినాయక విగ్రహాలను బుధవారం నిమజ్జన కార్యక్రమానికి తరలించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై గణనాథులను ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథులకు ఘనంగా వీడ్కోలు పలికారు.

మానకొండూరులో భారీ ఏర్పాట్లు

కరీంనగర్ నగర పరిధి నుంచి అత్యధిక సంఖ్యలో వినాయక విగ్రహాలు మానకొండూరు చెరువు వైపు తరలివెళ్లాయి. గతంతో పోలిస్తే ఈసారి నిమజ్జన ఏర్పాట్లను భారీ స్థాయిలో చేపట్టారు. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అవసరమైన సంఖ్యలో క్రేన్లను ఏర్పాటు చేశారు. నిమజ్జన ప్రాంతంలో లైటింగ్, సౌండ్ సిస్టం, ఎల్ఈడీ స్క్రీన్లను అందుబాటులో ఉంచారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేశారు. విగ్రహాల రాకపోకలు, నిమజ్జన ప్రక్రియను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా ఎప్పటికప్పుడు పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

గజ ఈతగాళ్లు.. వైద్య బృందాలు సిద్ధం

మానకొండూరు, కొత్తపల్లి, చింతకుంట నిమజ్జన కేంద్రాల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే స్పందించేలా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బందిని నిమజ్జన కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేశారు.

కొత్తపల్లి, చింతకుంటలో ప్రత్యేక ఏర్పాట్లు

కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కొత్తపల్లి, చింతకుంట ప్రాంతాల్లో నిమజ్జన కేంద్రాలను సిద్ధం చేశారు. భక్తులు, ఉత్సవ కమిటీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. తాగునీరు, విద్యుత్, లైటింగ్, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లు చేశారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పర్యవేక్షించారు.

ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ

జిల్లా ఉన్నతాధికారులు నిమజ్జన కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కిందిస్థాయి సిబ్బందికి అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. నిమజ్జన కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తూ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు, వైద్య, పారిశుద్ధ్య, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సంయుక్తంగా నిమజ్జన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు భద్రతకు ప్రాధాన్యం ఇచ్చారు. అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాలు సజావుగా సాగాయి. ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో గణనాథులకు వీడ్కోలు పలికారు.

వినాయకుడి చెంత.. కలెక్టర్ అన్నదాన సేవ

రాజన్న సిరిసిల్ల సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి) : గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భోజన విరామ సమయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా అధికారులు, సిబ్బంది, కార్యాలయానికి వచ్చిన సందర్శకులకు భోజనం వడ్డించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. అధికారులతో కలిసి అన్నదానంలో పాల్గొనడం పలువురిని ఆకట్టుకుంది. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సీపీఓ శ్రీనివాసాచారి, డీడబ్ల్యూఓ లక్ష్మీరాజం, డీఏఓ అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన అధికారి శరత్‌బాబు, డీవైఎస్ఓ రాందాస్, కలెక్టరేట్ ఏవో, పర్యవేక్షకులు రాంరెడ్డి, శ్రీకాంత్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన
జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

- **వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు**
- **భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం**

పెద్దపల్లి, సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి) పెద్దపల్లి జిల్లా రామగుండం మండలంలోని గోదావరిఖని గోదావరి బ్రిడ్జి వద్ద వినాయక నిమర్జన ఏర్పాట్లను బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,(స్థానిక సంస్థల అదనపు కలెక్టర్) జె. అరుణ శ్రీ తో కలిసి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,, వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నిమజ్జన వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన భద్రతా , సౌకర్యాల ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన పాయింట్ల వద్ద మూడు షిఫ్టుల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించి, నిమజ్జనం పూర్తయ్యే వరకు పరిశుభ్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. నిమజ్జనం సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య చర్యలను నిరంతరం చేపట్టాలని సూచించారు.

నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన మేర బ్యారికేడ్లు, క్రేన్లు, విద్యుత్ సరఫరా, తాగునీరు, లైటింగ్ తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేకించి, నిమజ్జన పాయింట్ల వద్ద క్రేన్లకు అదనపు డ్రైవర్లను, క్రేన్ల మరమ్మతులు చేసేందుకు మెకానిక్‌లను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని తెలిపారు.ఈ పరిశీలన కార్యక్రమంలో ఏసీపీ రమేష్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ హౌసింగ్ బలహీన వర్గాల పట్టాలు పొజిషన్ సర్టిఫికెట్ల
వెరిఫికేషన్ వేగవంతం చేయాలి...

- **గోదావరి పుష్కరాలు 2027కు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలి...**
- **వినాయక నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి...**
- **జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**

జగిత్యాల సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి) జిల్లాలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు బుధవారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు తహసీల్దార్లు ఎంపీడీఓలు మున్సిపల్ కమిషనర్లు ఎంపీఓలు హౌసింగ్ ఏఈలు తదితర అధికారులతో వినాయక నిమజ్జన ఏర్పాట్లు బలహీన వర్గాల గృహ నిర్మాణ పథకానికి సంబంధించిన పట్టాలు/పొజిషన్ సర్టిఫికెట్ల పంపిణీ గోదావరి పుష్కరాలు 2027 సన్నద్ధతపై సమీక్షించారు వినాయక నిమజ్జన ప్రాంతాలు ఊరేగింపు మార్గాలను అధికారులు ముందుగానే పరిశీలించాలని కలెక్టర్ సూచించారు నిమజ్జన

ప్రాంతాల్లో బారికేడ్లు విద్యుత్ దీపాలు తాగునీరు పారిశుధ్యం క్రేన్లు గజ ఈతగాళ్లు వైద్య బృందాలు అగ్నిమాపక వాహనాలు తదితర ఏర్పాట్లు అందుబాటులో ఉంచాలన్నారు పోలీస్ రెవెన్యూ పంచాయతీరాజ్ మున్సిపల్ విద్యుత్ తదితర శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు జిల్లాలో బలహీన వర్గాల గృహ నిర్మాణ పథకం కింద అందుబాటులో ఉన్న 29,134 పట్టాలు/పొజిషన్ సర్టిఫికెట్లను సంబంధిత రికార్డులతో క్షుణ్ణంగా సరిచూడాలని కలెక్టర్ ఆదేశించారు ఇప్పటికే లబ్ధిదారులకు అందజేసినవి ప్రస్తుతం అందుబాటులో ఉన్నవి ఇంకా పంపిణీ చేయాల్సిన వాటి వివరాలను మండలాలు మున్సిపాలిటీల వారీగా నిర్ధారించాలన్నారు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నివేదికల్లో ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా తహసీల్దార్లు వ్యక్తిగతంగా పరిశీలించి ధ్రువీకరించాలని స్పష్టం చేశారు గోదావరి పుష్కరాలు 2027కు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు పుష్కర ఘాట్లు చేరుకునే రహదారులు పార్కింగ్ ప్రదేశాలు తాగునీరు పారిశుధ్యం విద్యుత్ వైద్య సేవలు భద్రత ట్రాఫిక్ నియంత్రణ భక్తుల వసతి తదితర అవసరాలను గుర్తించి సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి అంచనాలు సిద్ధం చేసి ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు

ఆహార భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

- **పాఠశాలలు, వసతి గృహాల్లో పరిశుభ్రత, సురక్షిత తాగునీటిపై క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలి**
- **జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

కామారెడ్డి, సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి):- కామారెడ్డి కలెక్టరేట్ ఛాంబర్ లో బుధవారం జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా మండలి (DLAC) సమావేశం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జి. విక్రమ్ నిర్వహణలో జరిగిన ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లాలో ఆహార భద్రత ప్రమాణాల అమలు, ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, ప్రజలకు సురక్షితమైన ఆహారం అందేలా చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు.జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, పాఠశాలలు, వసతి గృహాల్లో పరిశుభ్రమైన వాతావరణం, సురక్షిత తాగునీటి లభ్యతను నిర్ధారించేందుకు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, ఆహార నిల్వల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.జిల్లాలోని అన్ని ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే FSSAI లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆహార భద్రత నిబంధనలు పాటించని ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆహార భద్రతకు సంబంధించిన తనిఖీలను మరింత విస్తృతంగా చేపట్టి, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి ప్రసన్న, డిపిఓ మురళి, తదితర అధికారులు పాల్గొన్నారు.

బై.. బై..గణేషా

- **ఆర్కేపీలో ఘనంగా గణనాథుని శోభాయాత్ర**
- **భక్తిశ్రద్ధలతో నాయకుల గోదావరి నదికి తరలింపు**
- **మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరు**

మంచిర్యాల /రామకృష్ణాపూర్/ సెప్టెంబర్ 23(వుదయం ప్రతినిధి) రామకృష్ణాపూర్ పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. పట్టణంలోని 78 వినాయక మండపాల నుంచి గణనాథులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై శోభాయాత్రగా తరలించి గోదావరి నదిలో నిమజ్జనం కోసం సాగనంపారు. రాజీవ్ చౌక్ వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి నిమజ్జనానికి పంపించారు. శోభాయాత్రలో రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కోలాటాలు, యువత నృత్యాలతో శోభాయాత్రలో

సందడి చేశారు.నిమజ్జన కార్యక్రమానికి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై జాడి శ్రీధర్ డ్రోన్ కెమెరాతో పర్యవేక్షణ చేపట్టి, పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసుల పర్యవేక్షణలో శోభాయాత్ర ప్రశాంతంగా కొనసాగింది. "గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా" అంటూ భక్తులు నినాదాలు చేస్తూ గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.

నిర్మల్ జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్‌గా
రాథోడ్ రమేష్ బాధ్యతల స్వీకరణ

నిర్మల్ జిల్లా 23 సెప్టెంబర్ 2026 (వుదయం ప్రతినిధి) నిర్మల్ జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా డీఆర్వో రాథోడ్ రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం పలువురు జిల్లా అధికారులు,

రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు రాథోడ్ రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా పరిపాలనలోని వివిధ అంశాలు,



రెవెన్యూ శాఖకు సంబంధించిన కార్యక్రమాలపై అధికారులు ఆయనకు వివరాలు అందజేశారు.కార్యక్రమంలో డీపీఆర్వో విష్ణువర్ధన్, సివిల్ సప్లై డీఎస్ఓ రాజేందర్, డీఎం సుధాకర్, ఏఓ ప్రవీణ్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వచ్చే ప్రజలకు
మెరుగైన వైద్య సేవలు అందించాలి

- **జిల్లా కలెక్టర్ కె.హరిత.**

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి) ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని తిర్యాణి మండలం గిన్నెదరి గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి హాజరు పట్టిక, ఆపరేషన్ థియేటర్, మందుల నిల్వ గది పరిసరాలను పరిశీలించి, ప్రతిరోజు ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందుతున్న ప్రజల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జ్వరాలు, ఇతర అంటువ్యాధుల బారిన పడి ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలలో ప్రతిరోజు ఆరోగ్య కార్యకర్తలు సందర్శించి ప్రజలకు వైద్య సేవలు అందించాలని, నెలలు నిండిన గర్భిణులకు సుఖ ప్రసవం కొరకు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. వైద్య సేవల నిమిత్తం ఆసుపత్రికి వచ్చే ప్రజల పట్ల వైద్యులు, సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం మండలంలోని విజయనగర్ గ్రామంలో గల జంగుబాయి మండల సమాఖ్య కార్యాలయాన్ని సందర్శించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తయారు చేస్తున్న ఏకరూప దుస్తుల నాణ్యతను పరిశీలించారు. ఏకరూప దుస్తులు కుట్టడంలో నాణ్యత పాటించాలని, విద్యార్థులకు మరొక జత దుస్తులను త్వరగా సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఎ.పి.ఎం. శ్రీనివాస్, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి) కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జిల్లా ఉపాధి కల్పనా శాఖ మరియు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ప్లేస్ మెంట్ సెల్ తరఫున జాబ్ మేళా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువత కొరకు వివిధ కంపెనీల సహకారంతో జాబ్ మేళాలు నిర్వహిస్తు అర్హులైన యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.జిల్లా ఉపాధికల్పన అధికారి బి.కిరణ్ కుమార్ మాట్లాడుతూభవిష్యత్తులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్లేస్ మెంట్ సెల్ సహకారంతో మరిన్ని ఉద్యోగ మేళా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన ప్రతీ విద్యార్థి ఏదో ఒక రంగంలో స్థిరపడాలనే సంకల్పంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అనంతరం ఉద్యోగాల కొరకు 70 మంది అభ్యర్థులు హాజరు కాగా కే.కే సోలార్ ఎంటర్ ప్రైసెస్ యాజమాన్యం వారు వివిధ రకాల ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు.ఇందులో 21 మందిని ఎంపిక చేసి నియామక ఉత్తర్వులు అందజేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.డి.లక్ష్మినరసింహం ప్లేస్ మెంట్ సెల్ ఇన్ చార్జి డా.ఇ.శారద, అకడమిక్ కో ఆర్డినేటర్ డి.జనార్ధన్ అధ్యాపకులు ఎం.రాజేశ్వర్ పాల్గొన్నారు.

నలువైపులా నరక దారులు

- **నగరానికి రాకపోకలు సాగించేందుకు ప్రయాణికుల అవస్థలు**

నిజామాబాద్ సెప్టెంబర్ 23(వుదయం ప్రతినిధి) నగరానికి వ్యవసాయంతోపాటు వివిధ రంగాల్లో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. వివిధ పనుల నిమిత్తం నిత్యం 20 వేల మందికి పైగా జనం నగరానికి నాలుగు వైపుల నుంచి రాకపోకలు సాగిస్తారు. వీరికి నగర శివారు ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న రోడ్లు స్వాగతం పలుకుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రయాణికుల అవస్థలపై 'నిజామా బాద్ డిచ్‌పల్లి రోడ్డులో నిత్యం 45 వేల మంది కార్లు, బస్సులు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. జిల్లాలోని మారుమూల మండలం సిరికొండతోపాటు కామారెడ్డి, హైదరాబాద్ నుంచి వచ్చి వెళ్లేవారికి ఇదే ప్రధాన మార్గం. నగర శివారు మాధవనగర్ రైల్వేగేటు వద్ద నాలుగేళ్లుగా ఆర్వోబీ నిర్మాణం కొనసాగుతోంది. ఇక్కడ సర్వీసు రోడ్లపై భారీ గుంతలతో ప్రయాణికులు నిత్యం నరకం చూస్తున్నారు. కొంతమంది బైపాస్ రోడ్డు మీదుగా నగరంలోకి వెళ్తుండగా.. అక్కడక్కడ ఏర్పడిన గుంతలతో ఇబ్బందులు తప్పడం లేదు. దీనికితోడు బైపాస్‌లో డివైడర్, సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో రాత్రి సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.మల్లారం గండిలో బోల్తా పడిన కారు

బాన్సువాడ నిజామాబాద్ రోడ్డులో నిత్యం దాదాపు 3500 మంది ప్రయాణిస్తుంటారు. నగరం దాటిన తర్వాత 5 కిలోమీటర్ల మేర మల్లారం అటవీ ప్రాంతంలో ఇరుకు రోడ్డు, మూలమలుపులు, గుంతలతో ప్రమాదాలకు నిలయంగా మారింది. అటవీ అనుమతులు లభించక రోడ్డు వెడల్పు సాధ్యం కావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకొని ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు.ఆర్మూర్ నిజామాబాద్ మార్గంలో రోజూ 34 వేల మంది ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డు బాగునప్పటికీ.. నగరం సమీపంలోని చిన్నాపూర్‌మామిడిపల్లి అటవీ ప్రాంతంలో పలుచోట్ల మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. హెచ్చరిక బోర్డులు, పలుచోట్ల డివైడర్లు లేకపోవడంతో అతివేగంగా దూసుకొచ్చే వాహనాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు ఉదయం, సాయంత్రం సమయాల్లో సిటీ లోపలికి వస్తున్న కొద్దీ మానిక్‌బండార్ వరకు ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది.

కమలాపూర్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంకు క్యాషియర్ వీడ్కోలు

- **నూతన అధికారికి స్వాగతం**

ధర్మపురి సెప్టెంబర్23 (వుదయం ప్రతినిధి): మండలంలోని కమలాపూర్ గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖలో గత రెండు సంవత్సరాలుగా క్యాషియర్‌గా విధులు నిర్వర్తించి, బదిలీపై వెళ్తున్న సామల వసుధను గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో బ్యాంకు సేవలను ఆమె ప్రజలకు చేరువ చేసిన వైనాన్ని వక్తలు కొనియా డారు.ఈ కార్యక్రమంలో కమలా పూర్ మాజీ సర్పంచ్ చెన్నోజి జ్యోతిప్రసాద్,గ్రామస్తులు వసు ధ కి శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు.ఇదే బ్యాంకు శాఖకు నూతన క్యాషియర్‌గా విధుల్లోకి చేరిన గడ్డం శ్రీలేఖను తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ అంకిత కిరణ్‌కుమార్,వేణుగోపాల్ తదితరులు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, స్థానిక కస్టమర్లు పాల్గొన్నారు.

వెళ్లి రావయ్యా..బొజ్జ గణపయ్యా

దండేపల్లి సెప్టెంబర్ 23 (వుదయం విలేకరి) గూడెం గోదావరి వద్ద భారీ వర్షంలో వినాయక నిమజ్జనం కొనసాగింది ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో యువతీ యువకులు,చిన్నారులు, మహిళల నృత్యాలతో నిమజ్జనానికి బుధవారం ఆనందోత్సాహాల మధ్య బయలుదేరే సమయంలో ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది దీంతో శోభాయాత్రకు అంతరాయం ఏర్పడింది. గూడెం గోదావరి వద్ద నీటి మట్టం ఎక్కువగా ఉండడంతో వినాయకులను క్రైన్ల సాయంతో గోదావరిలో నిమజ్జనం చేశారు ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా లక్షెట్టిపేట సిఐ రమణమూర్తి,దండేపల్లి ఎస్ఐ రాజవర్ధన్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు,

గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు వినాయక నిమర్జనం ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు దండేపల్లి ఎంపిడిఓ జె ఆర్ ప్రసాద్, దండేపల్లి తహసీల్దార్ రోహిత్ దేశ్పాండే తెలిపారు.

మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

ఎస్ఐఆర్‌లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి

జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

నారాయణపేట సెప్టెంబర్ 23(వుదయం ప్రతినిధి)

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఓటు హక్కు ఉండేలా బూత్ లెవల్ అధికారులు సమగ్రంగా సర్వే నిర్వహించి, అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు.బుధవారం నారాయణపేట పట్టణంలోని 142, 143 పోలింగ్ స్టేషన్ల పరిధిలో కొనసాగుతున్న బీఎల్‌వోల సర్వేను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో నోటీసులు అందుకున్న ఓటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్లి వివరాలను ధృవీకరించాలని, వారి నుంచి అవసరమైన ధృవీకరణ పత్రాలను సేకరించి, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని బీఎల్‌వోలకు ఆమె సూచించారు.ఓటర్ల వివరాల పరిశీలనలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో ధృవీకరణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో 14 వ వార్డు కౌన్సిలర్ ఎల్.అరుణ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ

అనంతరం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసి అధ్యాపకులు, విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో విద్యాబోధన, విద్యార్థుల హాజరు తదితర అంశాలపై విద్యార్థులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తోందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ సూచించారు.

మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష

ఆ తర్వాత జిల్లా కలెక్టర్ నారాయణపేట మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పట్టణంలో కొనసాగుతున్న పరిశుభ్రత చర్యలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ సేవలను సమర్థవంతంగా అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువే

మాజీ మంత్రి హరీష్ రావు

నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 23 (వుదయం బ్యూరో):

ఎల్ నినో పేరు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నీళ్లు ఇవ్వకుండా తప్పించుకుంటోందని, ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ పాలన తెచ్చిన కరువేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ధ్వజమెత్తారు. బుధవారం నాడు జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీలో ఎక్కడా క్రాప్ హాలిడే లేదని, తెలంగాణలో మాత్రమే క్రాప్ హాలిడే ఉందని, దీనికి కారణం నీళ్లు లేక కాదు, ప్రభుత్వానికి చేతకాకేనని విమర్శించారు.

కల్వకుర్తి లిఫ్ట్ లో 5 మోటార్లు ఉంటే 1-2 మాత్రమే నడుపుతున్నారని, బీఆర్ఎస్ ఒత్తిడి చేస్తే 3 మోటార్లను రోజుకు 8 గంటలు మాత్రమే నడుపుతున్నారని ఆరోపించారు. 4000 క్యూసెక్కుల సామర్థ్యం ఉంటే కేవలం 800 క్యూసెక్కులు మాత్రమే ఎత్తుతున్నారన్నారు. శ్రీశైలంలో 96 టీఎంసీల నీళ్లు ఉన్నాయని, చంద్రబాబు 800 కి.మీ దూరంలో ఉన్న కుప్పంకు నీళ్లు తరలిస్తుంటే, రేవంత్ రెడ్డి పక్కనే ఉన్న పాలమూరు పొలాలకు నీళ్లు ఇవ్వడం లేదని మండిపడ్డారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకుంటూ పాలమూరు రైతులకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. కల్వకుర్తిని పండబెట్టింది టీడీపీ, కాంగ్రెస్ పార్టీలేనని, 30 ఏళ్లుగా కాని పనిని బీఆర్ఎస్ 5 ఏళ్లలో చేసిందన్నారు. బీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, కల్వకుర్తి, తుమ్మిళ్ల ప్రాజెక్టులతో 6.5 లక్షల ఎకరాలకు 4 వేల కోట్లతో నీళ్లిచ్చామన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో 30 వేల కోట్లు ఖర్చు చేసి నార్లాపూర్, ఏదుల, కరివెన, వట్టెం రిజర్వాయర్లను 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించి 2023 డిసెంబర్ 7న కాంగ్రెస్ కు అప్పగించామన్నారు. 2023 సెప్టెంబర్ 16న కేసీఆర్ బాహుబలి మోటార్ ఆన్ చేసి నార్లాపూర్ కు నీళ్లు తెచ్చారని గుర్తు చేశారు. ప్యాకేజీ-3 కెనాల్ లో 1.83 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి పనిలో కోటి పనులు బీఆర్ఎస్ చేయగా, మిగిలిన 33 లక్షల పనులు కాంగ్రెస్ చేయలేకపోవడం వల్ల 50 టీఎంసీల నిల్వకు అవకాశం లేకుండా పోయిందన్నారు. ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అబద్ధాలు మాట్లాడుతున్నారని, అసెంబ్లీలో 88 టీఎంసీలు ఎత్తామని చెప్పగా నిజానికి ఎత్తింది 8.8 టీఎంసీలు మాత్రమేనని ఆరోపించారు. కృష్ణాలో 34 శాతం వాటా ఉంటే 28 శాతం, 25 శాతం మాత్రమే వాడారని, గోదావరి దేవాదులలో కూడా అర టీఎంసీ సామర్థ్యం ఉంటే పావు టీఎంసీ కూడా ఎత్తడం లేదని విమర్శించారు. వెంటనే కల్వకుర్తి, దేవాదుల మోటార్లను 24 గంటలు నడపాలని, ప్యాకేజీ-3 పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమం

- విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి
- 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 43,419 మంది విద్యార్థులకు సమగ్ర వైద్య పరీక్షలు
- ప్రతి విద్యార్థికి ప్రత్యేక ఆరోగ్య ప్రొఫైల్ కార్డు

గద్వాల సెప్టెంబర్ 23 (వుదయం కరస్పాండెంట్)

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణతో పాటు వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించే లక్ష్యంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సమగ్ర వైద్య పరీక్షలు, ఆరోగ్య ప్రొఫైల్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాల మేరకు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. సంధ్యా కిరణ్మయి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం ఈ నెల 24వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కానుంది. ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న మొత్తం 43,419 మంది విద్యార్థులకు దశలవారీగా సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. వైద్య పరీక్షల్లో భాగంగా విద్యార్థుల ఎత్తు, బరువు, శరీర ద్రవ్యరాశి సూచీ, రక్తపోటు, నాడి స్పందన, హిమోగ్లోబిన్ శాతం, రక్త వర్గం, కంటి చూపు, చెవి–ముక్కు–గొంతు, గుండె, చర్మం, నాడీ వ్యవస్థ, ఊపిరితిత్తుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలిస్తారు. దీర్ఘకాలిక వ్యాధులు, పోషకాహార లోపాలు తదితర ఆరోగ్య సమస్యలను గుర్తించి అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలు, పరీక్షలు, చికిత్స, వైద్య నిపుణుల సూచనలు అందించేందుకు చర్యలు తీసుకుంటారు. బాలికల ఆరోగ్యానికి సంబంధించి రుతుస్రావం, సంబంధిత ఆరోగ్య అంశాలను కూడా నమోదు చేసి, అవసరమైన ఆరోగ్య అవగాహనతో పాటు వైద్య సలహాలు అందించనున్నారు. వైద్య పరీక్షల ద్వారా సేకరించిన వివరాల ఆధారంగా ప్రతి విద్యార్థికి ప్రత్యేకంగా ఆరోగ్య ప్రొఫైల్ కార్డు రూపొందించనున్నారు. విద్యార్థి ఆరోగ్య చరిత్ర, గుర్తించిన ఆరోగ్య సమస్యలు, అందించిన వైద్య సేవల తదితర వివరాలను ఇందులో నమోదు చేస్తారు. భవిష్యత్తులో ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తినప్పుడు గత ఆరోగ్య వివరాలను పరిశీలించి తగిన వైద్య సేవలు అందించేందుకు ఈ ఆరోగ్య ప్రొఫైల్ ఉపయోగపడుతుంది.

పాఠశాలల వారీగా వైద్య బృందాలు ఆర్బీఎస్కే వైద్య బృందాల సహకారంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖకు చెందిన వైద్య సిబ్బంది పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకోసం మండలాల వారీగా ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేసి ప్రతి విద్యార్థి ఆరోగ్య వివరాలను నమోదు చేయనున్నారు. విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన వారికి తదుపరి పరీక్షలు, చికిత్స, వైద్య సూచనలు, వైద్య కేంద్రాలకు పంపించే సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమం విజయవంతం కావడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలల సిబ్బంది వైద్య బృందాలకు సహకరించాలని కోరారు.

మాజీ ఎమ్మెల్సీ ఇంట్లో పేకాట కలకలం

- ఐదుగురు అరెస్ట్.. ఇద్దరు పరార్
- రఘోత్తంరెడ్డి నివాసంలో పేకాటపై టూటౌన్ పోలీసుల దాడి
- పోలీసుల అదుపులో ఉపాధ్యాయుడితో సహా ఐదుగురు

వుదయం , సిద్దిపేట ప్రతినిధి

ఉపాధ్యాయ సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన మాజీ ప్రజాప్రతినిధి నివాసమే పేకాట శిబిరానికి వేదికగా మారింది. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో తీవ్ర కలకలం రేపుతోంది.సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మాజీ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డికి ఇంట్లో పేకాటఆడుతున్నారని సమాచారంతో టూటౌన్ సీఐ మురళి ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకోగా మిగతా ఇద్దరు పోలీసుల రాకను గమనించిన ప్రాణాల మీదకు తెచ్చుకుని కిటికీ అద్దాలు పగలగొట్టుకుని చీకట్లోకి పరారయ్యారు. ఈ ఘటనపై మాజీ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డితో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకటరాజం, రంగధాంపల్లికి చెందిన గంగసాని భాస్కర్ రెడ్డి , రమేష్, కనకయ్య తదితరులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు స్పష్టం చేశారు. పరారీలో ఉన్న వారి కోసం గాలింపు చేపట్టారు. సామాన్యులు పేకాట ఆడితే వెంటనే అరెస్టు చేసి ప్రచారం చేసే పోలీసులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు ఉన్న ఈ కేసులో పూర్తి వివరాలు వెల్లడించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వెల్ డన్ యాదగిరి ..!

- జర్నలిస్టుల రక్తదాన శిబిరం గ్రేట్
- అభినందించిన జిల్లా కలెక్టర్
- శాలువాతో సత్కారం, ప్రశంసా పత్రం అందజేత

సంగారెడ్డి సెప్టెంబర్ 23(వుదయం ప్రతినిధి)

వెల్ డన్ యాదగిరి.. గుడ్ జాబ్ అని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అభినందించారు. నేనే మీకు శాలువా కప్పాలి అంటూ శాలువాతో సత్కరించారు. రక్తదాన శిబిరానికి సంబంధించిన ప్రశంసా పత్రాన్ని యాదగిరి కి అందజేశారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (TUWJ- IJU) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి జన్మదిన పురస్కరించుకొని మంగళవారం పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొనాల్సి ఉన్నది. అత్యవసర పనుల వల్ల ఆయన పాల్గొనలేకపోయారు. దీంతో బుధవారం నాడు జర్నలిస్ట్ యూనియన్ నాయకుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో జర్నలిస్టులు కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ను కలిశారు. నోట పుస్తకాలను అందించారు. రక్తదాన శిబిరం ద్వారా సమాజానికి సేవా నిరతి ని చాటి చెప్పడం గ్రేట్ అని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజానికి మంచి మెసేజ్ వెళుతుందని అన్నారు. పుట్టినరోజునాడు కేక్ కటింగ్ తో వేడుకలు జరపకుండా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నిత్యం సమాజంలోని వార్తలను వెలికి తీస్తున్న జర్నలిస్టుల ద్వారా ఇలాంటి కార్యక్రమాలు జరగడం మరింత శుభ సూచకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తమ వంతుగా సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా TUWJ IJU సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ తమ యూనియన్ మొదటి నుంచి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించిందని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఎ కే పైసల్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల హక్కులను సాధించడానికి అనేక పోరాటాలు చేశామని వివరించారు. మున్ముందు కూడా తమవంతుగా సామాజిక సేవలో పాల్గొంటామని ఈ సందర్భంగా యాదగిరి పేర్కొన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఓ) విజయలక్ష్మి కూడా ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు యాదగిరిని అభినందించారు. జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు ప్రభాకర్, చిన్నా మధ్య తరగతి పత్రికల సంఘం ఉపాధ్యక్షుడు నజీర్, కోశాధికారి లక్ష్మణ్, రథసారథి సీఈవో సంతోష్ గౌడ్, ఆంధ్రజ్యోతి శ్రీకాంత్, టీయూడబ్ల్యూజేఐజేయు జిల్లా కార్యవర్గ సభ్యులు ఇర్ఫాన్, విజయ రాజు, మహేష్ ,శ్రీకాంత్, సాక్ష్యం శ్రీనివాస్, నవీన్,యాదగిరి పాల్గొన్నారు.

సాంకేతిక మేళవింపుతో రైతులు వ్యవసాయం చేయాలి

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి)

రోజు రోజుకు మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా కొంగొత్త ఆలోచనలు, సాంకేతిక మేళవింపుతో రైతులు వ్యవసాయం చేయాలని అప్పుడే రైతులు లాభాలు ఆర్జిస్తారని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో బుధవారం వనపర్తి జిల్లాలోని పద్మావతి శ్రీనివాస గార్డెన్ లో నిర్వహించిన కిసాన్ మేళ -2026 కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కిసాన్ మేళలో ఆయా కంపెనీలు తాము రూపొందించిన మేలురకం విత్తనాలు, సోలార్ ఫెన్సింగ్, రసాయన మందులు, కోళ్లు, పొట్టేళ్ళు, గిరి జాతి ఆవులు, సమీకృత ఉద్యాన, పట్టు పరిశ్రమ, పామాయిల్, కిసాన్ క్రెడిట్ కార్డు, ఆధునిక వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు ఈ కిసాన్ మేళాలో ప్రదర్శనకు ఉంచి రైతులకు వారి ఉత్పత్తులపై అవగాహన కల్పించగా జిల్లా కలెక్టర్ సైతం అన్ని స్టాళ్లను సందర్శించి ఉత్పత్తుల నాణ్యతను పరిశీలించారు. అనంతం ఏర్పాటు చేసిన కిసాన్ మేళా కార్యక్రమంలో కలెక్టర్ ప్రసంగిస్తూ వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు ఒక ప్రణాళిక ప్రకారం కిసాన్ మేళాను ఏర్పాటు చేసి వేల సంఖ్యలో రైతులను మేళాను సందర్శించే విధంగా చేసినందుకు అధికారులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. కిసాన్ మేళా అనేది ఒక చక్కని కార్యక్రమం అని మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా దేశంలోని పరిశ్రమలు ఈ ప్రాంత వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉండే విధంగా కనుగొన్న కొత్త కొత్త వంగడాలు, రసాయన ఎరువులు, యాంత్రిక పరికరాలు ఒకే చోట స్టాల్స్ లో పెట్టి రైతులకు వ్యవసాయ పద్ధతులు, పండించే పంటల పై అవగాహన కల్పిస్తారని, వీటి ద్వారా రైతులు కొత్త ఆలోచనలతో లాభసాటి వ్యవసాయం చేసేందుకు దోహదపడతాయని తెలియజేశారు. ప్రతి మంగళవారం రైతు వేదికల ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటలు సాగు చేసే విధానము వాటికి వచ్చే చీడపురుగుల నివారణ లాభసాటి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తారని అందువల్ల రైతులు ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రస్తుత సంవత్సరము ఎల్ నీనో ప్రభావం వల్ల వర్షపాతం చాలా తక్కువగా నమోదు అయిందని గత సంవత్సరము ఈ సమయానికి 100 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైతే ఈ సంవత్సరము కేవలం 42 సెంటీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదయిందన్నారు. వరి పంట సాగుకు సరిపడా నీళ్లు లేకపోయే పరిస్థితి ఉన్నందున రైతులకు వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని అనేక రకాలుగా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. పర్యావసానంగా గత సంవత్సరము వానకాలంలో 2.25 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తే ఈ వానకాలంలో 1.70 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు చేయడం జరిగింది అన్నారు. రైతులు వాతావరణానికి అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సంవత్సరం జిల్లాలో మినుము పంట సాగు 30000 ఎకరాలకు ఎగబాకినందుకు అభినందించారు. పామాయిల్ పంట వల్ల చాలా లాభాలు ఉంటాయని కేవలము మూడు సంవత్సరాలు అంతర్ పంటలు వేసుకుంటూ పామాయిల్ సాగును కాపాడుకుంటే 30 సంవత్సరాల వరకు లాభాలు ఆర్జించవచ్చని తెలియజేశారు. వచ్చే సంవత్సరం వనపర్తి జిల్లాలో యూనిక్ పామ్ ఆయిల్ కంపెనీ ప్రారంభమవుతుందని అప్పుడు జిల్లాలోని పామాయిల్ క్రషింగ్ చేసి ఆయిల్ తీయడం జరుగుతుందన్నారు. తద్వారా రైతులకు మరింత లాభసాటిగా ఉంటుందని తెలియజేశారు. ఇప్పుడు వరి పండిస్తున్న రైతులు ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి తీస్తూ ఉండవచ్చు కానీ రాబోయే తరానికి ఆ భూమిలో 10 క్వింటాలు సైతం దిగుబడి సాధించలేరని అంతగా భూమి తన సారాన్ని పూర్తిగా కోల్పోతుందని తెలియజేశారు. రాబోయే తరానికి సారవంతమైన భూమిని అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని రైతులను కోరారు.

ఈ సమావేశంలో మాట్లాడినజిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు మాట్లాడుతూ రైతులకు కొత్త పద్ధతులు కొత్త వంగడాలు యాంత్రిక పరికరాలను పరిచయం చేయడమే కిసాన్ మేళ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రస్తుతము ఎల్ నీనో ప్రభావం వల్ల సాగు నీటి లభ్యత లేనందున యాసంగిలో రైతులు వరి కి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వాయిస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కె వి కె వ్యవసాయ శాఖ రాజేందర్ రెడ్డి, సాయి చరణ్ రెడ్డి, మాజీ సర్పంచ్ సురేష్ చంద్రారెడ్డి ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ పద్ధతుల పై మాట్లాడి రైతులకు అవగాహన కల్పించారు.

ఉత్సవాలతో గ్రామాల్లో ఐక్యత చాటాలి జిల్లా ఎస్పీ వినీత్

నారాయణపేట సెప్టెంబర్ 23(వుదయం ప్రతినిధి)

నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో బుధవారం జరిగిన గణేష్ నిమజ్జన వేడుకలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ గణపతి దేవునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం గ్రామ ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, యువతతో కలిసి నిమజ్జన శోభా యాత్రను తిలకించారు.ఈ సంద ర్భంగా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ ఉత్సవాలతో గ్రామాలలో ఐక్యత చాటాలని, కోటకొండ గ్రామం ఐక్యతకు, సామరస్యానికి చిరునామాగా నిలుస్తుం దని అన్నారు. గ్రామంలో మొత్తం 58 గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి, అందరూ కలిసి భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీ యమన్నారు.గణేష్ శోభా యాత్ర, నిమజ్జనం సంద ర్భంగా పోలీస్ శాఖ సూచ నలను పాటిస్తూ గ్రామ ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీలు, యువత డీజేలను వినియోగించ కుండా పోలీస్ శాఖకు సహకరించడం పట్ల ఎస్పీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ చేసిన విజ్ఞప్తిని గౌరవించి సహక రించిన ప్రతి ఒక్కరికీ కృత జ్ఞతలు తెలిపారు.

పండుగల సందర్భంగా భక్తి, ఆనందంతో పాటు ప్రజల భద్రతకు, శాంతియుత వాతావరణానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచిం చారు. శోభాయాత్ర సమ యంలో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులకు సహకరించాలని, యువత బాధ్యతాయుతంగా వ్యవ హరించాలని కోరారు.గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా పూర్తయ్యేలా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవసరమైన బందోబస్తు, భద్రతా ఏర్పా ట్లు చేపట్టినట్లు ఎస్పీ తెలి పారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ శాంతియుత వాతావరణంలో నిమజ్జన వేడుకలను నిర్వహించు కోవాలని సూచించారు.

గణపతి దేవుని ఆశీస్సులు ఎల్లవేళలా కోటకొండ గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురా రోగ్యాలతో, సుఖసంతో షాలతో ఉండాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. గణేష్ నిమజ్జన వేడుకలు సోదర భావం, ఐక్యత, సామర స్యానికి ప్రతీకగా నిలవా లని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ సతీష్ రెడ్డి, నారాయణపేట శక్తిపీఠం వ్యవస్థాపకులు డాక్టర్ శాంతా నంద పురోహిత్, బీజేపీ నాయకులు పగుడకుల శ్రీనివాసులు, విశ్వహిందూ పరిషత్ ప్రచార ప్రముక్ పగడాకుల భాగస్వామి,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్–2026 ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష

మహబూబ్‌నగర్, 23.09.2026

75–జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(SIR)–2026 ప్రక్రియను నిర్ణీత గడువులోగా పారదర్శకంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ అధికారులను ఆదేశించారు. బుధవారం జడ్చర్ల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ERO),రెవెన్యూ అదనపు కలెక్టర్ జె ఎల్ బి హరిప్రియ జడ్చర్ల తహశీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్–2026 ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసుల పంపిణీ, విచారణల పురోగతిని సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు 93.59 శాతం నోటీసుల పంపిణీ, 45.33 శాతం విచారణలు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన విచారణలను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా ఏఈఆర్ఓ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న ఫారం–6 (కొత్త ఓటరు నమోదు), ఫారం–7 (ఓటరు తొలగింపు), ఫారం–8 (ఓటరు వివరాల సవరణ) దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్–2026 ప్రక్రియకు సంబంధించి ఏవైనా సమస్యలు లేదా అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించి, విచారణలకు వారు హాజరయ్యేలా సహకరించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా పూర్తయ్యేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

ఈ సమావేశంలో జడ్చర్ల తహసీల్దార్/ఏఈఆర్ఓ నర్సింగరావు, అదనపు తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ తహసీల్దార్ (ఎం), ఎన్నికల డీటీ తదితర అధికారులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనం సందర్భంగా మద్యం దుకాణాల మూసివేత

- ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, సెప్టెంబర్ 23:-వుదయం జిల్లా ప్రతినిధి

గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని సంగారెడ్డి రెవెన్యూ జిల్లా పరిధిలోని మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలు తదితరాలను తాత్కాలికంగా మూసివేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ప్రతీక్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ఎక్సైజ్ చట్టం, 1968లోని సెక్షన్ 20 మరియు సంబంధిత నిబంధనల ప్రకారం ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (CURE) పరిధిలోని ప్రాంతాలను మినహాయించి, సంగారెడ్డి రెవెన్యూ జిల్లా పరిధిలోని అన్ని A4 మద్యం దుకాణాలు, 2-B బార్లు, కల్లు దుకాణాలు/కల్లు డిపోలు, CS-2 క్యాంటీన్లు మూసివేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ మూసివేత 2026 సెప్టెంబర్ 25వ తేదీ ఉదయం 6:00 గంటల నుంచి సెప్టెంబర్ 26వ తేదీ ఉదయం 6:00 గంటల వరకు అమల్లో ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనడంతో పాటు భారీ ఊరేగింపులు జరిగే అవకాశం ఉన్నందున, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుత వాతావరణాన్ని కొనసాగించడం, ప్రజల భద్రతను కాపాడడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఉత్తర్వులను ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాల నిర్వాహకులు ఈ ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు.

జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

నారాయణపేట టౌన్ సెప్టెంబర్ 23(వుదయం ప్రతినిధి)

జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2027_28 సంవత్సరానికి 9వ, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నిర్వహించనున్న లాటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్ కు అర్హు లైన విద్యార్థులు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. జవ హర్ నవోదయ విద్యాలయ సమితి, హైదరాబాద్ ప్రాంతం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఆన్‌లైన్ దర ఖాస్తుల స్వీకరణ ప్రక్రియ 2026 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమైందన్నారు. సెప్టెంబర్ 30, 2026 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. 9,11వ తరగతి లో అర్హులైన విద్యార్థులు పై ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లాటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్ 2027 ఏప్రిల్ 10వ తేదీన నిర్వ హించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, గుర్తిం పు పొందిన ఉన్నత పాఠశాలలప్రధానోపాధ్యాయులు, జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాధికారులు అర్హులైన విద్యార్థులకు ఈ అవకా శంపై విస్తృతంగా అవగాహ న కల్పించాలని సూచించా రు. జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9వ, 11వ తరగతుల్లో ప్రవేశం పొందేందుకు అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

సంగారెడ్డి–జహీరాబాద్ నియోజకవర్గాల అభివృద్ధి అంశాలపై కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి వుదయం

సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రజల సమస్యలు, మౌలిక వసతులపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ గారిని ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్ గారు, మాణిక్ రావు గారు కలిసి పలు అంశాలను వివరించి, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. చేర్యాల గ్రామంలో కుల సంఘాలకు సంబంధించిన స్థలాలను ఆయా కుల సంఘాలకే కేటాయించాలని కోరారు. TG-IIC పేరుతో ఆ స్థలాలను ఇతర అవసరాలకు తీసుకునే ప్రయత్నాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. SC కమ్యూనిటీ హాళ్లను అవసరమైన ప్రాంతాల్లో మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అంబేద్కర్ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు, స్థలాలను కేటాయించి మంజూరు చేయాలని కోరారు. సైదాపూర్ తండాలో వాటర్ ట్యాంక్‌కు వెళ్లే మెట్లు పూర్తిగా దెబ్బతిన్నందున వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. నియోజకవర్గంలోని ఇతర గ్రామాల్లోనూ ఇలాంటి సమస్యలను గుర్తించి, అవసరమైన చోట కొత్త మెట్లు ఏర్పాటు చేయడం లేదా మరమ్మతులు చేపట్టాలని సూచించారు. TG-IIC ద్వారా భూసేకరణ జరుగుతున్న గ్రామాల్లో, పారిశ్రామిక అవసరాలతో పాటు గ్రామాల కనీస మౌలిక అవసరాల కోసం కూడా అవసరమైన భూమిని కేటాయించాలని కోరారు. వర్షాకాలం నేపథ్యంలో రోడ్ల పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించి, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రహరీ గోడలు లేని ప్రభుత్వ పాఠశాలలను గుర్తించి, ఆయా పాఠశాలలకు ప్రహరీ గోడలు మంజూరు చేసి విద్యార్థుల భద్రతకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో డ్రైనేజీ, మురుగు కాలువలు, కల్వర్టులు, అంతర్గత రోడ్ల సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని కోరారు. ప్రజలకు అత్యవసరంగా అవసరమైన తాగునీరు, విద్య, రహదారులు, పారిశుధ్యం, విద్యుత్ తదితర మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యేలు కోరారు. ఇప్పటికే మంజూరైన కానీ పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై శాఖల వారీగా సమీక్షించి, పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇచ్చి, పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యేలు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో మాజీ CDC చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, తదితరులు ఉన్నారు.

సాగు నీటి ప్రాజెక్ట్‌లకు భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

- మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే సాగు నీరు ఇవ్వొచ్చు
- గ్రామసభలు నిర్వహించాలి
- గుడ్డెం దొడ్డి రిజర్వాయర్‌కు భూసేకరణ ప్రారంభించాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల, సెప్టెంబర్ 23 (వుదయం కరస్పాండెంట్)

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే జిల్లాలో పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల వారీగా, మండలాల వారీగా చేపట్టాల్సిన భూసేకరణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అభ్యంతరాలు, ఇబ్బందులు లేని ప్రాంతాల్లో నిబంధనల ప్రకారం రైతులకు అవార్డులు పాస్ చేసి భూసేకరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. మల్లమ్మకుంట రిజర్వాయర్‌కు సంబంధించి రైతులతో గ్రామసభలు నిర్వహించి, ప్రాజెక్టు ఆవశ్యకత, ప్రయోజనాలపై వారికి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వం గుడ్డెం దొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 15 టీఎంసీలకు పెంచాలని నిర్ణయించిన నేపథ్యంలో, అవసరమైన భూసేకరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సూచించారు. జూరాల ప్రాజెక్టు కుడి కాలువ పరిధిలో వరి సాగు చేసిన రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటిని విడుదల చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్ కృష్ణ, ఆర్డీవో శ్రీనివాసరావు, నీటిపారుదల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ కేశవరావు, సర్వే ఏడీ నూకరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందాలి - ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట, సెప్టెంబరు 23 (వుదయం ప్రతినిధి):

అచ్చంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమీక్షా సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ హాజరయ్యారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, డీఎల్పీవో వెంకట్ ప్రసాద్, ఎంపీడీవో అరుంధర్ రావు, పీఆర్ డీఈ చంద్రకళ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాలని, పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో మండల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతు రిజిస్ట్రేషన్ ఫార్మర్ ఐడి నమోదు చేస్తున్న ఏఈఓ రవి

పూడూరు సెప్టెంబర్ 24, (వుదయం)

వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని చింతలపల్లి గ్రామములో రైతులకు బుధవారం రోజున రైతు రిజిస్ట్రేషన్(ఫార్మర్ ఐడి) నమోదు చేసిన ఏఈఓ రవి, ఈనెల 22 నుండి 30 తారీఖు వరకు ప్రతి రైతు ఏఈఓ ల దగ్గర రైతు రిజిస్ట్రేషన్(ఫార్మర్ ఐడి) పంట నమోదు చేసుకోవాలని అన్నారు. పంట నమోదు చేసుకున్న రైతులు వరి, పత్తి, మొక్కజొన్న, కంది, పంటలు వేసినట్టు అయితే ఫార్మర్ సిస్టర్ చేసుకుంటే ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు అమ్ముకోవచ్చని, రైతులకు సరిపడే విధంగా ఎరువులు అందుతాయి, అదేవిధంగా బ్యాంకుల ద్వారా ఏ పంటకు ఎంత రుణం అనేది బ్యాంకు రుణాలు పొందవచ్చు అని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సేవలు ఇతర ప్రయోజనాలు పొందడానికి ఉపయోగ పడుతుందని అన్నారు ప్రతి గ్రామంలో రైతు రిజిస్ట్రేషన్ క్యాంపస్లు నిర్వహించ బడుతున్నవి అందరు రైతులు తప్పనిసరిగా చేయించుకోవాలని, వీలు కానీ రైతులు మీ దగ్గరలో ఉన్న మీసేవ సెంటర్లో అయినా చేసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రవితో పాటు చింతలపల్లి గ్రామా రైతులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ గోడపత్రిక ఆవిష్కరణ

అచ్చంపేట, సెప్టెంబరు 23 (వుదయం ప్రతినిధి):

ఈ నెల 28, 29, 30 తేదీల్లో హనుమకొండ కేంద్రంగా జరగనున్న ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ ముగింపు వేడుకలను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి బలమూరి ప్రేమ్ కుమార్ పిలుపునిచ్చారు. అచ్చంపేట పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాలలో బుధవారం ఏఐఎస్ఎఫ్ అచ్చంపేట నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో 90వ వార్షికోత్సవ వేడుకల గోడపత్రికను ఘనంగా ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మల్లయ్య, జిల్లా కార్యదర్శి ప్రేమ్ కుమార్ కలిసి గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల పెండింగ్ స్కాలర్ షిప్ లు, ఫీజు రీయింబర్స్ మెంట్, ఫెలోషిప్ లను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఫన్నీ అర్జున్, శిల్ప, కళ్యాణి, పవన్, రవి, స్రవంతి పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుల శోభాయాత్ర

నాగర్ కర్నూల్, సెప్టెంబరు 23 (వుదయం బ్యూరో):

నాగర్ కర్నూల్ పట్టణంలో గణనాథుల నిమజ్జన శోభాయాత్రలు మంగళవారం భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా సాగాయి. తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు, అర్చనలు అందుకున్న లంబోదరుడికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. కోలాటాలు, భజనలు, మంగళ వాయిద్యాలు, గణేశ నామ స్మరణతో పట్టణ పురవీధులు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. పట్టణంలోని వివిధ కాలనీలు, వీధుల్లో ప్రతిష్ఠించిన గణనాథులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై కొలువుదీర్చి భక్తులు ఊరేగింపుగా నిమజ్జన ప్రాంతాలకు తరలించారు. ఉదయం నుంచే మండపాల వద్ద భక్తులు గణపతికి ప్రత్యేక పూజలు, పాలాభిషేకాలు, వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. అనంతరం లడ్డూ ప్రసాదాలు పంచి, మంగళహారతులతో శోభాయాత్రను ప్రారంభించారు. శోభాయాత్రలో చిన్నారులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కోలాటాలు, భజనలతో సందడి చేశారు. డీజే సౌండ్ లకు అనుగుణంగా యువకులు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మళ్లీ రావాలంటూ చేసిన నినాదాలు పట్టణమంతా మార్మోగాయి. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మహిళలు గణనాథులకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. తొమ్మిది రోజులపాటు ఉదయం, సాయంత్రం భక్తుల పూజలందుకున్న గణనాథులను నిమజ్జనం చేసేందుకు తరలివెళ్తున్న సమయంలో భక్తులు భావోద్వేగానికి గురయ్యారు. భక్తిపారవశ్యంతో సాగిన శోభాయాత్రల అనంతరం గణపయ్యలను నగర శివారులోని చెరువు వద్ద గంగమ్మ ఒడికి చేర్చి నిమజ్జనం చేశారు. విఘ్నాలు తొలగించి, సకల శుభాలు ప్రసాదించాలని ప్రార్థిస్తూ భక్తులు గణనాథుడికి వీడ్కోలు పలికారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వచ్చే ఏడాది మరింత వైభవంగా గణపయ్య ఉత్సవాలు జరుపుకోవాలనే ఆకాంక్షతో భక్తులు స్వామివారిని భక్తిశ్రద్ధలతో సాగనంపారు.

గణనాథుని సేవలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

వెల్దండ సెప్టెంబర్ 23 (వు దయం)

మండల కేంద్రంలో చర్చి కాలనీలో నెలకొల్పిన గణనాథుని సేవలో మాజీ ఎమ్మెల్యే జైపాల్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు బిఆర్ ఎస్ నాయకులు మాజీ ఎంపిటిసి జ్యోతి నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా వాడవాడలో గణనాథుని భక్త శ్రద్ధలతో పూజించడం అభినందనీయమని అన్నారు కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యం రెడ్డి, గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, ఉప సర్పంచ్ శ్రీను ముదిరాజ్ మండల బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు రామ్ రెడ్డి, వార్డు సభ్యులు ఆనందు, శేఖర్, కార్యదర్శి గిరి గౌడ్, నాయకులు శశి పాల్ రెడ్డి ,జోగయ్య, వెంకటయ్య, మాజీ ఉప సర్పంచ్ నిరంజన్, హనుమంత్ నాయక్, నాగులు నాయక్, ప్రవీణ్, యాదగిరి, పుల్లయ్య, మదన్ గౌడ్, తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

గద్వాల కలెక్టర్‌కు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆహ్వానం

- జాతీయ వేదికపై గద్వాల జిల్లా నీటి నిర్వహణ విధానాలు
- కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ప్రత్యేక ఆహ్వానం
- 24న ఢిల్లీలో ఉత్తమ నీటి నిర్వహణ పద్ధతులపై కలెక్టర్ ప్రజెంటేషన్

గద్వాల, సెప్టెంబర్ 23 (వుదయం కరస్పాం డెంట్)

జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్‌కు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నుంచి ప్రత్యేక ఆహ్వానం లభించింది. ఈ నెల 24న ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్వహించనున్న ప్రత్యేక సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ఉత్తమ నీటి నిర్వహణ విధానాలపై ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో అమలు చేస్తున్న ఉత్తమ నీటి నిర్వహణ విధానాలు, వాటి ద్వారా సాధించిన ఫలితాలు, అనుభవాలను ఈ సమావేశంలో తెలుసుకునే అవకాశం కలగనుంది. ఆయా ఉత్తమ పద్ధతులను జోగులాంబ గద్వాల జిల్లాలో, ముఖ్యంగా పీఎండీకేవై కార్యక్రమం కింద చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు అన్వయించుకునేందుకు ఈ సమావేశం దోహదపడనుంది. జాతీయ స్థాయి వేదికపై జోగులాంబ గద్వాల జిల్లా తరఫున ఉత్తమ నీటి నిర్వహణ విధానాలపై ప్రజెంటేషన్ ఇచ్చే అవకాశం లభించడం జిల్లాకు ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తుందని అధికారులు తెలిపారు.

ఖో-ఖోలో రాయపోల్‌కు ప్రథమ స్థానం

దౌల్తాబాద్ సెప్టెంబర్ 23(వుదయం):

70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సిద్దిపేట జిల్లా స్థాయి ఖో–ఖో పోటీల్లో అండర్–17 బాలికల విభాగంలో రాయపోల్ మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పీఈడీ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. జిల్లా స్థాయి ఖో–ఖో పోటీల్లో రాయపోల్ మండలం ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. విద్యార్థుల ప్రతిభను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, మంజుల, పీఈటీ అనీఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గారెడ్డి కృషి తో భూములు కోల్పోయిన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ

తొగర్‌పల్లి సర్వే నం.418లో 93 మంది లబ్ధిదారులకు 125 గజాల చొప్పున ఇంటి పట్టాలు పంపిణీ చేసిన నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, వుదయం

ఏళ్ల తరబడి సొంతింటి స్థలం కోసం ఎదురుచూస్తున్న పేదల నిరీక్షణకు తెరపడింది. తొగర్‌పల్లి, అలియాబాద్ గ్రామాలకు చెందిన భూములు కోల్పోయిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తొగర్‌పల్లి సర్వే నంబర్ 418లో మొత్తం 93 మంది లబ్ధిదారులకు 125 గజాల చొప్పున స్థలాలను కేటాయిస్తూ పట్టాలు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గతంలో ఇళ్ల స్థలాల కోసం పట్టాలు పొందినప్పటికీ, తదనంతర పరిణామాలతో లబ్ధిదారులకు స్థలాల పొజిషన్ అందకపోవడంతో సమస్య కొనసాగుతూ వచ్చింది. దీంతో తమకు కేటాయించిన స్థలాలను చూపించి, సొంతింటి కలను సాకారం చేయాలని లబ్ధిదారులు పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతూ వచ్చారు. తొగర్‌పల్లి, అలియాబాద్ ప్రాంతాల్లో భూములు కోల్పోయిన కుటుంబాలకు గతంలో ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ చేపట్టారు. అయితే ప్రభుత్వం మారిన అనంతరం గతంలో జరిగిన కేటాయింపులు అమలులోకి రాకపోవడంతో లబ్ధిదారులు స్థలాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ సమస్యపై మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించారు.

మంత్రి పొంగులేటిని కలిసిన జగ్గారెడ్డి

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గత సంవత్సరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. అనంతరం మంత్రి అప్పటి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఫోన్ చేసి, లబ్ధిదారులకు పొజిషన్ చూపించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. తొగర్‌పల్లి సర్వే నంబర్ 418లో లబ్ధిదారులకు నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, కొండాపూర్ తహసీల్దార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, నాయకులు నర్సింహా రెడ్డి, కొండాపూర్, అలియాబాద్ గ్రామ సర్పంచులు,కొండాపూర్ తహసీల్దార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగులందరికీ సదరం ధ్రువపత్రాలు

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్
- మానసిక సమస్యలున్న దివ్యాంగులకు మెగా సదరం శిబిరం

గద్వాల, సెప్టెంబర్ 23 (వుదయం కరస్పాండెంట్)

అర్హులైన దివ్యాంగులందరికీ నిబంధనల ప్రకారం సదరం ధ్రువపత్రాలు జారీ చేస్తామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ప్రత్యేక సదరం శిబిరానికి హాజరు కాలేకపోయిన దివ్యాంగులు నిర్దేశిత సమయంలో ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలు చేయించుకోవచ్చని పేర్కొన్నారు. గద్వాలలోని జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో సెర్ప్ సహకారంతో మానసిక సమస్యలున్న దివ్యాంగులకు రెండు రోజులపాటు నిర్వహించిన ప్రత్యేక మెగా సదరం శిబిరాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులు, అధికారులతో మాట్లాడి శిబిరం నిర్వహణపై పలు సూచనలు చేశారు. శిబిరానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ పలువురు దివ్యాంగుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. శిబిరానికి హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. శిబిరం రెండో రోజు ప్రత్యేకంగా దివ్యాంగ చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం సదరం ధ్రువపత్రాలు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ముషాహిదా బేగం, డీపీఎం అరుణ, ఏపీఎం భీమన్న తదితరులు పాల్గొన్నారు.

కొనయపల్లిలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ

దౌల్తాబాద్ సెప్టెంబర్ 23(వుదయం):

గ్రామపంచాయతీ పరిధిలో కొత్తగా మంజూరైన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. అర్హత పొందిన లబ్ధిదారులకు అధికారులు, ప్రజాప్రతినిధులు రేషన్ కార్డులను అందజేశారు. కొత్త రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులు, ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనా లు అందనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ జీపీ వో రాఘవేందర్, గ్రామ కార్యదర్శి సునయన రాణి, ఉపసర్పంచ్ శ్యామల, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. కొత్త రేషన్ కార్డులు అందుకోవడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తప్పుడు కేసుల?

వట్టిపల్లి సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి)

ఇటీవల మెడికుంద అశోక్ కుమార్ అదేవిధంగా DPS చిన్నోడు అనే వ్యక్తులు ఇటీవలే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ పోస్టులు పెట్టినందుకు అక్రమ కేసులు బనాయించిన నేపథ్యంలో ఎలాంటి ఫేస్బుక్ అకౌంట్ లేని మహిళ తోటి కంప్లీట్ ఇప్పిచ్చి అక్రమంగా అరెస్టు చేయాలని కుట్ర చేశారని ఆరోపించారు ఈ సందర్భంగా గౌరవ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఎలాంటి అరెస్టులు చేయకుండా BNS సెక్షన్41 కింద నోటీస్ ఇచ్చి విచారణ జరిపాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈరోజు వట్టిపల్లి పోలీస్ స్టేషన్లో విచారణకు హాజరయ్యారు ఈ సందర్భంగా ఇలాంటి అక్రమ కేసులో భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ప్రవర్తిస్తే కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి దామోదర్ రాజనర్సింహా కూడా తగిన మూల్యం చెల్లించుకోవాల్సింది అని చెప్పేసి వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వీరారెడ్డి, భాస్వరాజ్ అశోక్ గౌడ్ నర్సింలు కోష్క శేఖర్ చంటి కుమార్ రాములు మల్లేశం యాదవ్ గన్ని భాయ్ మధు మాజీ సర్పంచులు మాజీ ఎంపిటీసీలు భారీ ఎత్తున బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

అలంపూర్ సెప్టెంబర్ 23 (వుదయం కరస్పాండెంట్)

శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయంలో అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలు, కరపత్రాలు, గోడ పత్రికలను అలంపూర్ శాసనసభ్యులు శ్రీ విజయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. నవరాత్రి ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీమతి దీప్తి, అలంపూర్ పురపాలక సంఘం చైర్మన్ పి. జయరాముడు, కౌన్సిలర్లు, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పగలు, రాత్రి తేడా లేదు... పనులన్నీ బంద్!

- వరుస దొంగతనాలతో వణికిపోతున్న ఆరెపల్లె
- కంటిమీద కునుకు లేకుండా గ్రామస్థుల గస్తీ
- తాళం వేయాలంటేనే వణుకు... పోలీసుల చర్యలకు విన్నపం

మిరుదొడ్డి, సెప్టెంబర్ 23, వుదయం:

గ్రామంలో అడుగు పెట్టాలంటేనే దొంగలు భయపడాలి.. కానీ, అక్కడ పరిస్థితి తలకిందులైంది. నిలువు దోపిడీలు చేస్తున్న దుండగుల ధాటికి తాళం వేసిన ఇంటిని వదిలి వెళ్లాలంటేనే స్థానికులు వణికిపోతున్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ఆరెపల్లె గ్రామంలో వరుస దొంగతనాలు స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. మిట్టమధ్యాహ్నం వేళ తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దుండగులు రెచ్చిపోతుండటంతో, గ్రామస్థులు తమ పనులన్నీ పక్కనబెట్టి రాత్రి, పగలు తేడా లేకుండా ఊరి కాపలా దారులుగా మారారు.

రూటు మార్చిన దొంగలు.. మధ్యాహ్నమే టార్గెట్.!

సాధారణంగా దొంగలు చీకటి పడ్డాక చేతివాటం ప్రదర్శిస్తారు. కానీ ఆరెపల్లెలో మాత్రం రూటు మార్చారు. ఈ నెల 17వ తేదీన గ్రామంలో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లను టార్గెట్ చేసిన దుండగులు.. యథేచ్ఛగా చొరబడి భారీ ఎత్తున బంగారు, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ ఘటన మరవకముందే.. నిన్న (22వ తేదీ) మధ్యాహ్నం కూడా మరో ఇంట్లో దొంగతనానికి దుండగుడు ప్రయత్నించాడు. అయితే సమయస్ఫూర్తితో వ్యవహరించిన గ్రామస్థులు కేకలు వేయడంతో ఆ దొంగ అక్కడి నుంచి పారిపోయాడు. వరుసగా జరుగుతున్న ఈ ఘటనలతో ఊర్లో ఏ క్షణాన ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనతో బతుకుతున్నారు.

కంటిమీద కునుకు లేదు.. 50 మందితో పహారా.!

దొంగల భయంతో ఇళ్లకు తాళాలు వేయాలంటేనే స్థానికులు జంకుతున్నారు. చివరకు ఊరిని కాపాడుకునేందుకు స్వయంగా రంగంలోకి దిగారు. ఉదయం పొలం పనులు, రోజువారీ కూలీ పనులను సైతం వదులుకుని సుమారు 50 మంది గ్రామస్థులు బృందాలుగా ఏర్పడి గ్రామంలో గస్తీ కాస్తున్నారు. రాత్రి, పగలు కంటిమీద కునుకు లేకుండా కాపలా ఉంటున్నామని, దొంగల భయంతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి: గ్రామస్థుల డిమాండ్ అలజడి సృష్టిస్తున్న దొంగలను త్వరితగతిన పట్టుకుని కఠినంగా శిక్షించాలని ఆరెపల్లె గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు కేవలం సాధారణ పెట్రోలింగ్‌కే పరిమితం కాకుండా, గ్రామంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రక్షణ కల్పించాలని, మళ్లీ శాంతిభద్రతలు నెలకొనేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు నుంచి జారిపడి మహిళకు తీవ్ర గాయాలు

మిరుదొడ్డిలో వరుస ఘటనలతో ప్రయాణికుల్లో భయాందోళన

మిరుదొడ్డి, సెప్టెంబర్ 23, వుదయం:

మిరుదొడ్డి మండల కేంద్రంలో ఆర్టీసీ బస్సు నుంచి మహిళ జారిపడి తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఎల్లుముల సంధ్య (40) బస్సులో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇటీవలే ఇదే ప్రాంతంలో వడ్ల రాములు(60) అనే వ్యక్తి ఆర్టీసీ బస్సు నుంచి జారిపడి మృతి చెందిన ఘటన మరువకముందే మరో ప్రమాదం జరగడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది.వరుస ప్రమాదాల నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. బస్సు ఎక్కే, దిగే సమయంలో సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదా? ఫుట్ బోర్డు, తలుపుల భద్రత ఎలా ఉంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వరుస ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఉప్పునుంతల వద్ద శిథిలమైన కల్వర్టు

ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

అచ్చంపేట , సెప్టెంబర్ 23:(వుదయం ప్రతినిధి)

ఉప్పునుంతల నుంచి తాడూర్ వెళ్లే మార్గంలో దుందుభి వాగుపై ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. భారీ వర్షాలకు కల్వర్టు కుంగిపోయి, పగుళ్లు ఏర్పడ్డాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు ముళ్ల కంపలను,రాళ్లను అడ్డుగా పెట్టి రాకపోకలను నిలిపివేశారు. ఈ మార్గంలో రోజూ వందలాది వాహనాలు, ఆర్టీసీ బస్సులు, పాఠశాల వాహనాలు తిరుగుతుంటాయి. కల్వర్టు కుంగడంతో రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్కనున్న వాగులో నీటి ప్రవాహం కూడా ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. కావున సంబంధిత R&B మరియు పంచాయతీ రాజ్ అధికారులు వెంటనే స్పందించి, తాత్కాలికంగా బారికేడ్లు ఏర్పాటు చేసి, శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జర్నలిస్టుపై దాడిని ఖండించిన జర్నలిస్టు సంఘం

- గాయపడిన నర్సింహులును పరామర్శించిన టీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ
- జిల్లా ఎస్పీకి వినతిపత్రం.. జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి

గద్వాల సెప్టెంబర్ 23 (వుదయం కరస్పాండెంట్)

జర్నలిస్టు నర్సింహులుపై జరిగిన దాడిని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జోగులాంబ గద్వాల జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. మంగళవారం రాత్రి గద్వాల రూరల్ పరిధిలోని సంఘాల చెరువు సమీపంలో నర్సింహులుపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై కమిటీ సభ్యులు స్పందించారు. దాడిలో గాయపడిన జర్నలిస్టు నర్సింహులును గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో కమిటీ సభ్యులు పరామర్శించి, ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ఎస్పీని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బి. గిరిబాబు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వార్తా సేకరణలో భాగంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసు యంత్రాంగంపై ఉందన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వార్తలపై అవగాహన లేకుండా కొందరు ప్రజాప్రతినిధులు జర్నలిస్టులను బెదిరింపులకు గురిచేసిన సందర్భాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వార్తలు రాసే జర్నలిస్టులపై స్పందించే ముందు వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. జర్నలిస్టుల స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలను సహించేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షులు సురేష్, శ్రీనివాసులు, కేబీ తిమ్మప్ప, టి. వీరన్న, మహబూబ్, వరప్రసాద్, ఇలియాస్, విష్ణువర్ధన్ గౌడ్, సత్యం, రవి తదితరులు పాల్గొన్నారు.

చక్కని ఆరోగ్యం

నిద్ర పట్టడం లేదా?

అందంగా, ఆరోగ్యంగా ఉండాలంటే అందుకు ప్రశాంతంగా నిద్ర పోవడం ముఖ్యం. కానీ ప్రస్తుతం వివిధ కారణాల వల్ల చాలామందికి సుఖనిద్ర కరువవుతోంది. అందుకే రాత్రుళ్లు నిద్రకు ఉపక్రమించే ముందు కొన్ని పానీయాలు తాగితే సుఖంగా నిద్ర పడుతుందంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి..సాధారణంగా నిద్ర సరిగ్గా పట్టకపోవడానికి మెగ్నీషియం లోపం కూడా ఓ కారణమే. కాబట్టి నిద్రకు ఉపక్రమించడానికి ముందు అరటిపండు స్మూతీ తీసుకో వడం వల్ల సుఖంగా నిద్ర పడుతుందంటున్నారు నిపుణులు. దీని కోసం ఒక అరటి పండు, రెండు చెంచాల ఆల్మండ్ బటర్, కప్పు పాలు బ్లెండర్‌లో వేసి బాగా మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని గ్లాసులోకి తీసుకొని నేరుగా తాగేయచ్చు. అరటి పండు, ఆల్మండ్ బటర్‌లో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. ఇది కేవలం ప్రశాంతమైన నిద్రకే కాదు.. కండర, నాడీ వ్యవస్థల పనితీరును మెరుగుపరిచేందుకూ సహకరిస్తుందని చెబుతున్నారు. ఇందులో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి బరువు తగ్గాలనుకునేవారు నిపుణుల సలహామేరకు తీసుకోవాలని సూచిస్తున్నారు. వేడి పాలలో కొద్దిగా వెనీలా ఎసెన్స్, తేనె వేసి బాగా మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని పడుకునే ముందు కొద్దికొద్దిగా సిప్ చేయాలి. పాలల్లో ఉండే అమైనో ఆమ్లాలు శరీరంలోకి ప్రవేశించిన తర్వాత సెరటోనిన్, మెలటోనిన్ అనే హార్మోన్లు విడుదలయ్యేలా చేస్తాయంటున్నారు నిపుణులు. ఫలితంగా నిద్ర బాగా పడుతుందని చెబుతున్నారు. మార్కెట్లో దొరికే చామొమైల్ బ్యాగ్స్‌ని కాసేపు వేడి నీటిలో ఉంచడం వల్ల చామొమైల్ డ్రింక్‌ని సులభంగా తయారు చేసుకోవచ్చు. ఈ పానీయాన్ని నిద్ర పోవడానికి ముందు తాగడం వల్ల చక్కని నిద్ర సొంతమవుతుందంటున్నారు నిపుణులు. ఒక కప్పు బాదం పాలు తీసుకొని అందులో చిటికెడు యాలకుల పొడి, కొద్దిగా అల్లం వేసి మరిగించాలి. ఈ మిశ్రమం గోరువెచ్చగా అయ్యాక అందులో కొద్దిగా తేనె వేసి కలుపుకోవాలి. ఈ పాలను పడుకునే ముందు తాగితే హాయిగా నిద్రలోకి జారుకోవచ్చని చెబుతున్నారు. రోజూ ఉదయం, రాత్రి వేళల్లో గ్లాసు చెర్రీ జ్యూస్ తాగడం వల్ల ప్రశాంతంగా నిద్ర పడుతుందంటున్నారు నిపుణులు. చెర్రీల్లో ఉండే మెలటోనిన్ అనే పదార్థమే ఇందుకు కారణమట! కేవలం పైన పేర్కొన్న పానీయాలు మాత్రమే కాకుండా.. ప్రతిరోజూ ఒకే సమయంలో నిద్రపోవడం.. స్క్రీన్ టైమ్ తగ్గించడం.. సాయంత్రం తర్వాత కెఫీన్ ఉండే పదార్థాలు తీసుకోకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. అలాగే పడకగది వాతావరణాన్ని సుఖనిద్రకు అనుగుణంగా మార్చుకోవాలంటున్నారు. ఒకవేళ నిద్రలేమి సమస్య దీర్ఘకాలం ఉంటే మాత్రం తప్పకుండా వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు.

రెండు వారాలు చాలట!

అందానికి కొలమానాలు అందరికీ ఒకేలా ఉండకపోవచ్చు. కానీ, వయసు ఎంతైనా సరే... ప్రకాశవంతమైన, ఆరోగ్యకరమైన చర్మాన్ని కోరుకోని అమ్మాయిలు ఎవరు? అందుకు రకరకాల సౌందర్య ఉత్పత్తులు వాడుతూ వేల రూపాయలు ఖర్చు చేసేవారూ ఉన్నారు. కానీ అవి పై మెరుగులు మాత్రమే. తక్కువ ఖర్చులో అంతకంటే మెరుగైన ఫలితాలు రావాలంటే ఏం చేయాలో తెలుసా? ద్రాక్ష పళ్లను తినాలి. అవును...ద్రాక్ష చర్మానికి 'సూపర్ ఫుడ్'లా పనిచేస్తుందని 'వెస్ట్రన్ న్యూ ఇంగ్లండ్ యూనివర్సిటీ' తాజా అధ్యయనం చెబుతోంది. ఇవి సూర్యరశ్మి వల్ల దెబ్బతిన్న చర్మాన్ని కాపాడతాయి. అది కూడా పైపైన కాకుండా జన్యువుల్లో మార్పు తీసుకొచ్చి చర్మ రక్షణ వ్యవస్థను మెరుగుపరుస్తాయని చెబుతున్నారు పరిశోధకులు. అదీ రెండువారాల్లోనే... ఇంకేం ఎప్పుడైనా చర్మం డల్‌గా అనిపిస్తే, ద్రాక్ష తిని చూడండి. తక్కువ ఖర్చు, ఎక్కువ లాభం.

నటించనిద్దాం!

'అమ్మా, నేను డాక్టర్... నువ్వేమో పేషెంట్‌వి'... 'నేను అమ్మని, నువ్వు పాపవి... ఆడుకుందామా' ఇలా అడగని పిల్లలు ఉండరేమో! అయితే, సవాలక్ష పనులతో అలసిపోయే తల్లులు మాత్రం కొన్నిసార్లు మావల్ల కాదు బాబోయ్ అనేస్తారు కదా... కానీ, ఇలాంటి ఆటలు పిల్లల్లో సృజనాత్మకత, ఊహాశక్తిని పెంచుతాయి. అవొక్కటే కాదు, పిల్లలకు మానసిక ఆరోగ్యాన్నీ ఇస్తాయంటోంది యూనివర్సిటీ ఆఫ్ సిడ్నీ తాజా అధ్యయనం. వీటి ద్వారా స్వేచ్ఛగా తమ భావాలను వ్యక్తపరచడం, ఇతరుల పట్ల సానుభూతి చూపించడం, వాళ్ల దృక్కోణాన్ని అర్థం చేసుకోవడం, ఒకరికొకరు సహకరించుకోవడం వంటివి అలవడతాయట. ఇలా ఆటలాడే పిల్లల్లో మానసిక సమస్యలు, ప్రవర్తనాలోపాలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు పరిశోధకులు. ముఖ్యంగా రెండుమూడేళ్ల పిల్లలను ఈ విధంగా ప్రోత్సహిస్తే స్కూలుకెళ్లే వయసొచ్చేసరికి మంచి ప్రవర్తనతో ఆరోగ్యంగా ఉంటారట. అందుకే, పిల్లలు ఓ బొమ్మని తీసుకొచ్చి అన్నం తినిపించమంటే తినిపించేయండి. లేదూ ఇప్పుడు 'మీరంతా డైనోసార్లు' అంటే.. అలానే నటించండి. వాళ్లనీ నటించనివ్వండి. బొమ్మలు చిందరవందర చేసేస్తున్నారా? చేయనివ్వండి. ఏం చేసినా అది వాళ్ల ఎదుగుదలకే సాయపడుతుందట. వస్తువులను మళ్లీ తెచ్చివ్వగలం. కానీ, బాల్యాన్ని కాదు. అందుకే, వీలైనంతగా ఆడనివ్వండి.

మౌత్‌వాష్.. ఆరోగ్యకరంగా..

మన నోట్లో మంచి బ్యాక్టీరియానే కాదు.. చెడు బ్యాక్టీరియా కూడా ఉంటుంది. ఈ చెడు బ్యాక్టీరియాను తొలగించడానికి చాలామంది మౌత్‌వాష్‌లు ఉపయోగిస్తుంటారు. అయితే మార్కెట్లో లభించే మౌత్‌వాష్‌లలో రసాయనాలు నిండి ఉంటాయి. కాబట్టి, వీలైతే ఇంట్లోనే దీన్ని సహజసిద్ధంగా తయారు చేసుకోవడం మేలంటున్నారు నిపుణులు.

కావాల్సిన పదార్థాలు:
- మరిగించిన నీళ్లు – రెండు కప్పులు
- పెద్ద దాల్చిన చెక్క ముక్క – ఒకటి
- లవంగాలు – ఒక టేబుల్ స్పూన్
- అనాస పువ్వులు – మూడు

తయారీ:

మరిగించిన నీటిలో దాల్చిన చెక్క, లవంగాలు, అనాస పువ్వులు వేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని గాలి చొరబడని సీసాలో నింపి.. రెండు రోజుల పాటు గది ఉష్ణోగ్రత వద్ద ఉంచాలి. ఆ తర్వాత వడకట్టుకుని మరో గాలి చొరబడని సీసాలో నిల్వ చేసుకోవాలి. ఇలా తయారుచేసుకున్న మౌత్‌వాష్‌తో రోజుకోసారి 30 నుంచి 40 సెకన్ల పాటు పుక్కిలిస్తే ప్రయోజనం ఉంటుందంటున్నారు నిపుణులు.

సహజసిద్ధమైన పదార్థాలతో తయారుచేసిన ఈ మౌత్‌వాష్ పంటి నొప్పిని, నోటి దుర్వాసనను దూరం చేసి.. నోటిని శుభ్రపరుస్తుందని చెబుతున్నారు నిపుణులు. అయితే ఇతర దంత, చిగుళ్ల సమస్యలతో దీర్ఘకాలం పాటు బాధపడే వారు మాత్రం దంత వైద్య నిపుణుల్ని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

'జాగర్స్ నిపుల్'.. ఏమిటీ సమస్య?

సాధారణంగా వ్యాయామం చేసేటప్పుడు పెట్టుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం పైనే దృష్టి పెడతారు చాలామంది. ఈ క్రమంలో ఆయా వర్కవుట్స్ వల్ల శరీరంపై పడే ఒత్తిడి, అయ్యే గాయాల గురించి పట్టించుకోరు. ఈ నిర్లక్ష్యమే కొన్ని శరీర భాగాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందంటున్నారు నిపుణులు. 'జాగర్స్ నిపుల్' సమస్య కూడా ఇలాంటిదే! పరుగు, జాగింగ్ వల్ల నిపుల్స్ విషయంలో కలిగే ఒక రకమైన అసౌకర్యమే ఇది. దీనివల్ల చనుమొనల్లో తీవ్రమైన నొప్పి రావడం, కొన్నిసార్లు రక్తం కారడం.. వంటివీ గమనించచ్చు. మరి, ఈ సున్నితమైన సమస్యను ఎలా పరిష్కరించుకోవాలి? నిపుణులు చెబుతున్న విషయాల గురించి తెలుసుకుందాం రండి.. పరుగు, జాగింగ్‌తో పాటు శరీరంపై ఒత్తిడి కలిగించే కొన్ని రకాల వ్యాయామాలు చేసినప్పుడు కొంతమందిలో చనుమొనల్లో నొప్పి రావడం గమనించచ్చు. 'జాగర్స్ నిపుల్'గా పిలిచే ఈ సమస్యకు వ్యాయామాల తీవ్రతే కారణమనుకుంటారు చాలామంది. కానీ పరిగెత్తేటప్పుడు, శరీరాన్ని వేగంగా కదిలించే వ్యాయామాలు చేసినప్పుడు.. దుస్తులకు, నిపుల్స్‌కు మధ్య రాపిడి జరిగి ఈ సమస్య తలెత్తుతుంది అంటున్నారు నిపుణులు. ఇదొక్కటే కాదు.. బిగుతైన దుస్తులు ధరించడం, చెమట పట్టడం, ధరించే దుస్తుల మెటీరియల్.. వంటివీ ఈ సమస్యను తెచ్చిపెడతాయంటున్నారు. ఈ రాపిడి వల్ల చనుమొనలు ఎరుపెక్కడం, వాపు రావడం, పగుళ్లు ఏర్పడడం, కొంతమందిలో రక్తం కారడం.. వంటి లక్షణాలు గుర్తించచ్చంటున్నారు. తీవ్రమైన నొప్పితో పాటు అసౌకర్యాన్ని కలిగించే ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే వ్యాయామం పైనే కాదు.. రోజువారీ పనుల పైనా దృష్టి పెట్టలేమంటున్నారు. శరీరాన్ని వేగంగా కదిలించే వ్యాయామాలు చేసే వారిలో, రన్నర్స్‌లో ఎక్కువగా తలెత్తే ఈ సమస్యను కొన్ని సులభమైన చిట్కాలతో దూరం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. చనుమొనల్లో నొప్పిని తగ్గించుకోవడానికి నిపుల్ లూబ్రికెంట్స్ మార్కెట్లో దొరుకుతున్నాయి. వాటిని అప్లై చేసుకోవచ్చు. లేదంటే ఇంట్లో ఉండే పెట్రోలియం జెల్లీని వాడినా ఫలితం ఉంటుంది. ఇవి ఒక లేయర్‌లా ఏర్పడి.. నిపుల్స్‌కి, దుస్తులకు మధ్య రాపిడి జరగకుండా రక్షణ కల్పిస్తాయని చెబుతున్నారు నిపుణులు. దుస్తుల్లోని చెమట, తడిదనం వల్ల నిపుల్స్‌లో నొప్పి, అసౌకర్యం తీవ్రమవుతాయి. కాబట్టి కాటన్ దుస్తులకు బదులుగా.. సులభంగా ఆరిపోయే సింథటిక్ స్పోర్ట్స్ ఫ్యాబ్రిక్‌లు ధరించడం మంచిదంటున్నారు నిపుణులు. అలాగే ఈ సమస్య నుంచి స్పోర్ట్స్ బ్రా ఉపశమనం కలిగిస్తుందట. కాబట్టి ధరించేవి వదులైన దుస్తులైనా, లేదంటే బిగుతైనవే అయినా.. లోపల స్పోర్ట్స్ బ్రా వేసుకోవడం వల్ల చనుమొనలు–దుస్తులకు మధ్య రాపిడి జరగకుండా జాగ్రత్తపడచ్చని చెబుతున్నారు నిపుణులు. చనుమొనలకు రక్షణ కవచంలా ఉండే ప్రత్యేకమైన బ్యాండేజీలు, నిపుల్ కవర్స్ మార్కెట్లో దొరుకుతున్నాయి. వాటిని వాడడం వల్ల కూడా సమస్యను దూరం చేసుకోవచ్చట. టాల్కం పౌడర్ చనుమొనల వద్ద ఉండే చెమట, తడిని పీల్చుకొని.. ఆ ప్రదేశాన్ని పొడిగా ఉంచుతుంది. కాబట్టి నిపుల్స్‌పై ఓ లేయర్ మాదిరిగా టాల్కం పౌడర్ అప్లై చేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. రాపిడికి గురైన నిపుల్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ పొడిగా ఉంచుకోవాలి. ఆపై డాక్టర్ సలహా మేరకు యాంటీబయోటిక్ క్రీమ్‌ని అప్లై చేసుకుంటే సమస్య నుంచి త్వరగా ఉపశమనం పొందచ్చంటున్నారు నిపుణులు.

తల్లీబిడ్డకి ఏఐ రక్ష!

ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనివ్వాలని ప్రతి తల్లీ కోరుకుంటుంది. కానీ, గర్భధారణ సమయంలో కొందరిలో వచ్చే ప్రీ–ఎక్లాంప్సియా ఆ ఆకాంక్షకు అడ్డుకట్ట వేస్తుంది. సరైన సమయంలో దీన్ని గుర్తించి, చికిత్స అందించకపోతే తల్లీబిడ్డా ఇద్దరికీ ప్రమాదమే మరి. అయితే, ఏఐ సాంకేతికత ఉపయోగించి ఈ ప్రమాదాన్ని ముందే కని పెట్టొచ్చని 'పబ్‌మెడ్ సెంట్రల్' జర్నల్ తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. 'ప్రాంప్ట్' అనే ఏఐ మోడల్‌తో కంటి రెటీనా ఫొటో తీసి, సూక్ష్మ రక్తనాళాల నమూనాలను విశ్లేషించారు శాస్త్రవేత్తలు. దాంతోపాటు వారి క్లినికల్ డేటానూ పోల్చిచూశారు. దీంతో ఎలాంటి ముందస్తు లక్షణాలు కనిపించకముందే గర్భధారణ జరిగిన 14వారాల్లోపే ప్రీ–ఎక్లాంప్సియా వచ్చే ప్రమాదాన్ని అంచనా వేయగలిగారు. పైగా ఈ పద్ధతి ఇప్పుడున్న వాటిలో సురక్షితం, చౌక అయినది కూడా అట. అందుకే, ఈ ప్రక్రియను అన్ని ప్రసూతి కేంద్రాల్లో వినియోగించొచ్చని సూచిస్తున్నారు పరిశోధకులు.

టీ, కాఫీలకు బదులుగా!

ఉదయం లేవగానే కాఫీ లేదా టీ తాగడం చాలామందికి అలవాటు. కానీ, మన రోజు ఆరోగ్యంగా మొదలవ్వాలంటే... వాటికి దూరంగా ఉంటేనే మంచిదని చెబుతున్నారు నిపుణులు. కాఫీ, టీలకు బదులుగా కొబ్బరి నీళ్లతో రోజుని ప్రారంభించమంటున్నారు. ఇలా ఖాళీ కడుపుతో వీటిని తీసుకుంటే అనేక ప్రయోజనాలున్నాయని చెబుతున్నారు. రాత్రంతా నిద్రపోవడం వల్ల శరీరం డీహైడ్రేట్ అవుతుంది. కాబట్టి ఉదయాన్నే ఒక గ్లాసు కొబ్బరి నీళ్లు తాగడం వల్ల శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లు, ఖనిజాలు అంది రోజంతా కావాల్సిన శక్తి లభిస్తుంది. ఇందులో ఉండే సహజ ఎంజైమ్స్ జీర్ణ వ్యవస్థను మెరుగుపరిచి కడుపులో మంట, ఎసిడిటీ, గ్యాస్ సమస్యల్ని దూరం చేస్తాయి. వీటిని పరగడుపున తీసుకుంటే కిడ్నీలు, కాలేయంలో ఉన్న వ్యర్థాలన్నీ బయటికి పోయి, కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశం తగ్గుతుంది. వీటిలో ఉండే పొటాషియం శరీరంలో ఉండే సోడియం శాతాన్ని సమతుల్యం చేసి, రక్తపోటుని అదుపులో ఉంచుతుంది. బరువు నియంత్రణలో ఉండాలన్నా.. మెరిసే చర్మం మన సొంతం కావాలన్నా రోజూ ఒక గ్లాసు కొబ్బరి నీళ్లు తాగితే సరి. వీటిలో కెలోరీలు, చక్కెర తక్కువగా ఉండి బరువు తగ్గడంలో సాయపడతాయి. అయితే ఆరోగ్యపరంగా ఇది ఎంత మేలు చేసినప్పటికీ... కిడ్నీ సమస్యలు, మధుమేహం ఉన్న వాళ్లు వైద్యుల సలహా మేరకే తీసుకోవాలని సూచిస్తున్నారు.

స్మార్ట్‌ఫోన్లకు భద్రమైన టెంపర్డ్‌గ్లాస్

స్మార్ట్‌ఫోన్ల స్క్రీన్‌లకు రక్షణ కల్పించే టెంపర్డ్‌గ్లాస్‌లకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రమాణాలు నిర్దేశించింది. 2027 ఏప్రిల్ 1 నుంచి ఇవి ఐఎస్ 19348:2025 ప్రకారమే ఉండాలని స్పష్టంచేస్తూ కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ మంగళవారం నోటిఫికేషన్ జారీచేసింది. ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని 'ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ గూడ్స్ (రిక్వయిర్‌మెంట్ ఆఫ్ కంపల్సరీ రిజిస్ట్రేషన్) ఆర్డర్ 2021లో ఈమేరకు సవరణలు చేసినట్లు పేర్కొంది. ఈ కొత్త ప్రమాణాలు 2027 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది.

బిజినెస్

ఇక విమానాశ్రయాల నిర్మాణం 18 నెలల్లో పూర్తి

ఉడాన్ పథకం కింద వచ్చే పదేళ్లలో దేశ వ్యాప్తంగా 100 విమానాశ్రయాలు నిర్మించబోతున్నట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. గతంలో ఒక్కో ఎయిర్‌పోర్టుకు సగటున 3 ఏళ్ల సమయం పడితే ఈసారి 18 నెలల్లోపే ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఆయన మంగళవారం ఇక్కడ ఉడాన్ నూతన దశ అమలుపై 21 రాష్ట్రాలతో ఎంఓయూ కుదుర్చుకున్న సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. 'ఉడాన్ తదుపరి దశను వేగవంతంగా అమలుచేయడం కోసం 21 రాష్ట్రాలతో ఎంఓయూ కుదుర్చుకున్నాం. సామాన్య ప్రజలకు చౌకధరల్లో విమానయాన సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చిన ఉడాన్ పథకాన్ని ఇప్పుడు మరో పదేళ్లు పొడిగిస్తున్నాం. ఇప్పుడు దేశవ్యాప్తంగా మరో 100 విమానాశ్రయాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అన్నింటినీ ఒకే సమయంలో చేపట్టడానికి బదులు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను బట్టి ప్రాధాన్యతాక్రమంలో నిర్మాణ పనులు చేపడతాం. దేశ వ్యాప్తంగా 200 హెలీపోర్టులు కూడా నిర్మిస్తాం' అని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు స్పైస్‌జెట్ కార్యకలాపాల, ఆర్థిక అంశాలను డీజీసీఏ పరిశీలిస్తోందని ఈ సందర్భంగా తెలిపారు. ఇటీవల ఈ కంపెనీలో విమాన ఆలస్యాల, కార్యకలాపాల సమస్యలు వచ్చిన సంగతి తెలిసిందే. కాగా, ప్రైవేటు విమానాశ్రయ కార్యకలాపాల్లో జోక్యం చేసుకోవడానికి తమ శాఖకు పరిమితులుంటాయని ఆయన స్పష్టం చేశారు. రాబోయే పండగల సీజనులో విమాన ఛార్జీలపై పరిమితులేమీ పెట్టలేదు కానీ, ధరలు సహేతుకంగా ఉండాలని విమానయాన సంస్థలకు కేంద్రం సూచించినట్లు ఆయన తెలిపారు.

ఏఐకి బ్రేకులు అసాధ్యం.. శ్రీధర్ వెంబు కీలక వ్యాఖ్యలు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) విపత్కర పరిణామాలకు దారితీస్తుందన్న అంచనాలను జోహో సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు తోసిపుచ్చారు. అదంతా అతిశయోక్తేనని కొట్టిపారేశారు. అలాగే, ఏఐని స్లో డౌన్ చేయాలన్న పిలుపుపైనా స్పందించారు. ఏఐ అభివృద్ధి విషయంలో విరామం అంటూ వచ్చే అవకాశం లేదన్నారు. భారత్ ఏఐ సహా అన్ని రంగాల్లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌పై పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. ఏఐ విషయంలో భారత్ స్వతంత్ర వైఖరితో వ్యవహరించాలని శ్రీధర్ వెంబు సూచించారు. సాంకేతిక రంగంలో అమెరికా, చైనా మధ్య నెలకొన్న పోటీలో నలిగిపోకుండా.. ఏఐ అభివృద్ధిలో భాగస్వామ్యాలను బలోపేతం చేసుకోవాలని సూచించారు. ఎవరితోనూ శతృత్వం లేకుండా అందరినీ కలుపుకొని పోవాలన్నారు. మన అవకాశాలను ఎప్పుడూ తెరిచే ఉంచాలన్నారు. ఆర్‌అండ్‌డీ విషయంలో పెట్టుబడులు అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ప్రాథమిక ఆర్‌అండ్‌డీకి, ఏఐ మోడళ్ల అభివృద్ధికి వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టడానికి మధ్య చాలా వ్యత్యాసం ఉందన్నారు. అన్ని రంగాల్లో ప్రాథమిక ఆర్‌అండ్‌డీపై పెట్టుబడులు రావాలన్నారు. ఏదో ఒకరోజు ఏఐ మానవాళిని తుడిచిపెట్టేస్తుందనే అంచనాలను ఎప్పటికీ అంగీకరించబోనని శ్రీధర్ వెంబు అన్నారు. ఏఐ సామర్థ్యం పెరుగుతుండడం వల్ల కలిగే ప్రమాదాలపై నెలకొన్న ఆందోళనలను మాత్రం తాను కొంతవరకు అంగీకరిస్తానని పేర్కొన్నారు. ఏఐ టూల్స్‌పై ప్రజలు అధికంగా ఆధారపడడం వల్ల విచక్షణ, నైపుణ్యాలు ఎక్కడ తుడిచిపెట్టుకుపోతాయోనన్న ఆందోళనను వ్యక్తంచేశారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ అభివృద్ధిని నిలిపివేయాలన్న పిలుపుపైనా స్పందించారు. అది ఏమాత్రం సాధ్యం కాదన్నారు. ఏఐ అభివృద్ధిలో కంపెనీలు నిత్యం పోటీ పడుతుంటాయని చెప్పారు. పోటీదారులు ఈ సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నప్పుడు, ప్రధాన ఏఐ ప్రయోగశాలలు అభివృద్ధిని ఆపేందుకు సాహసించబోవన్నారు. నేర్చుకునే దశలో ఏఐపై ఆధారపడడం వల్ల భవిష్యత్‌లో నైపుణ్యం, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే శక్తిని కోల్పోతామని శ్రీధర్ వెంబు అన్నారు. ఏఐ సామర్థ్యం పెరుగుతున్న కొద్దీ సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ ఉద్యోగాలు మరింత ఒత్తిడి ఎదుర్కొంటాయని పేర్కొన్నారు.

లాభాల్లో ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి. ఐరాస 81వ సర్వ ప్రతినిధి సభ సమావేశం సందర్భంగా అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు జరగడం, ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. మెటల్, రియాల్టీ, ఎఫ్ఎంసీజీ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. దీంతో సూచీలు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 74,648.32 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,529.08) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో ఓ దశలో 74,973.74 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 299.17 పాయింట్లు లాభపడి 74,828.25 వద్ద ముగిసింది. నిఫ్టీ 117.80 పాయింట్లు పెరిగి 23,446.80 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.74గా ఉంది. సెన్సెక్స్ 30లో టాటాస్టీల్, బజాజ్‌ఫైనాన్స్, ఐటీసీ, అల్ట్రాటెక్‌సిమెంట్, పవర్ గ్రిడ్, ఎల్‌అండ్‌టీ షేర్లు లాభపడ్డాయి. హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 99.06 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,316.53 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

సమ్మె ఎఫెక్ట్.. ఆదివారం తెరుచుకోనున్న బ్యాంకులు

బ్యాంకు యూనియన్ల సమ్మె నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు సమ్మె తలపెట్టిన నేపథ్యంలో ఆదివారం బ్యాంకు కార్యకలాపాలు నిర్వహించాలని కేంద్ర ఆర్థిక శాఖ, రిజర్వ్ బ్యాంక్ నిర్ణయించాయి. దీంతో ఈ నెల 27న బ్యాంకు శాఖలు తెరుచుకోనున్నాయి. సమ్మె నేపథ్యంలో బ్యాంకు వినియోగదారులకు, కస్టమర్లకు ఇబ్బందులు రాకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆర్థిక శాఖ ప్రకటించింది. సాధారణంగా నాలుగో శనివారం, ఆదివారం బ్యాంకులు పనిచేయవు. 28 నుంచి (సోమ, మంగళ, బుధ) మూడు రోజుల సమ్మె నేపథ్యంలో మొత్తంగా ఐదు రోజుల పాటు బ్యాంకు సేవలకు విఘాతం కలగనుంది. ఈ క్రమంలో ఆదివారం బ్యాంకులు తెరిచేలా నిర్ణయం తీసుకున్నట్లు ఆర్థిక శాఖ తెలిపింది. ఆర్‌బీఐ కూడా అందుకు ఆమోదం తెలిపినట్లు పేర్కొంది. దీంతో ప్రభుత్వ రంగ బ్యాంకులతో పాటు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఆదివారం పనిచేయనున్నాయని ఆర్థిక శాఖ తెలిపింది. వారంలో అయిదు రోజుల పనిదినాల విధానం అమలు చేయాలనే ఒప్పందాన్ని ఆమోదించకపోవడంపై ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. 2024 మార్చిలో కుదిరిన ఒప్పందం ప్రకారం వారానికి అయిదు రోజులే పని చేసి, రోజుకు 40 నిమిషాలు అదనంగా పనిచేసేందుకు సిద్ధపడినా ప్రభుత్వం నుంచి ఆమోదం రాలేదు. దీంతోపాటు స్కేల్-4, ఆపై అధికారులకే ప్రత్యేకంగా పర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది. సమ్మె ప్రభావం దృష్ట్యా ఎస్‌బీఐ సహా 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు తమ వినియోగదారులకు సూచనలు జారీ చేశాయి. శాఖల్లో నేరుగా చేసే పనులకు ఆటంకం కలిగినా డిజిటల్ సర్వీసులు యథాతథంగా అందుబాటులో ఉంటాయని తమ ప్రకటనల్లో స్పష్టం చేశాయి. యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ యాప్‌లు, ఏటీఎం ద్వారా చేసే డిజిటల్ బదిలీలు కొనసాగుతాయి. బిల్లుల చెల్లింపులు, చిన్న మొత్తం బదిలీలకు వినియోగదారులు డిజిటల్ మార్గాలనే ఎంచుకోవాలని బ్యాంకులు సూచిస్తున్నాయి.

క్రీడలు

డబ్ల్యూఏపీఎల్‌కు వర్షం దెబ్బ.. అమరావతి - వైజాగ్ మ్యాచ్ రద్దు

మహిళల ఆంధ్రా ప్రిమియర్ లీగ్ 2026 (WAPL 2026) సీజన్‌లో తొలిసారి వరుణుడు ఓ మ్యాచ్‌లో విజయం సాధించాడు. అమరావతి ఈ ఛాంపియన్స్ - వైజాగ్ ఫైర్ బర్డ్స్ మధ్య మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించింది. ఎంతకీ తగ్గకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో ఇరు జట్లకూ చెరొక పాయింట్‌ను ఇచ్చారు. పాయింట్ల పట్టికలో అమరావతి అగ్రస్థానానికి చేరుకుంది. ఆ జట్టు ఖాతాలో ప్రస్తుతం ఐదు పాయింట్లు ఉన్నాయి. రెండు విజయాలు సాధించగా.. ఒక ఓటమి.. మరొక మ్యాచ్ రద్దైన సంగతి తెలిసిందే. ఇక వైజాగ్ కూడా పాయింట్ల ఖాతాను తెరవడం గమనార్హం. ఇప్పటివరకూ ఆడిన గత మూడు మ్యాచుల్లోనూ ఆ జట్టు ఓడిపోయింది. ఇప్పుడు రద్దు కావడంతో ఒక పాయింట్ వచ్చింది. ఇవాళ గోదావరి గోల్డెన్ ఈగల్స్ vs రాయలసీమ జెన్ స్టార్స్ మధ్య రెండో మ్యాచ్ జరగనుంది. దీనికి కూడా వర్షం ముప్పు ఉన్నట్లు తెలుస్తోంది.

బ్యాడ్మింటన్‌లో కాంస్యంతో సరి.. ఫైనల్‌కు చేరిన రోషిబిన

ఆసియా క్రీడల్లో నాలుగో రోజు భారత్‌కు నాలుగు పతకాలు వచ్చాయి. వెయిట్ లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను రజతం గెలుచుకోగా.. స్కీట్ పురుషుల, మహిళల విభాగంలో కాంస్యాలు వరించాయి. తాజాగా భారత్ ఖాతాలో మరో కాంస్యం వచ్చి చేరింది. బ్యాడ్మింటన్ పురుషుల టీమ్ ఈవెంట్‌లో భారత్ సెమీస్‌లో ఓడిపోయింది. దీంతో కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. వుషు అథ్లెట్ రోషిబిన అద్భుతం చేసింది. వరుసగా రెండోసారి ఆసియా గేమ్స్ ఫైనల్‌కు చేరుకుంది. గత ఎడిషన్‌లో రోషిబిన రజతం నెగ్గింది. అంతకుముందు 2018లో కాంస్యం సాధించింది. సెమీస్‌లో భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టుకు తీవ్ర పోటీ ఎదురైంది. డిఫెండింగ్ ఛాంపియన్ చైనా ముందు నిలవలేకపోయింది. చివరికి 1-3 తేడాతో భారత్‌పై చైనా విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో లక్ష్య సేన్ ఓడిపోగా. సాత్విక్ - చిరాగ్ శెట్టి అద్భుతంగా ఆడి తొలి డబుల్స్‌లో గెలిచారు. అయితే, రెండో డబుల్స్‌తోపాటు సింగిల్స్‌లో భారత ప్లేయర్లు తేలిపోయారు. సింగిల్స్‌లో ఆయుష్ శెట్టి.. డబుల్స్‌లో అర్జున్ - హరిహరణ్ కూడా ఓటమితో భారత్ సెమీస్‌లోనే వెనుదిరిగింది. దీంతో చైనా ఫైనల్‌కు చేరుకుంది. పురుషుల కబడ్డీ టీమ్ అదరగొట్టేస్తోంది. హ్యాట్రిక్ విజయాలతో సెమీస్‌కు దూసుకెళ్లింది. దీంతో పతకం ఖాయం చేసుకుంది. గ్రూప్ స్టేజ్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. ఏ దశలోనూ ప్రత్యర్థికి అవకాశం ఇవ్వలేదు. చివరికి 48-25 తేడాతో భారత్ విజయం సాధించింది. ప్రస్తుతం భారత్ ఖాతాలో 11 పతకాలు ఉన్నాయి. అందులో ఒక స్వర్ణం, ఐదు రజతాలు, ఐదు కాంస్య పతకాలు ఉన్నాయి. పట్టికలో 13వ స్థానంలో ఉంది. చైనా (58), జపాన్ (48), దక్షిణ కొరియా (29), కజకిస్తాన్ (14), థాయ్‌లాండ్ (6) టాప్-5లో కొనసాగుతున్నాయి.

క్రికెటర్ కాబోయి.. 'సాఫ్ట్'గా పతకం పట్టేసి: ఆసియా గేమ్స్‌లో మీనా చరిత్ర

జై మీనా.. భారత క్రీడారంగం తన చరిత్రలో మరో కొత్త పేరును లిఖించుకుంది. మను బాకర్ ఏ పతకం తెస్తుందా..? అని అంతా ఎదురుచూస్తోన్న తరుణంలో దేశ ప్రజలకు పెద్దగా పరిచయం లేని సాఫ్ట్ టెన్నిస్ లో ఆసియా క్రీడల వేదికగా జై మీనా భారత్‌కు తొలిపతకం అందించాడు. గెలిచింది కాంస్యమే అయినా.. మరో కొత్త క్రీడాంశంపై యువత దృష్టిసారించేలా చేశాడు. ఇంతకీ ఎవరీ జై మీనా. మధ్యప్రదేశ్‌లోని దేవాస్‌కు చెందిన 24 ఏళ్ల జై మీనా (Jay Meena).. సాఫ్ట్‌బాల్‌లో బుధవారం జరిగిన పురుషుల వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం దక్కించుకున్నాడు. సెమీఫైనల్‌లో జపాన్ ఆటగాడు టకుయా కురోసాకా చేతిలో 4-2..(3-5, 1-4, 1-4, 4-1, 6-4, 1-4) తేడాతో ఓడటంతో మూడోస్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 45 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఒక దశలో పుంజుకున్నట్లే కనిపించినా.. తర్వాత తడబడ్డాడు. అయినా సాఫ్ట్ టెన్నిస్ లో ఇది భారత్‌కు చరిత్రాత్మక విజయమే. బాల్‌బాయ్ నుంచి ఇంటర్నేషనల్ స్టార్‌గా..దేవాస్‌లోని పయనీర్ పబ్లిక్ స్కూల్‌లో జై మీనా కు ఈ సాఫ్ట్ టెన్నిస్ పరిచయమైంది. బాల్‌బాయ్‌గా ఉంటూ.. క్రికెటర్ కావాలని కలలు కంటున్న అతడిని ఈ ఆట ఎంతగానో ఆకట్టుకుంది. ఆ ఆసక్తి పెరిగి.. 14 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే స్థాయికి తీసుకువచ్చింది. 2022లో గుజరాత్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో బంగారం పతకం గెల్చుకున్న మీనా.. 2025లో పురుషుల సింగిల్స్‌లో జాతీయ ఛాంపియన్‌గా మారాడు. 2024లో భారత్‌కు తొలి అంతర్జాతీయ పతకాన్ని అందించాడు. ఆ ఏడాది జరిగిన వరల్డ్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్స్‌లో మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్యం దక్కించుకున్నాడు.

అప్పుడు మల్లీశ్వరి.. ఇప్పుడు మీరాబాయి

ఆసియా గేమ్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్ మెడల్ కోసం భారత సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. 28 ఏళ్ల తర్వాత ఈ విభాగంలో మన వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను ఎట్టకేలకు పతకం సాధించింది. జపాన్ వేదికగా జరుగుతోన్న 2026 ఆసియా క్రీడల్లో మహిళల 49కేజీల విభాగంలో ఆమె రజతాన్ని ముద్దాడింది. అంతేకాదు.. ఆసియా క్రీడల్లో మెడల్ రాలేదన్న వెలితి కూడా చానుకు ఇప్పుడు తీరిపోయింది. బుధవారం జరిగిన పోటీల్లో మీరాబాయి చాను స్నాచ్‌లో 87 కేజీలు, క్లీన్ అండ్ జర్క్‌లో 111 కేజీలు ఎత్తింది. మొత్తంగా 198 కిలోలు ఎత్తి రెండో స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో తొలి స్థానంలో నిలిచిన ఉత్తరకొరియా వెయిట్‌లిఫ్టర్ రి సాంగ్ గమ్.. రికార్డు స్థాయిలో మొత్తం 215 కేజీలు (స్నాచ్‌లో 94 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 121 కిలోలు) ఎత్తి బంగారు పతకం సాధించింది. ఆసియా గేమ్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో భారత్‌కు పతకం రావడం 28 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడే కావడం గమనార్హం. చివరిసారిగా 1998లో జరిగిన ఆసియా క్రీడల్లో కరణం మల్లీశ్వరి రజతం సాధించింది. ఇక, ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్, కామన్వెల్త్ ఇలా అంతర్జాతీయ టోర్నీల్లో అనేక పతకాలు సాధించినా.. ఆసియా క్రీడల్లో మాత్రం ఆమె ఇప్పటివరకు మెడల్ తీసుకోలేదు. నేటితో ఆ కొరత తీరింది. మీరాబాయి చాను గతంలో టోక్యో ఒలింపిక్స్‌లో రజతం, రెండు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాలు, కామన్వెల్త్ గేమ్స్‌లో రెండు స్వర్ణాలు, ఒక రజత పతకాలను సాధించిన సంగతి తెలిసిందే.

స్కీట్‌లో భారత్‌కు డబుల్ మెడల్స్.. మను బాకర్ మిస్

ఆసియా క్రీడల్లో భారత పతకాల వేట కొనసాగుతోంది. బుధవారం రెండు ఈవెంట్లలో మెడల్స్ దక్కాయి. స్కీట్ టీమ్ విభాగంలో భారత మహిళ, పురుష జట్లు కాంస్యం దక్కించుకున్నాయి. అటు భారత స్టార్ షూటర్ మను బాకర్ నిరాశకు గురిచేసింది. మహిళల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో భారత త్రయం రైజా దిల్లాన్, మహేశ్వరి చౌహాన్, పరినాజ్ ధలీవాల్.. 331 స్కోరుతో మూడో స్థానంలో నిలిచారు. దీంతో కాంస్యం దక్కింది. ఈ ఈవెంట్‌లో చైనా బృందానికి బంగారు పతకం రాగా.. కజకిస్థాన్ టీమ్ రజతం గెలిచింది. ఇక, పురుషుల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో అనంత్‌జీత్ సింగ్ నరుకా, భవతేగ్ సింగ్ గిల్, మైరాజ్ అహ్మద్ ఖాన్.. 346 స్కోరుతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం సాధించారు. మరోవైపు, వ్యక్తిగత విభాగంలో అనంత్‌జీత్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఒలింపిక్‌లో డబుల్ మెడల్స్‌తో ఆకట్టుకున్న మనుబాకర్‌కు.. ఆసియా గేమ్స్‌లో నిరాశ ఎదురైంది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో కొద్దిలో ఆమె పతకం చేజార్చుకుంది. ఫైనల్ పోరులో 181.1 స్కోరుతో మను ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. ఇదే విభాగం టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్ల బృందం కాంస్యాన్ని త్రుటిలో మిస్ అయ్యింది. అటు సాఫ్ట్ టెన్నిస్ పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాడు జై మీనాకు కాంస్యం దక్కింది. సెమీస్‌లో జపాన్ క్రీడాకారుడి చేతిలో జై 2-4తో ఓటమిపాలయ్యాడు.

వుదయం సినిమా MOVIE TIME!

జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో 'కల్కి 2898 ఏడీ

వుదయం సినిమా: 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో ఇండియన్ స్క్రీన్స్ పై బిగ్గెస్ట్ హిట్‌గా చరిత్ర సృష్టించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి రెండు ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డులు లభించాయి. వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై తెరకెక్కిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి బెస్ట్ పాపులర్ ఫిల్మ్ ప్రొవైడింగ్ హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్ అవార్డు దక్కింది. అలాగే సినిమాకు అద్భుతమైన ప్రపంచాన్ని సృష్టించడంలో కీలక పాత్ర పోషించిన ప్రొడక్షన్ డిజైనర్ నితిన్ జిహానికి బెస్ట్ ప్రొడక్షన్ డిజైనర్ అవార్డు లభించింది.చిత్ర దర్శకుడు నాగ్ అశ్విన్, నిర్మాతలు అశ్వినీదత్, స్వప్నదత్ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొని అవార్డులు అందుకున్నారు. భారీ కాన్వాస్‌పై, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపొందిన 'కల్కి 2898 ఏడీ'కి జాతీయ స్థాయిలో ఈ గుర్తింపు దక్కడం వైజయంతీ మూవీస్‌కు మరో ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచింది.దర్శకుడు నాగ్ అశ్విన్ తన యూనిక్ విజన్‌తో క్రియేట్ చేసిన ఫ్యూచరిస్టిక్ ప్రపంచం, అద్భుతమైన ప్రొడక్షన్ డిజైన్, సాంకేతిక నైపుణ్యం, నటీనటుల ప్రతిభకు ఈ అవార్డులు గుర్తింపుగా నిలిచాయి. దశాబ్దాలుగా భారతీయ సినీ రంగంలో వైజయంతీ మూవీస్ తనదైన ముద్ర వేస్తూ వస్తోంది. ప్రతిష్ఠాత్మక చిత్రాలను నిర్మిస్తూ, కొత్త కథలను అద్భుతంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంలో సంస్థ ఎప్పుడూ ముందుంటోంది. ఈ క్రమంలో 'కల్కి 2898 ఏడీ'కి రెండు జాతీయ అవార్డులు రావడం సంస్థ ప్రయాణంలో మరో గర్వ కారణమైన అధ్యాయంగా నిలిచింది. 72వ జాతీయ చలన చిత్ర అవార్డుల వేదికపై 'కల్కి 2898 ఏడీ' టీమ్ అవార్డులు అందుకున్న ఈ ప్రత్యేకమైన క్షణాలు సినీ అభిమానులకు కూడా మెమరబుల్ గా నిలిచాయి.

72వ జాతీయ చలనచిత్ర అవార్డుల వేడుకలో భాగంగా 'కమిటీ కుర్రోళ్లు'

వుదయం సినిమా: 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రధానోత్సవంలో భాగంగా 'కమిటీ కుర్రోళ్లు' చిత్రానికి రెండు కేటగిరీల్లో వచ్చిన అవార్డులను మేకర్స్ అందుకున్నారు. 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్ఎల్‌పి', 'శ్రీ రాధా దామోదర స్టూడియోస్' తరపున నిహారిక కొణిదెల 'ఉత్తమ తెలుగు చిత్రం' విభాగంలో 'రజత కమలం' అవార్డును స్వీకరించగా, దర్శకుడు యదు వంశీ కూడా ఈ ప్రతిష్టాత్మక అవార్డుని అందుకున్నారు. ఈ విజయానికి అదనంగా 'కమిటీ కుర్రోళ్లు' చిత్రానికి గాను పి. రవి కుమార్ 'ఉత్తమ మేకప్' అవార్డును అందుకున్నారు. ఈ వేడుకకు నిహారికతో పాటు హాజరైన నాగబాబు, పద్మజ కొణిదెల, ఫణి అడపాక వంటి చిత్ర బృంద సభ్యులు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు.తెలుగు మూలాలతో మట్టి కథగా మొదలై దేశంలోనే అత్యున్నత సినీ గుర్తింపును సంపాదించుకున్న 'కమిటీ కురొల్లు' చిత్రానికి సంబంధించిన అసాధారణ ప్రయాణం నేడు అత్యున్నత స్థాయికి చేరుకున్నట్టుగా నిలిచింది. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో నిహారిక ఫీచర్-ఫిల్మ్ నిర్మాతగా ప్రయాణాన్ని ప్రారంభించారు. తొలి అడుగులోనే 16 మంది కొత్త నటీనటులతో కూడిన బృందంతో పాటు, డెబ్యూ డైరెక్టర్ యదు వంశీని నమ్మి ముందుకు సాగారు. ఆమె వేసిన ఈ అడుగు ఇప్పుడు భారతీయ సినిమా రంగంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన గుర్తింపులలో ఒకటిగా పరిణమించింది. ఉత్తమ తెలుగు చిత్రంగా రజత్ కమల్ పురస్కారాన్ని యదు వంశీ కూడా అందుకున్నారు.

#RAPO23 రెండో షెడ్యూల్ పూర్తి

వుదయం సినిమా: ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న #RAPO23 చిత్రం గ్రాండ్ స్కేల్‌లో రూపొందుతోంది. తాజాగా ఈ సినిమా రెండో షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. రామ్ పోతినేని తొలిసారి దర్శకత్వ బాధ్యతలు చేపడుతున్న ఈ సినిమాతో తన ప్రత్యేకమైన విజన్‌ను తెరపై ఆవిష్కరించనున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రామ్ పోతినేనికి జోడీగా సంయుక్త కథానాయికగా నటిస్తున్నారు.తాజా షెడ్యూల్‌లో భాగంగా భారీ స్థాయిలో హై-ఇంటెన్సిటీ నైట్ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారు. ఏకంగా ఒక కిలోమీటర్ మేర విస్తరించిన భారీ స్ట్రెచ్‌లో ఈ యాక్షన్ సీక్వెన్స్‌ను తెరకెక్కించారు. ఆ మొత్తం ప్రాంతాన్ని లైట్స్‌తో నింపి, సినిమా ప్రత్యేకమైన నియో-నోయిర్ వరల్డ్‌కు సరిగ్గా సరిపోయేలా అద్భుతమైన విజువల్ క్యాన్వాస్‌ను క్రియేట్ చేశారు. ఈ భారీ సెటప్‌కు సంబంధించిన ఫ్లైట్ వ్యూ చూస్తేనే సీక్వెన్స్‌ను ఎంత గ్రాండ్‌గా మౌంట్ చేశారో అర్థమవుతోంది.యాక్షన్ కొరియోగ్రాఫర్ కెవిన్ మాస్టర్ ఈ ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్‌ను డిజైన్ చేయగా, నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమాటోగ్రాఫర్ తిరునావుక్కరసు (తిరు) ఈ విజువల్స్‌ను చిత్రీకరించారు. రామ్ పోతినేని ఊహించిన ప్రత్యేకమైన విజన్‌కు అనుగుణంగా సినిమాకు డిఫరెంట్ విజువల్ టెక్స్చర్‌ను అందిస్తున్నారు.

ప్రొడక్షన్ నెం.1 'పెద్దగట్టు జాతర'

వుదయం సినిమా: హిట్ మెషీన్ అనిల్ రావిపూడి క్లాప్ తో గ్రాండ్‌గా ప్రారంభమైన విరాన్ష్, విజయ్ కుమార్ సి.హెచ్, ఆర్‌కే రెడ్డి ఫిల్మ్స్ ప్రొడక్షన్ నెం.1 'పెద్దగట్టు జాతర' ఆర్‌కే రెడ్డి ఫిల్మ్స్ ప్రొడక్షన్ నెం.1గా తెరకెక్కనున్న కొత్త చిత్రం 'పెద్దగట్టు జాతర' గ్రాండ్‌గా ప్రారంభమైంది. ఈ చిత్రంతో విరాన్ష్ హీరోగా డెబ్యూ చేస్తున్నారు. ఎ. రామ కృష్ణ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విజయ్ కుమార్. సి.హెచ్ దర్శకత్వం వహిస్తున్నారు.ఈ రోజు చిత్రం బృందం ఘనంగా ప్రారంభోత్సవం నిర్వహించింది. ముహూర్తపు సన్నివేశానికి హిట్ మెషీన్ అనిల్ రావిపూడి క్లాప్ కొట్టి సినిమా టైటిల్‌ను రివీల్ చేశారు. శివలెంక కృష్ణ ప్రసాద్ స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందించారు. దేవి శ్రీ గురూజీ కెమెరా స్విచ్ ఆన్ చేశారు.పలువురు సినీ ప్రముఖులు, యూనిట్ సభ్యులు ఈ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

'జార్జ్ క్రిష్'లో హీరోయిన్‌గా మానస వారణాసి- ఫస్ట్ బూస్టర్

వుదయం సినిమా: 'నారీ నారీ నడుమ మురారీ', 'బైకర్' విజయాలతో జోష్‌లో ఉన్న చార్మింగ్ స్టార్ శర్వానంద్, దర్శకుడు శ్రీను వైట్లతో తొలిసారిగా చేతులు కలిపారు. వీరి కాంబినేషన్ లో 'జార్జ్ క్రిష్' పండుగ సీజన్‌లో కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అలరించబోతోంది. ఏటీవీ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తుండగా, అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం 2027 జనవరి 14న సంక్రాంతికి ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. గతంలో విడుదల చేసిన టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో కలర్‌ఫుల్ ఫెస్టివ్ లుక్ ఆకట్టుకుంది. అందులో శర్వానంద్ హీరోయిన్‌ను ఎత్తుకున్న సిల్హౌట్ ఆసక్తిని పెంచింది.తాజాగా ఈ సినిమాలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 'కపుల్ ఫ్రెండ్లీ' తో సూపర్ హిట్ అందుకున్న మానస వారణాసి.. 'జార్జ్ క్రిష్'లో శర్వానంద్‌కు జోడీగా కనిపించనున్నారు. టైటిల్ పోస్టర్‌ను బట్టి సినిమాలో లవ్ స్టోరీకి కీలక ప్రాధాన్యత ఉండబోతోంది. మానస పాత్ర కథలో కీలకంగా ఉండనుంది. ఫస్ట్ బూస్టర్‌ను రేపు విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రానికి అటాప్ టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది.

'మనంసైతం' సేవలకు 13 వసంతాలు పూర్తి

వుదయం సినిమా: ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం.. ఆర్థికంగా వెనుకబడిన వారికి భరోసా ఇవ్వడం.. ఒంటరిగా మిగిలిన వృద్ధులకు తోడుగా నిలవడం.. సేవను ఒక కార్యక్రమంగా కాకుండా బాధ్యతగా భావిస్తూ ముందుకు సాగుతున్న 'మనం సైతం' ఫౌండేషన్ మరో బృహత్తర సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'సపర్య – వుయ్ కేర్ ఫర్ అన్ కేర్డ్' పేరుతో నూతన ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, నటుడు కాదంబరి కిరణ్ ప్రకటించారు.హైదరాబాద్‌లోని తెలుగు ఫిలిం ఛాంబర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కాదంబరి కిరణ్ మాట్లాడుతూ.. గత 13 ఏళ్లుగా 'మనం సైతం' ద్వారా సమాజంలో ఆపదలో ఉన్నవారికి, అవసరార్థులకు వివిధ రూపాల్లో సహాయాన్ని అందిస్తున్నామని తెలిపారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలనే

ఉద్దేశంతో 'సపర్య' చెప్పారు. ఆశ్రమంతో పాటులో భాగంగా అనాథాశ్రమం, బాటులో ఉండే 'జనతా వైద్యం' కాదంబరి కిరణ్ తెలిపారు. కేవలం రోగులు, వృద్ధులు, అనాథలు మానసిక ప్రాజెక్టును ప్రత్యేకంగా తీర్చిదిద్దుతు పాండ్, దాని చుట్టూ వాకింగ్ ట్రాక్, గాజు తలుపులతో కూడిన గదులు వాతావరణాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆత్మీయత.. ఈ మూడింటినీ ఒకే చోట లక్ష్యమని పేర్కొన్నారు. ఒంటరి నేటి సమాజంలో పిల్లలు విదేశాల్లోనో, చాలామంది వృద్ధులు ఒంటరిగా మిగిలి ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి సరమైన వసతి, వైద్యం, మానవీయమైన ర్య'లోని ప్రధాన ఉద్దేశాల్లో ఒకటని మేమున్నాం' అనే భరోసాను కల్పించేలా చెప్పారు. సినీ కార్మికుల పిల్లలకు విద్యా కేవలం వైద్యం, వసతికే పరిమితం విస్తరించనున్నట్లు కాదంబరి కిరణ్

ప్రాజెక్టును రూపొందించినట్లు 'జనతా వైద్యం''సపర్య' ప్రాజెక్టు వృద్ధాశ్రమం, పేదలకు అందు ఆసుపత్రి ఏర్పాటు చేయనున్నట్లు వైద్యం అందించడమే కాకుండా.. ప్రశాంతతతో ఉండేలా ఈ న్నామని చెప్పారు.పెద్ద వాటర్ పచ్చని చెట్లతో కూడిన వనం, వంటి సౌకర్యాలతో ప్రశాంతమైన వివరించారు. వైద్యం, వసతి, అందించాలన్నదే 'సపర్య' వృద్ధులకు 'మనం సైతం' తోడు ఇతర నగరాల్లోనో స్థిరపడటంతో పోతున్నారని కాదంబరి కిరణ్ వృద్ధులను ఆదరించి, వారికి అవ తోడ్పాటును అందించడమే 'సప తెలిపారు. 'ఎవరూ లేని వారికి ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు భరోసాసేవా కార్యక్రమాలను చేయకుండా విద్యారంగంలోనూ తెలిపారు.

'మండాడి' టీంను అభినందించిన యూనివర్సల్ హీరో కమల్ హాసన్

వుదయం సినిమా: ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్ మీద సుహాస్, సూరి ప్రధాన పాత్రల్లో మతిమారన్ పుగళేంది తెరకెక్కించిన 'మండాడి' చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. ఎల్రెడ్ కుమార్ నిర్మించిన ఈ మూవీలో సూరి, సుహాస్, మహిమా నంబియార్, సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ తదితరులు కీలక పాత్రలను పోషించారు. ఏపీ, తెలంగాణలో ఈ చిత్రాన్ని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పి సెప్టెంబర్ 10న రిలీజ్ చేశారు. ఆల్రెడీ వంద కోట్ల క్లబ్బులో చేరిన 'మండాడి' వరల్డ్ వైడ్‌గా ఇంకా దూసుకుపోతోంది.'మండాడి' బ్లాక్ బస్టర్ అయిన సందర్భంగా ఇప్పటికే రజినీకాంత్ టీంకి అభినందనలు తెలియజేశారు. ఇక తాజాగా లోక నాయకుడు కమల్ హాసన్ 'మండాడి' టీంని అభినందించారు. ప్రత్యేకంగా టీంని కలిసి ప్రతీ ఒక్కరితో మాట్లాడి 'మండాడి' గురించి గొప్పగా ప్రశంసించారు. దర్శక, నిర్మాతలో పాటుగా సూరి, సుహాస్, రవీంద్ర విజయ్ అందరినీ కమల్ హాసన్ ప్రత్యేకంగా కలిసి, అందరితో మాట్లాడి, బెస్ట్ విషెస్‌ను తెలియజేశారు.'నా జీవితంలో మర్చిపోలేని ఓ ఘటన. ఈ రోజుని ఎప్పటికీ గుర్తుండిపోతుంది. మా 'మండాడి' టీం మీద డా. కమల్ హాసన్ సర్ కురిపించిన ప్రేమ, ఆయన ఇచ్చిన ఆశీర్వాదం, చెప్పిన మాటలు మాకు ఎంతో ప్రత్యేకం.

పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన "ఆదివారం"

వుదయం సినిమా: జెఎస్ఆర్ క్రియేషన్స్ 999 బ్యానర్ పై సుబ్రమణ్యం చిగురుపాటి రచన దర్శకత్వంలో జెఎస్ రాజా రెడ్డి నిర్మాతగా ప్రారంభమైన చిత్రం ఆదివారం. ఈ చిత్రానికి సాకేత్ సినిమాటోగ్రఫీ బాధ్యతను చేపట్టగా ఎస్ఎస్ వెంకటేష్ సంగీతం అందిస్తున్నారు. దువ్వరపు వెంకటేష్ ఎడిటర్ గా పని చేయనున్న ఈ చిత్రంలో రఘు తేజ, సునీల్, తార, ఝాన్సీ ప్రముఖ పాత్రలు పోషిస్తుండగా విలాస్, అశోక్, సయ్యద్ మెహబూబ్ భాషా తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. హైదరాబాద్ లోని ఫిలిం ఛాంబర్ లో పూజా కార్యక్రమాలతో ఈ చిత్ర ప్రారంభం కాగా ప్రముఖ సినీ నిర్మాత కెఎస్ రామారావు గారు, రామ సత్యనారాయణ గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సినిమాకు స్క్రిప్ట్ నిర్మాత జెఎస్ రాజారెడ్డి గారు దర్శకుడు సుబ్రమణ్యం గారికి అందచేయగా కెఎస్ రామారావు గారు క్లాప్ కొట్టారు, రామ సత్యనారాయణ గారు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా రామ సత్యనారాయణ మాట్లాడుతూ... "దర్శకుడు నాకు ఎంతోకాలం నుండి పరిచయం ఉంది. గతంలో కూడా కొన్ని సినిమాలు చేశాడు. కంటెంట్ ఉంటే చిన్న సినిమాలను ప్రేక్షకులు

బాగా ఆదరిస్తారు. ఈ చిత్ర బృందం అందరికీ ఆల్ ది బెస్ట్. నెల్లూరు నుండి వచ్చిన ఈ దర్శకునికి, అలాగే కొత్త నటీనటులకు మంచి విజయం రావాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాకు నా పూర్తి సహకారం ఉంటుంది. ఈ సినిమా ప్రారంభానికి వచ్చి ఆశీర్వాదాలు ఇచ్చిన కెఎస్ రామారావు గారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఈ సినిమా దర్శకుడు జాగ్రత్తగా పూర్తి చేయాలని, మంచి పబ్లిసిటీ చేసి ప్రేక్షకులకి తీసుకుని వెళ్లాలని కోరుకుంటున్నాను.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.